శుక్రవారం
16•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 250
• పేజీలు : 16 + (24/16)

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు
పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి
అవిశ్రాంతంగా పాటుపడుతున్న నిగర్వి, నిస్వార్థ సేవా తత్పరులు
తెలంగాణ రాష్ట్ర పితామహులు మచ్చలేని మహానాయకులు
తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ గా తీర్చిదిద్దేందుకు
నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
HAPPY BIRTHDAY
శ్రీ కొమర వెంకటేష్ అధ్యక్షులు
డా॥ ఎం. ప్రభాకర్ రెడ్డి "చిత్రపురి హిల్స్"
తెలుగు ఫిలిమ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్
డా॥ ఎం. ప్రభాకర్ రెడ్డి "చిత్రపురి హిల్స్" తెలుగు ఫిలిమ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్మిక సభ్యులు



రేపు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న రాష్ట్ర రథసారథి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు
Chairman, TSMDC
వేముల ప్రశాంత్ రెడ్డి
Chairman, Mission Bhagiratha
Chairman Civil Supplies
Chairman Sports
Chairman, Kakatiya Urban Development
Chairman Irrigation Development
Chairman, Forest Development
Chairman Dairy Development Corporation
Chairman, Seeds Development Corporation
Chairman T.S. Food Commission
Chairman Telangana Sahithya Academy
Chairman Road Development Corporation
Chairman Housing Corporation
Chairman Handicapped Development Corporation
Chairman T.S. Foods Society
Chairman Telangana Overseas Manpower Company Limited
బంగారు తెలంగాణ రూపశిల్పి, అపర భగీరథుడు మహాస్వాప్నికుడై రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తూ
ఇటీవల ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై తలపెట్టిన గురుపూజ కార్యక్రమం ప్రపంచ స్థాయిలో
గుర్తింపు పొందడమే గాక రాబోయే కాలపు యువతకు గురువుల ప్రాముఖ్యత
గురించి వారి వ్యాఖ్యానంతో అందరి మనస్సులను చూరగొని మీ పాలనలో తెలంగాణ ప్రజల
మనోభావాలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టి గ్రామీణ ప్రాంత పేద రెడ్డి విద్యార్థులకు వసతి కల్పించి
విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో నాడు రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి గారు
అబిడ్స్‌లో 4 ఎకరాలు ఇవ్వగా నేడు పేద విద్యార్థులకు 15 ఎకరాలు 10 కోట్లు మంజూరుచేసి
విద్యార్థులను అక్కున చేర్చుకొని ప్రపంచ స్థాయిలో ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో యూనివర్సిటీలు
నిర్మిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పరిపాలన దక్షత కలిగిన వారిని
తీసుకొని రెడ్డి సామాజిక వర్గానికి పెద్దపీట వేసిన
మీకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు కలిగి నిండునూరేళ్ళు
ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ.. రాష్ట్రాన్ని విజయపథంలో నడిపించాలని ఆశిస్తున్నాము.
వంగాల సంజీవ రెడ్డి
ఎం.ఎ.ఎల్‌ఎల్‌బి
మేనేజింగ్ పార్ట్‌నర్ పద్మశ్రీ ఎస్టేట్స్
రెడ్డి జనసంఘం మాజీ అధ్యక్షులు
అబిడ్స్, హైదరాబాద్
ప్రొఫెసర్ కంచర్ల దశరథ రెడ్డి
ఫార్మర్ ప్రిన్సిపాల్ జె.ఎన్.టి.యు
రెడ్డి జన సంఘం సలహాదారు,
అబిడ్స్, హైదరాబాద్
చైర్మన్, రేడియో ఎల్లయ్యమామ జానపద అకాడమీ

శుక్రవారం
16•2•2018
హైదరాబాద్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE


అమెరికా స్కూల్లో నరమేధం


కాల్పుల ఘటన నుంచి ప్రాణాలతో బయటపడి విలపిస్తున్న విద్యార్థిని

పార్క్‌లాండ్, ఫిబ్రవరి 15:

ఉగ్రదాడికి ఏమాత్రమూ తీసిపోని మానసికోన్మాదం అమెరికాలోని ఫ్లోరిడాలో నెత్తుటేర్లు పారించింది. 19 ఏండ్లు కూడా నిండని యువకుడు 17మంది పిల్లల్ని పొట్టనబెట్టుకున్నాడు. తుపాకీ చేతబట్టిన టీనేజర్.. పాఠశాలలోకి చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో 17మంది విద్యార్థులు దుర్మరణం చెందారు. ఓ ఇండియన్-అమెరికన్ విద్యార్థి సహా 19మంది గాయపడ్డారు. వందల మంది చిన్నారులు ఇంకా ఆ భయం నుంచి తేరుకోలేకపోతున్నారు. పార్క్‌లాండ్‌లోని మార్జొరీ స్టోన్‌మ్యాన్ డగ్లస్ హైస్కూల్ పాఠశాల ఆవరణలో ఎటుచూసినా రక్తపుమరకలే కనిపిస్తున్నాయి. కాల్పులకు పాల్పడిన నికోలస్ క్రజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇదే పాఠశాల విద్యార్థి అయిన నికోలస్.. తనను స్కూల్ నుంచి తొలిగించారన్న కోపంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు గుర్తించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం ఈ కాల్పులు జరిగాయి. లోపలికి వస్తూనే దుండగుడు గేటు దగ్గర ముగ్గురిని కాల్చిచంపాడు. ఆ వెంటనే బిల్డింగ్ ఫైర్ అలారంను మోగించాడు. దానిని ఫైర్‌డ్రిల్‌గా భావించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా ఒక్కసారిగా బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. అక్కడ ద్వారానికి ఎదురుగా నిలబడిన దుండగుడు బయటకు వచ్చినవారిని వచ్చినట్టు కాల్చివేశాడు. భయపడిపోయిన

మిగతా 9వ పేజీలో


నిందితుడు నికోలస్ క్రజ్

- సస్పెండ్ చేశారన్న కోపంతో టీనేజర్ ఉన్మాదం
- తోటి విద్యార్థులపై విచక్షణారహిత కాల్పులు
- 17మంది మృతి.. 15మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఒక ఇండో అమెరికన్


గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో నిజామాబాద్ ఎంపీ కవిత, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి కూడా ఉన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నలు కొంటాం

సోమవారం నుంచి క్వింటాలుకు రూ.2300 ధర

- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో నిర్ణయం
- అవసరమైనచోట కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- వ్యవసాయశాఖ మంత్రి పోచారం ప్రకటన
- కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దు
- చివరిగింజ వరకు కొనేందుకు సిద్ధమన్న ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతులు పండించిన ఎర్రజొన్నలను క్వింటాలుకు రూ.2300 చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం నుంచి నిజామాబాద్ జిల్లాలో అవసరమైనచోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి.. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయనున్నారు. ఎర్రజొన్నల కొనుగోలు అంశంపై ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో మాట్లాడామని, ఆయన ఆదేశం మేరకు ఈ నిర్ణయం ప్రకటిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సచివాలయంలో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, బాల్కొండ ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ

మిగతా 11వ పేజీలో

హామీలు నెరవేర్చండి

- వెనుకబడిన జిల్లాలకు సాయం విడుదల చేయండి
- ఎయిమ్స్ మంజూరుచేసినా నిధులివ్వలేదు
- రాష్ట్రానికి ఐఐఎంను మంజూరు చేయండి
- 3.5శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని కొనసాగించండి
- ఢిల్లీలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి ముఖ్యమంత్రి కేసీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని, రాష్ట్రానికి మంజూరుచేసిన ఎయిమ్స్‌కు నిధులు విడుదలచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కోరారు. న్యూఢిల్లీలో గురువారం రాత్రి జైట్లీని ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అఖిలభారత వైద్య శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)ను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ నిధులను మాత్రం ఇవ్వలేదని సీఎం గుర్తుచేశారు. ఈ విషయంలో ముందడుగు వేయాలని విజ్ఞప్తిచేశారు. కేంద్రం సహకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన స్థలం ఇవ్వడంతోపాటు, మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే తెలంగాణకు ఇండియన్

మిగతా 2వ పేజీలో


గురువారం ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో సమావేశమైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

అయామ్ యువర్ ఫ్యాన్

- వ్యవసాయ పెట్టుబడి అద్భుతం
- సీఎంతో కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'అయామ్ యువర్ ఫ్యాన్ (నేను మీ అభిమానిని)'.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ సీఎం కేసీఆర్‌తో అన్నమాట ఇది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందించనున్న ఆర్థిక సహాయానికి ఆయన కితాబు ఇచ్చారు. 'ఇది అధ్యయనం చేయాల్సిన పథకం' అని ప్రశంసించారు. దీనిని తెలంగాణ మోడల్‌గా

మిగతా 4వ పేజీలో


2015లో న్యూయార్క్ స్టోర్ ప్రారంభోత్సవంలో హాలీవుడ్ నటి నవోమి వాట్స్‌తో నీరవ్ మోదీ

నీరవ్ మోదీపై ఈడీ కొరడా

హాలీవుడ్‌కు నీరవ్ తళుకులు

మోదీ బ్రాండ్ వజ్రాలతో హొయలొలికించిన కేట్ విన్స్‌లెట్, డకోటా జాన్సన్ తదితర సెలబ్రిటీలు

బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రియాంకా చోప్రా

13

- పీఎన్‌బీ కుంభకోణంలో రూ.5100 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాల జప్తు
- నీరవ్ మోదీ ఇండ్లు, కార్యాలయాల్లో విస్తృత సోదాలు
- పాస్‌పోర్టు రద్దు చేయించే దిశగా అడుగులు


గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీకి స్వాగతం పలుకుతున్న కేంద్ర మంత్రి ఆర్కే సింగ్. చిత్రంలో గవర్నర్ నరసింహన్, ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ కూడా ఉన్నారు.

వాటా తేలాకే పరిధిపై చర్చ

- ఇంకెన్నాళ్లీ 299 టీఎంసీల అన్యాయం?
- నాలుగేండ్లయినా రాష్ట్ర వినతి బేఖాతరు
- ఏ ప్రాతిపదికన పోతిరెడ్డిపాడు నీటి విడుదల?
- ఇప్పటికీ తేలని టెలిమెట్రీ, బజాజ్ కమిటీ
- కేంద్ర జలవనరుల శాఖ భేటీలో గట్టిగా తెలంగాణ వాదనలు
- తొలి సమావేశమైనందున అభిప్రాయాలు సేకరించామన్న కార్యదర్శి
- తదుపరి సమావేశాల్లోనూ చర్చిద్దామని రెండు రాష్ట్రాలకు సూచన

11

టీహబ్‌తో జట్టుకట్టిన హెచ్‌ఎస్బీసీ

■ ఫిన్‌టెక్ రంగంలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచంలో అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థ హెచ్‌ఎస్బీసీ గురువారం తెలంగాణ రాష్ట్ర ఇంక్యుబేటర్ కేంద్రం టీహబ్‌తో జట్టుకట్టింది. ఈమేరకు టీహబ్ సీఈవో జే కృష్ణన్, హెచ్‌ఎస్బీసీ గ్లోబల్ ఆపరేషన్స్ హెడ్ పాల్ రాడన్ టీహబ్‌లో ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. బ్యాంకింగ్‌రంగంలో ఫిన్‌టెక్ ఆవిష్కరణలకు అండగా నిలిచేందుకు టీహబ్‌తో కలిసి హెచ్‌ఎస్బీసీ పనిచేస్తుంది. దేశంలో బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. ఈ సందర్భంగా పాల్‌రాడన్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఫిన్‌టెక్ రంగంలో 169% వృద్ధి కనిపిస్తున్నదని, ఈ రంగంలోని అవకాశాలను ఒడిసి పట్టుకొనేందుకు టీహబ్ ద్వారా ఔత్సాహికులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. 'బ్యాంకింగ్ సేవల విషయంలో సాంకేతికతతోపాటు వినియోగదారుల ఆకాంక్షలు సైతం మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తమార్గాలను అన్వేషించేందుకు హెచ్‌ఎస్బీసీ సిద్ధమైంది. టీహబ్ అద్భుతంగా పనిచేస్తున్నదని ఈ సందర్భంగా పాల్ ప్రశంసించారు. 'నగదు రహిత లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో ఫిన్‌టెక్ కంపెనీలకు పెద్దఎత్తున డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ రంగంలోని వారిని ప్రోత్సహించేందుకు ప్రపంచప్రఖ్యాత హెచ్‌ఎస్బీసీ టీహబ్‌ను ఎంచుకోవడం ప్రశంసనీయం' అని టీహబ్ సీఈవో జే కృష్ణన్ పేర్కొన్నారు.



టీహబ్‌లో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న టీహబ్ సీఈవో కృష్ణన్, హెచ్‌ఎస్బీసీ గ్లోబల్ ఆపరేషన్స్ హెడ్ పాల్‌రాడన్

ఉన్నత విద్యకు యూజీసీ అండగా నిలువాలి

చైర్మన్‌ను కోరిన ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించాలని, రాష్ర్టానికి దక్కాల్సిన అంశాలకు త్వరగా ఆమోదం తెలుపాలని గురువారం ఢిల్లీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ డీపీ సింగ్‌ను టీఆర్‌ఎస్ ఎంపీ బీ వినోద్‌కుమార్, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ టీ పాపిరెడ్డి సారథ్యంలోని బృందం కోరింది.

యూజీసీ చైర్మన్‌కు ప్రతిపాదించిన అంశాలివి

ఓయూకు యూజీసీ గ్రాంట్స్ మంజూరుపై ఇచ్చిన ప్రతిపాదనలను యూజీసీ ఆమోదించలేదు. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డీఈబీ) ద్వారా విభజన నాటి నుంచి యూజీసీ నిధులు రావడంలేదు. రాష్ట్రంలోని వర్సిటీలు నాణ్యమైన పరిశోధనలు నిర్వహించేందుకు ఒకేదఫాలో యూజీసీ నిధులు కేటాయిస్తే.. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి బలోపేతం అవుతుంది. శాతవాహన వర్సిటీ, 2 ఎఫ్, 12 బీ హోదాతోపాటు నిధులివ్వాలి. యూజీసీ 12వ పంచవర్ష ప్రణాళిక పెండింగ్ నిధులు రూ.5 కోట్లు విడుదలచేయాలి. తెలంగాణ వర్సిటీకి మహిళా హాస్టల్‌ను కేటాయించాలి. కేయూ బీఈడీ కోర్సును గుర్తించాలి. యూనివర్సిటీల్లో ఐదు ఇంక్యుబేటర్ల ఏర్పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు రూ.50 కోట్ల నిధులు కావాలి. తెలంగాణ నాలెడ్జ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు యూజీసీ మద్దతు ఇవ్వాలి.



గురువారం ఢిల్లీలో యూజీసీ చైర్మన్ డీపీ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ బీ వినోద్‌కుమార్, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ టీ పాపిరెడ్డి సారథ్యంలోని బృందం

ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచండి

ఏటీఎంల్లో నగదు అందుబాటులో ఉంచాలని కోరుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి గురువారం కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ లేఖరాశారు. రాష్ట్రంలోని ఏటీఎంలలో నో క్యాష్ బోర్డులు దర్శనమిస్తుండటంతో ఉద్యోగులు, పెన్షనర్లు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.



ఔటర్‌రింగ్ రోడ్డుపై 2016 నవంబర్ 16న జరిగిన ప్రమాదంలో మరణించిన ముగ్గురు హెచ్‌ఎండీఏ కార్మికుల కుటుంబ సభ్యులు కోట్ల బీరప్ప, లంబాడి పాపమ్మ, తుల శిరీషలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున చెక్కులను అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు

విభజన సమస్యలపై 21న సమావేశం

■ హోంశాఖ నేతృత్వంలో ఇరురాష్ర్టాల అధికారులు హాజరు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: విభజన సమస్యల పరిష్కారంపై మొత్తంమీద కేంద్రంలో కదలిక వచ్చింది. ఈనెల 21న తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో ఢిల్లీలో నార్త్‌బ్లాక్‌లోని హోంశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ర్టాల పునర్విభజన శాఖ అధికారులు హాజరవుతారు. విభజన చట్టంలోని కీలక అంశాలతో సమావేశం ఎజెండాను ఖరారుచేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014 అమలులో తలెత్తుతున్న సమస్యలపై చర్చిస్తారు. ముఖ్యంగా తొమ్మిది, పదో షెడ్యూళ్లలో ఇరు రాష్ర్టాల మధ్య చిక్కుముడులుగా ఉన్న అంశాలపై చర్చ జరుగుతుంది. పదమూడో షెడ్యూల్‌లో..వివిధ కేంద్ర విద్యాసంస్థలు, ఎయిమ్స్, గిరిజన యూనివర్సిటీ, ఉద్యాన వర్సిటీతో పాటు పలు కేంద్ర సంస్థల ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన హామీల అమలు తీరును సమీక్షిస్తారు. వీటితోపాటు విద్యుత్ ఉద్యోగుల విభజన అంశం కూడా సమావేశంలో చర్చకు రానున్నది ప్రభుత్వ భవనాలు, వాటి అప్పగింత తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరుగనుంది. ఈ సమావేశంలో తెలంగాణకు సంబంధించిన అంశాలపై గట్టిగా వాదనలు వినిపించేందుకు వీలుగా సమాయత్తం కావడం కోసం శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

హామీలు నెరవేర్చండి

మూడో పేజీ తరువాయి...

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) మంజూరు చేస్తామని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ హామీ ఇచ్చారని, దీనిని కూడా అమలుచేయాలని జైట్లీని సీఎం కోరారు. ఏపీ పునర్విభజన చట్టం-2014 ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహాయం చేయాలని, ఈ మేరకు చట్టంలోని సెక్షన్ 94(2)లో నిబంధన ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పాటు అయినప్పుడు తెలంగాణలోని 10 జిల్లాల్లో తొమ్మిది అత్యంత వెనుకబడి ఉన్నాయని, పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనుకబడిన తొమ్మిది జిల్లాలకు ఆర్థికసహాయం అందజేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపించామని వివరించారు. వెనుకబడి జిల్లాల అభివృద్ధికి ఒక్కో జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున తొమ్మిది జిల్లాలకు కేంద్రం 2014-15 ఆర్థిక సంవత్సరానికి రూ.450 కోట్లను 2016 ఫిబ్రవరిలో, 2015-16 ఆర్థిక సంవత్సరానికి 2016 డిసెంబర్‌లో, 2016-17 ఆర్థిక సంవత్సరానికి 2017 ఆగస్టులో నిధులు విడుదలచేసిందని తెలిపారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఏడాదికి రూ.450 కోట్ల చొప్పున విడుదల చేసినందుకు ఆర్థికమంత్రి జైట్లీకి సీఎం కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేయాల్సిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజీ నిధులను విడుదల చేయలేదని గుర్తుచేశారు. తాము ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, ఈ ఆర్థిక సంవత్సరం గడువు ముగుస్తున్నందున వెంటనే ఈ నిధులను విడుదల చేయాలని కేంద్రమంత్రిని సీఎం కేసీఆర్ కోరారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి 3.5 శాతాన్ని కొనసాగించాలని కూడా ఆయన విజ్ఞప్తిచేశారు. సీఎం కేసీఆర్ వెంట జైట్లీని కలిసినవారిలో లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

మూడు అంశాలపై సీఎం కేసీఆర్ చర్చ: జితేందర్‌రెడ్డి

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీతో మూడు అంశాలపై చర్చించారని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు అధికనిధులు కేటాయించామని అరుణ్‌జైట్లీ తెలిపారని, వారంలో ఎయిమ్స్‌కు నిధులు విడుదల చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని జితేందర్‌రెడ్డి వివరించారు. సీఎం వెంట జైట్లీని కలిసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలకు ఈ ఏడాది రావాల్సిన రూ.450 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం కోరారన్నారు. అలాగే దేశంలో అభివృద్ధి రేటులో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణకు ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని 3.5 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. అభివృద్ధి రేటులో తెలంగాణ మొదటిస్థానంలో, గుజరాత్ రెండోస్థానంలో, మహారాష్ట్ర మూడోస్థానంలో ఉన్నాయని వివరించారు. అలాగే ఎయిమ్స్‌ను మంజూరు చేయాలని, నిధులు కేటాయించాలని సీఎం కోరారన్నారు. తెలంగాణ అభివృద్ధిని కేంద్రమంత్రి జైట్లీ ఈ భేటీలో ప్రశంసించారని జితేందర్‌రెడ్డి చెప్పారు.



కేంద్రమంత్రి అరుణ్ జైట్లీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ జితేందర్ రెడ్డి కూడా ఉన్నారు.

అయామ్ యువర్ ఫ్యాన్

మూడో పేజీ తరువాయి...అభివర్ణించారు. ఈ పథకం ద్వారా రైతులకు గొప్ప ఉపశమనం కలుగుతుందని అరవింద్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భూమిని సాగు చేయడానికి ప్రతిరైతుకు ఎకరానికి రూ.8 వేల చొప్పున పెట్టుబడి సమకూర్చే విశిష్ట పథకం అద్భుతమని సీఎం కేసీఆర్‌తో అరవింద్ అన్నారు. గురువారం కేంద్రమంత్రి అరుణ్ జైట్లీని కలువడానికి సీఎం కేసీఆర్ వెళుతుండగా అరవింద్ సుబ్రమణ్యం ఆయనకు తారసపడ్డారు. మొదట కేసీఆర్‌ను దాటి వెళ్లిన అరవింద్.. దిగ్గున వెనకకు తిరిగి వచ్చి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా పలుకరించారు. రైతులు భూమిని సాగుచేయడం కోసం ఆర్థికసాయం అందించే 'వ్యవసాయ సాగు పెట్టుబడి ఆర్థిక సహాయం' పథకం రైతులకు గొప్ప తోడ్పాటును అందిస్తుందని అన్నారు. 'తెలంగాణ మోడల్'ను కేంద్రం అధ్యయనం చేయాలని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి కూడా సూచించానని అరవింద్ సీఎం కేసీఆర్‌కు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌కు వస్తున్నానని, ఈ పథకానికి సంబంధించి కూలంకషంగా అక్కడే చర్చిస్తానని తెలిపారు. కాగా, అధికారులు అన్ని వివరాలు అందిస్తారని అరవింద్‌కు సీఎం కేసీఆర్ ఆయనకు చెప్పారు. తన నివాసానికి భోజనానికి రావాలని కేసీఆర్ ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.46 గంటలకు

సూర్యాస్తమయం: 6.14 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం పాడ్యమి రా.తె. 3.59 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ధనిష్ఠ ఉదయం 9.43 వరకు, తదుపరి శతభిషం, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 11.04 నుంచి 12.30 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.04 నుంచి 9.49 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.53 నుంచి 1.39 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.27 నుంచి రాత్రి 7.03 వరకు.

లోకం పోకడ



వెల్‌కమ్.. వెల్‌కమ్ బ్రదర్.. ఇక్కడే ఓ క్లబ్ ఏర్పాటు చేసుకుందాం!!

మా ప్రాజెక్టులకు నిధులివ్వండి

■ క్యాడ్‌వామ్ కింద వెయ్యికోట్లు ఇవ్వాలని కోరా
■ నాబార్డు నిధులతోనే ప్రాజెక్టుల లక్ష్యాలు సాధ్యం
■ పీఎంకేఎస్‌వై సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రాజెక్టులకు అభినందనలతో పాటు నిధులు కూడా అందజేయాలని కేంద్రమంత్రులకు విజ్ఞప్తి చేసినట్టు భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు తెలిపారు. క్యాడ్‌వామ్ కింద అడిగిన రూ.వెయ్యి కోట్లను వెంటనే విడుదల చేయాలని మంత్రి కోరారు. అందులో దేవాదుల ప్రాజెక్టుకు రూ.450 కోట్లు ఇవ్వాలన్నారు. భీమా ప్రాజెక్టుకు రావాల్సిన రూ.34 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని కేంద్రమంత్రి గడ్కరీని కోరానన్నారు. గురువారం నితిన్ గడ్కరీ అధ్యక్షతన ఢిల్లీలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకం ప్రాజెక్టులపై కేంద్ర జలవనరుల శాఖ నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా నాబార్డు ద్వారా రాష్ర్టాలకు నిధులు ఇచ్చినపుడే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను చేరుకోవచ్చని కేంద్రమంత్రి గడ్కరీకి వివరించానని, అందుకు ఆయన సూత్రప్రాయంగా అంగీకరించారని హరీశ్‌రావు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పర్యావరణ, వన్యప్రాణి అనుమతులను మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణశాఖమంత్రి హర్షవర్ధన్‌ను కోరినట్టు చెప్పారు. ఎంపీలు జితేందర్‌రెడ్డి, బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పీ శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలచారి తదితరులు మంత్రి హరీశ్‌రావు వెంట ఉన్నారు.



కేంద్రమంత్రి నితిన్ అధ్యక్షతన గడ్కరీ ఢిల్లీలో పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులపై జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి టీ హరీశ్‌రావు

అవార్డు తర్వాతనే బోర్డులోకి..

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు తర్వాతనే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకురావాలని రాష్ట్రమంత్రి హరీశ్‌రావు కేంద్రాన్ని కోరారు. అప్పుడే రాష్ర్టాలకు కేటాయించిన నీటిని విజయవంతంగా వినియోగించుకోవచ్చని చెప్పారు. రెండు రాష్ర్టాలతో కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి నిర్వహించిన సమావేశం అసంపూర్తిగా ముగిసిందన్నారు. కాగా కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, హర్షవర్ధన్‌లను కాళేశ్వరం ప్రాజెక్టు పనులను చూసేందుకు రావాల్సిందిగా ఆహ్వానించినట్టు చెప్పారు. అందుకు ఇద్దరు మంత్రులు సుముఖత వ్యక్తం చేశారన్నారు.

నాల్గో దశ టెండర్లను పూర్తిచేయండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయ నాల్గో దశకింద చేపడుతున్న పనుల టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ దశ కింద నాలుగులక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న సుమారు ఆరువేల చెరువులను ఎంపికచేయగా ఇప్పటికే 2,695 చెరువుల పనులకు అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో టెండర్లు పూర్తిచేసిన 1,569 చెరువుల పనులను మొదలుపెట్టారు. గురువారం నాల్గోదశ కింద ఆదిలాబాద్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 111 చెరువుల పునరుద్ధరణ పనులకు, ట్రిపుల్ ఆర్ కింద 147 చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం పాలనా అనుమతులు ఇచ్చింది.

కోర్టు పరిధిలో ఉద్యోగుల విభజన

■ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాం
■ టీఎస్‌పీఈ జేఏసీ మహాధర్నాలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం నుంచి రిలీవ్ అయిన ఆంధ్రా స్థానికత గల ఉద్యోగులు వారి సొంతరాష్ర్టానికి వెళ్లాలని రాష్ట్ర విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం విద్యుత్‌సౌధ ప్రాంగణంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఏపీ విద్యుత్ ఉద్యోగుల అంశాన్ని, అందులో ఉన్న చిక్కులకు పరిష్కారాన్ని కోర్టు నిర్ణయించాల్సి ఉన్నదని అన్నారు. కోర్టు తీర్పు వెలువడేవరకు దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేమన్నారు. ఈ అంశంపై హైకోర్టు అడ్వకేట్ జనరల్‌తో న్యాయపరమైన అంశాలను చర్చిస్తామని చెప్పారు. ఏపీ విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకువెళ్తానని హామీనిచ్చారు. తెలంగాణ పవర్ ఇంజినీర్స్ జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంపై హైకోర్టు తీర్పు వచ్చాక దాని ఆధారంగా తెలంగాణ విద్యుత్ యాజమాన్యం సుప్రీంకోర్టులో అప్పీల్‌చేయాలని లేదంటే హైకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని సూచించారు. టీఎస్‌పీఈ జేఏసీ ప్రతినిధులు బీసీ రెడ్డి, శ్యాం మనోహర్, ముత్యం వెంకన్నగౌడ్, కుమారస్వామి, రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తులసీ, మేడి రమేశ్, సదానందం మాట్లాడుతూ.. విద్యుత్ యాజమాన్యం తక్షణమే ప్రభుత్వంతో చర్చించి విద్యుత్ ఉద్యోగుల విభజన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. రిలీవ్ చేసిన ఆంధ్ర ఉద్యోగులను సూపర్ న్యూమరీ పోస్టుల్లో కొనసాగించాలని, వారికి ఎట్టి పరిస్థితుల్లో పదోన్నతులు ఇవ్వకూడదని స్పష్టంచేశారు. ఈ ధర్నాలో ట్రాన్స్‌కో, జెన్‌కో, టీఎస్‌ఎస్పీడీసీఎల్, టీఎస్‌ఎన్పీడీసీఎల్ నుంచి విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



గురువారం హైదరాబాద్ విద్యుత్‌సౌధ ప్రాంగణంలో విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడుతున్న టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు. చిత్రంలో టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు ఉన్నారు



నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న మంత్రి తలసాని

పండుగలా సీఎం కేసీఆర్ జన్మదినం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్/ఖైరతాబాద్/దుండిగల్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో భారీ ఏర్పాట్లుచేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. గురువారం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం బంగారు తెలంగాణ రథసారధి కేసీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదానశిబిరం, మెడికల్ క్యాంపు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, అంధులకు చేతికర్రలు, మహిళలకు చీరల పంపిణీ వంటి సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఆయుష్య హోమం నిర్వహిస్తామని, హోమంలో నిజామాబాద్ ఎంపీ కవిత పాల్గొంటారని తెలిపారు.

టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో...

సీఎం కేసీఆర్ జన్మదినవేడుకలను టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ గురువారం తెలంగాణభవన్‌లో మీడియాకు తెలిపారు. శనివారం తెలంగాణభవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ అమీర్ తెలిపారు.

మల్లారెడ్డి సంస్థల్లో మెగారక్తదాన శిబిరం

సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం ఎంపీ మల్లారెడ్డి సంస్థల్లో మెగా రక్తదానశిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మల్లారెడ్డి సేవాసంస్థ అధ్యక్షుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో మల్లారెడ్డి విద్యాసంస్థలతో పాటు మర్రి లక్ష్మణ్‌రెడ్డి గ్రూప్‌కు చెందిన కళాశాలల విద్యార్థులు కూడా పాల్గొంటారని చెప్పారు.



గురువారం న్యూజిలాండ్‌లో రక్తదానం చేస్తున్న టీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

విదేశాల్లో సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాలు

20 దేశాల్లో ఉత్సవాలు: టీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచవ్యాప్తంగా వివిధదేశాల్లో టీఆర్‌ఎస్‌శాఖల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ప్రారంభమయ్యాయి. టీఆర్‌ఎస్ న్యూజిలాండ్ విభాగం అధ్యక్షుడు విజయ్‌రెడ్డి కోసన ఆధ్వర్యంలో గురువారం న్యూజిలాండ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 17న సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేసీఆర్ అభిమానులు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసినట్టు టీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల చెప్పారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. న్యూజిలాండ్‌లో 16న గణేశ్ హోమం నిర్వహిస్తామన్నారు.

ఇరాన్ శాంతిని కోరుకుంటుంది

- అభివృద్ధిచెందే దేశాలకు ఆటంకంగా ఉగ్రవాదం
- ముస్లిం ప్రముఖులు, మేధావుల సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు
- రౌహానికి కేంద్రమంత్రి, గవర్నర్ స్వాగతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచంలోని ఏ దేశంతోనూ తాము శతృత్వాన్ని పెంచుకోమని, ఎల్లవేళలా శాంతినే కోరుకుంటామని ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహాని తెలిపారు. ఇస్లామిక్ దేశాలతోపాటు, ప్రపంచంలో ఏ ఇతర దేశాలతోనూ తమకు శతృత్వం లేదని రౌహాని పేర్కొన్నారు. సమస్యలకు పొరుగుదేశాలతో ఘర్షణలు, ఉగ్రవాదం పరిష్కారంకావని, చర్చలు, దౌత్యసంబంధాలతోనే పరిష్కరించుకోవచ్చన్నారు. రెండురోజుల పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన తాజ్‌కృష్ణ హోటల్‌లో ముస్లింలలో అన్నివర్గాల ప్రముఖులు, రాజకీయనాయకులు, విద్యావేత్తలు, మేధావులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరిపైనైనా వేధింపులు, అరాచకాలు జరుగుతుంటే వారిని కాపాడేందుకు ముస్లింలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. భూభాగంపై జరిగే అరాచకాలు, చెడును రూపుమాపేందుకే ఇస్లాం వచ్చిందని చెప్పారు. ఉగ్రవాద ఘటనలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆటంకంగా మారాయని రౌహాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇరాన్ విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జమాద్ జరిఫ్, జామే నిజామియా వైస్‌చాన్స్‌లర్ ముఫ్తీ ఖలీల్ అహ్మద్, నల్సార్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఫైజాన్ ముస్తఫా, శాసనమండలి ప్రతిపక్షనేత షబ్బీర్ అలీ, తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీమ్, ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ జాఫ్రీ, ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ నగరానికి చెందిన సున్నీ, షియా ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.


గురువారం హైదరాబాద్‌లో ముస్లిం ప్రముఖుల సమావేశంలో మాట్లాడుతున్న ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహాని

విమానాశ్రయంలో ఘనస్వాగతం

రెండురోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానికి గురువారం బేగంపేట విమానాశ్రయంలో కేంద్రవిద్యుత్‌శాఖ సహాయ మంత్రి ఆర్కే సింగ్, గవర్నర్ నరసింహన్, ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ ఘనస్వాగతం పలికారు. జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, నగర పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, సెట్విన్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, ఇరాన్ రాయబారి, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ తదితరులు రౌహానికి స్వాగతం పలికినవారిలో ఉన్నారు. ఇరాన్ అధ్యక్షుడు తన పర్యటనలో భాగంగా శుక్రవారం సాలార్‌జంగ్ మ్యూజియం, మక్కామసీదును సందర్శిస్తారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఇరానీయులతో భేటీకానున్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ పర్యటన ముగించుకుని రౌహాని ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.

టీవీవీపీలో స్పెషాలిటీ వైద్యుల విలీనం

- ఉత్తర్వులు జారీచేసిన వైద్య, ఆరోగ్యశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకుల పరిధిలో నియామకమై ఫారిన్ సర్వీస్ ప్రాతిపదికన సేవలందిస్తున్న వారిని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ)లో విలీనం చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఏ శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్టు సేవలు అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వైద్యులకు పదోన్నతుల అవకాశాలు పెరుగడంతోపాటు, పేదలకు స్పెషలిస్టు వైద్యం అం దుబాటులోకి వస్తుంది. పదేండ్లుగా ఎదురుచూస్తున్నామని, విలీన ప్రక్రియను వెంటనే చేపట్టాలని వైద్యుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సీఎం కేసీఆర్ ఆమోదంతో వైద్య, ఆరోగ్యశాఖమంత్రి సీ లక్ష్మారెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. వైద్యుల విలీనం ద్వారా ప్రజలకు కార్డియాలజీ, గాస్ట్రోఎంట్రాలజీ, మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, న్యూరోసర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్, అనస్తీషియా, ఓబీజీ, ఆర్థో, కంటి వైద్యవంటి సేవలు కూడా అందనున్నాయి.

అదనపు అర్హతలకు వైద్యశాఖ అనుమతి

- ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులపై ఈ మేరకు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు అదనపు అర్హతలను వైద్య, ఆరోగ్యశాఖ అనుమతించింది. గతంలో ఉన్న అర్హతలతోపాటు అదనంగా 12 అర్హతలకు అనుమతినిస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. దరఖాస్తు తేదీని కూడా ఈ నెల 25వరకు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ల్యాబ్ టెక్నీషియన్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి కోరారు. 200 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామక ప్రక్రియ ఉంటుందన్నారు.

వైద్యశాఖ అదనంగా అనుమతించిన 12 అర్హతలు

సర్టిఫికెట్ ఇన్ ల్యాబొరేటరీ టెక్నీషియన్ కోర్సు, ఎంఎల్‌టీ (వీవోసీ), ఇంటర్మీడియట్ (ఎంఎల్‌టీ-ఒకేషనల్) కనీసం ఏడాదిపాటు క్లినికల్ శిక్షణ, అప్రెంటీస్ చేసి ఉండాలి, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో బీఎస్సీ, ఎంఎస్సీ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ (క్లినికల్ పాథాలజీ) టెక్నికల్ కోర్సు, బ్యాచిలర్ ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ బయోకెమిస్ట్రీ, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, టెస్సీ మైక్రో బయాలజీ, ఎంఎస్సీ ఇన్ మైక్రో బయాలజీ, ఎమ్మెస్సీ ఇన్ మెడికల్ బయోకెమిస్ట్రీ, ఎంఎస్సీ ఇన్ క్లినికల్ బయాలజీ, ఎంఎస్సీ ఇన్ బయోకెమిస్ట్రీ.

వెబ్‌సైట్‌లో 'ఎన్టీఎస్ఈ' ఫలితాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత ఏడాది నిర్వహించిన నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష (రాష్ట్రస్థాయి ఎన్టీఎస్ఈ) ఫలితాలను http//bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు బీ సుధాకర్ తెలిపారు. రెండోస్థాయి ఎన్టీఎస్ పరీక్ష విధానంలోని సవరణలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మే 5న జరిగే జాతీయస్థాయి (రెండో స్థాయి) ఎన్టీఎస్ పరీక్ష కోసం హాల్‌టికెట్లను ఎన్సీఈఆర్టీ www.ncert.nic.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ నెలలో పొందవచ్చునని పేర్కొన్నారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి

- మార్చి 25 సకల ఉద్యోగుల మహాసభ
- తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాంట్రిబ్యూరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ మార్చి 25న హైదరాబాద్‌లో సకల జనుల మహాసభను నిర్వహించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయించింది. ఉద్యోగ సంఘాల జేఏసీ సారథ్యంలో కేంద్రంపై ఒత్తిడి పెంచాలని హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో నాయకులు నిర్ణయించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి సారథ్యంలో టీజీవో కార్యాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. దీనికి జేఏసీలోని 156 సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగసంఘాల నాయకులు నిరసన వ్యక్తంచేశారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ వీ మమత, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నేతలు మణిపాల్‌రెడ్డి, స్వామిరెడ్డి, మల్లారెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏ పద్మాచారి, ఇంటర్ జేఏసీ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, టీఎన్జీవో నాయకులు ముజీబ్, కొండల్‌రెడ్డి, కస్తూరి వెంకటేశ్వర్లు, టీజీవో నాయకులు ఎంబీ కృష్ణయాదవ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


గురువారంహైదరాబాద్‌లో ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి

26 నుంచి ఈ-గవర్నెన్స్‌పై సదస్సు

- హెచ్‌ఐసీసీలో రెండ్రోజుల కార్యక్రమాలు
- డీఏఆర్పీజీ, తెలంగాణ సర్కారు సంయుక్తంగా జాతీయ సదస్సు నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరిపాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ రాష్ట్రం 21వ జాతీయ ఈ- గవర్నెన్స్ సదస్సుకు వేదికైంది. ఈ నెల 26, 27న హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్, పబ్లిక్ గ్రీవెన్సెస్ - తెలంగాణ సర్కారు సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి. జాతీయ సదస్సు నిర్వహణ కోసం పలు రాష్ట్రాలు పోటీపడినా.. తెలంగాణలో అమలుచేస్తున్న సుపరిపాలన విధానాలు దీన్ని హైదరాబాద్‌లో నిర్వహించేలా చేశాయని ఈ-గవర్నెన్స్ స్పెషల్ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సదస్సులో 26న మూడు, 27న రెండు ప్లీనరీ సెషన్లు నిర్వహిస్తారని, కేంద్ర ప్రభుత్వం తరపున మంత్రి జితేంద్రసింగ్, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐటీ, పరిశ్రమ శాఖల మంత్రి కే తారకరామారావు ఇందులో పాల్గొంటారని చెప్పారు. సదస్సుకు హాజరయ్యేందుకు అధికారిక వెబ్‌సైట్‌లో 600 మంది దరఖాస్తు చేసుకొన్నారని మొత్తం 800 మంది పాల్గొనే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు తెలంగాణ సర్కారు అధికారిక విందు ఇవ్వనున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. 'పాలనలో సాంకేతికతను జోడిస్తున్న ఈ-గవర్నెన్స్ పాలసీలకు 11 విభాగాల్లో పురస్కారాలు అందజేస్తాం.

'టీ యాప్ ఫోలియో' రెడీ

ప్రభుత్వం అన్ని రకాల సేవలను పౌరులకు చేరవేసేందుకు రూపొందించిన 'టీ యాప్ ఫోలియో' త్వరలో అందుబాటులోకి రానున్నదని జీటీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణ ఈ- పరిపాలనలో అగ్రస్థానంలో ఉందని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సెమినార్లకు హాజరైన ప్రతినిధులకు, శిక్షణాధికారులకు ఈ-గవర్నెన్స్ గురించి వివరించాలంటే దేశంలో ఎవరైనా హైదరాబాద్‌కే తీసుకొస్తారని, ఐటీశాఖ మంత్రి కేటీఆర్.. పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించడం వల్లే రాష్ట్రానికి ఈ ఖ్యాతి లభించిందని పేర్కొన్నారు.

నేడు మధ్యాహ్నం టెన్త్ ప్రీఫైనల్ పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉదయం జరుగాల్సిన పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షను మధ్యాహ్నానికి వాయిదా వేసినట్టు తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ గురువారం తెలిపారు. పరీక్షల్లో ఎదురయ్యే సమస్యలు, ఒత్తిడి, గెలుపు తదితర అంశాలపై ప్రధాని మోదీ విద్యార్థులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్గనిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 11.45 గంటలకు ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో మోదీ ప్రసంగంతోపాటు, విద్యార్థులతో ముఖాముఖి ఉంటుందన్నారు.



రాహుల్‌గాంధీ గుజరాత్‌లో బీజేపీకి కంటిమీద కునుకు లేకుండా చేశారు. దీంతో అప్పుడు ఆయనపై లేనిపోని అభాండాలు వేస్తూ బీజేపీ దుష్ప్రచారం చేసింది. ఇప్పుడు కర్ణాటకలో కూడా రాహుల్‌పై విషప్రచారం మొదలుపెట్టింది. మాంసాహారం తిని ఆలయంలోకి వెళ్లాడని చెబుతున్నది. ఇంతకన్నా నీచమైన బుద్ధి ఇంకోటి ఉండదు.

ఉద్ధవ్ ఠాక్రే, శివసేన అధినేత

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం బ్యాంక్ కుంభకోణాల్లో అతిపెద్దది. దీనిగురించి కాంగ్రెస్ పార్టీ ప్రధాని కార్యాలయానికి 2016లోనే లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేసింది. అయినా ప్రధాని మోదీ మిన్నకుండిపోయారు. చిన్న మోదీ పెద్ద మోదీ అండతోనే వేలకోట్ల కుంభకోణం చేసి దేశం విడిచి పారిపోయాడు.

రణ్‌దీప్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి



చరిత్రలో నేడు



1846

ముగిసిన మొదటి ఆంగ్లో-సిక్కు యుద్ధం.

1883

'లేడీస్ హోం జర్నల్' ప్రచురణ ప్రారంభం.





1948

'ఎన్‌బీసీ'లో మొదటి సారి 'న్యూస్‌రీల్' ప్రసారం.

త్రిపురలో ఈ నెల 18న జరుగనున్న ఎన్నికలు యుద్ధ రంగాన్ని తలపిస్తున్నాయి. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఎన్నడూలేని పోటీని ఎదుర్కొంటున్నారు. దీర్ఘకాలంగా అధికారంలో ఉండటంతో సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకతను బీజేపీ ఉపయోగించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నది. సీపీఎం పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, బీజేపీ అధికారంలోకి వస్తే వెలుగులు నింపుతామని ప్రధాని చెబుతున్న మాటలు యువతను ఆకట్టుకుంటున్నాయి. కాంగ్రెస్ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చూస్తున్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

జమ్ముకశ్మీర్‌లో సైనిక జవాన్లే లక్ష్యంగా తాజాగా జరిగిన సుంజువాన్ దాడి నిఘా భద్రతా లోపాలను ఎత్తిచూపింది. పిడికెడు మంది టెర్రరిస్టులు సైనికుల నివాసాల్లోకి చొరబడి ఏడుగురి ప్రాణాలు బలిగొనటం దేశాన్ని కుదిపేసింది. ఇలాంటి దాడులు ఈ మధ్య పెరిగిపోతున్నాయి. దాడి జరిగినప్పుడల్లా సైనికాధికారులు భద్రతా లోటుపాట్లపై 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ' వేసి సమీక్షిస్తారు. 2016 జనవరిలో జరిగిన పఠాన్‌కోట్ ఎయిర్ బేస్ దాడి తర్వాత ఉరీ, హంద్వారా, నగ్రోత, పాంజ్‌గామ్ దాడులు జరిగాయి. ఇవన్నీ చాలా కట్టుదిట్టమైన భద్రత ఉన్న ఆర్మీ బేస్ క్యాంపులే. ఇకనైనా నిఘా రక్షణ చర్యలను పటిష్ఠపరుచాలి. నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలికారాదు.

ది హిందూ

మరో కుంభకోణం!

దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణం వెలుగులోకి రావడంతో మన పబ్లిక్ రంగ బ్యాంకులు ఎంత దురవస్థలో ఉన్నాయో తెలుస్తున్నది. వేల కోట్ల రూపాయలను మింగిన బడాబాబులు ఎంత సాఫీగా దేశం విడిచి వెళ్ళగలరో మరోసారి వెల్లడైంది. పబ్లిక్ రంగ బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పదకొండున్నర వేల కోట్ల మేర మోసంచేసి దేశం నుంచి చల్లగా జారుకున్నాడు. గతంలో విజయ మాల్యా అనే మద్యం వ్యాపారి బ్యాంకులను నిండా ముంచి, కోర్టులలో కేసులు నడుస్తుండగానే, సంచీ సరంజామా సర్దుకొని విమానంలో వెళ్ళిపోయాడు. ఇప్పుడు నీరవ్ మోదీతో పాటు మరో మూడు వజ్రాల వ్యాపార సంస్థలు కూడా మోసం పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేశాయని అంటున్నారు. నీరవ్ మోదీ బ్యాంకులను అత్యంత సులభంగా మోసంచేసిన తీరు ఆశ్చ ర్యం కలిగిస్తున్నది. ఒక బ్యాంకు మరో బ్యాంకు శాఖకు అవగాహనా లేఖ (లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ లేదా ఎల్ఓయూ) ఇవ్వడం సాధారణం. రుణగ్రహీత సొమ్ము చెల్లించకుంటే తాను చెల్లిస్తానని హామీ ఇవ్వడమే ఈ అవగాహనా లేఖ. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇచ్చిన ఎల్ఓయూ ఆధారంగా విదేశాలలోని రెండు ఇతర బ్యాంకుల శాఖలు సొమ్ము చెల్లించాయి. అయితే నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకు ముంబయి బ్రాంచిలోని అధికారులతో లాలూచీ పడి అవగాహనా లేఖలు పొందారు. ఈ లేఖలు అంతర్జాతీయస్థాయిలో బ్యాంకు శాఖల మధ్య సాగే 'స్విఫ్ట్' నెట్‌వర్క్ ద్వారా వెళ్ళాయి. ఇతర బ్యాంకు శాఖలకు అవగాహనా లేఖలు ఇచ్చినట్టు పంజాబ్ నేషనల్ బ్యాంకు మూల సమాచారంలో నమోదు కాలేదు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఈ మోసంపై అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్టు ప్రకటించింది. కానీ పెద్దలకు తెలువకుండా వేల కోట్ల రూపాయల మేర మోసం సాగడం సాధ్యమా?

ఫోర్బ్స్ పత్రిక వెల్లడించిన భారతీయ బిలియనీర్ల జాబితాలో నీరవ్ మోదీది 57వ స్థానం! ప్రపంచంలోని పెద్ద దేశాలలో ఈయన వజ్రాల దుకాణాలున్నాయి. ప్రపంచ ప్రముఖ సుందరాంగుల మెడలో వీరి ఆభరణాలు తళుకులీనుతుంటాయి. కుంభకోణం బయటపడటానికి వారంరోజుల ముందు దావోస్‌లో ప్రధాని మోదీ గ్రూప్ ఫొటోలో ఈ పెద్ద మనిషి కూడా ఉన్నాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు, సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే ఆయన దేశం నుంచి ఉడాయించాడు. ఘనత వహించిన నీరవ్ మోదీ వెళ్ళడానికి వెసులుబాటు కల్పించిన తరువాతే, ఈ కేసు నమోదు తతంగం సాగిందా అనేది చెప్పడం కష్టం. పీఎన్‌బీలో ఇటువంటి బాగోతం సాగడం ఇది మొదటిసారి కాదు. ఐదేండ్ల కిందట విన్‌సమ్ గ్రూప్ అనే వజ్రాల వ్యాపార సంస్థ స్టాండ్‌బై క్రెడిట్ లెటర్స్‌ను ఉపయోగించి 1600 కోట్ల రూపాయల మేర పీఎన్‌బీకి టోకరా ఇచ్చింది. దీనిపై సీబీఐ దర్యాప్తు సాగుతూనే ఉంటుంది. విన్‌సమ్ గ్రూప్ యజమానులైన మెహతాలు మళ్ళా భారత్‌లో అడుగుపెట్టలేదు. సేయింట్ కిట్స్‌లో పౌరసత్వం తీసుకొని సింగపూర్, దుబాయిలలో సుఖంగా ఉన్నారు. నీరవ్ మోదీ కూడా దేశాలు తిరుగుతున్నారని, లండన్‌లో స్థిరపడవచ్చునని తెలుస్తున్నది. కంప్యూటర్లు, కేంద్రీయ సమాచార వ్యవస్థలు గల నేటి కాలంలో– ఒక బ్యాంకు శాఖ వేల కోట్ల రూపాయల మేర మరో బ్యాంకు శాఖకు హామీ ఇచ్చి సొమ్ము ఇప్పిస్తే, ఏండ్ల కొద్ది ఆ విషయం బయటపడకుండా ఉండటమేమిటి? పీఎన్‌బీ శాఖ నుంచి అధికారికంగా లేఖ పోయింది కనుక పోయిన సొమ్ముకు ఈ బ్యాంకు బాధ్యత వహించవలసి వస్తుంది. కానీ మోసపూరిత లావాదేవీ కనుక, విచారణ సాగుతున్నందున, ఇప్పుడు తాము సొమ్ము ఇవ్వలేమనేది పంజాబ్ నేషనల్ బ్యాంకు వైఖరి. అంటే సొమ్ము ఇచ్చిన బ్యాం కులు ఇప్పట్లో వసూలు చేసుకోలేవు.

> **ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడటానికి రెండు మార్గాలపై చర్చ సాగుతున్నది. ఒకటి బెయిలవుట్ విధానం- ప్రజాధనంతో బ్యాంకులను ఆదుకోవ డం. రెండవది బెయిలిన్ విధానం- ఖాతాదారుల సొమ్మును కాజేయడం. ఈ రెండు విధానాలు సబబైనవి కాదు. విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీల మూలంగా బ్యాంకులు నష్టపోతే, ప్రజల లేదా ఖాతాదారుల సొమ్ముతో గట్టెక్కించడమేమిటి?**

ఈ కుంభకోణం నేపథ్యంలో పబ్లిక్‌రంగ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఏ బ్యాంకులోని ఏయే శాఖలోఎంత మేర గల్లంతయిందో, అది ఎప్పుడు బయటపడుతుందో తెలువదు. వాటి ప్రభావం బ్యాంకింగ్ వ్యవస్థపై ఏ విధంగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే ఈ బ్యాంకుల మొండి బకాయిలు ఏడున్నర లక్షల కోట్ల మేర ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న తోడ్పాటు రెండున్నర లక్షల కోట్ల మేర ఉంటుంది. ఇట్లా ఒక్కో బ్యాంకులో వేల కోట్ల రూపాయల మేర కుంభకోణాలు సాగితే, ప్రభుత్వం ఇస్తానన్న తోడ్పాటు ఏ మూలకూ సరిపోదు. ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడటానికి రెండు మార్గాలపై చర్చ సాగుతున్నది. ఒకటి బెయిలవుట్ విధానం– ప్రజాధనంతో బ్యాంకులను ఆదుకోవడం. రెండవది బెయిలిన్ విధానం– ఖాతాదారుల సొమ్మును కాజేయడం. ఈ రెండు విధానాలు సబబైనవి కాదు. విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీల మూలంగా బ్యాంకులు నష్టపోతే, ప్రజల లేదా ఖాతాదారుల సొమ్ముతో గట్టెక్కించడమేమిటి? బడాబాబులు తీసుకున్న మొండి బకాయిలను వసూలు చేయించడం సరైన చర్య. ప్రభుత్వరంగ బ్యాంకులు అక్రమాలకు తావు లేకుండా నడిచేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. ఇదేవిధంగా కుంభకోణాలు బయటపడితే, బ్యాంకింగ్ వ్యవస్థ అప్రతిష్ఠ పాలవడమే కాదు, పాలక వ్యవస్థ కూడా ప్రజల నమ్మకాన్ని కోల్పోతుంది. ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడం, వ్యవస్థలపై నమ్మకాన్ని పెంచడం పాలకుల బాధ్యత.

సందర్భం

జయహో కేసీఆర్

ఓ మహాశయుడా!
జ్యాతి ఖ్యాతిలో ప్రఖ్యాతివి
ఆత్మగౌరవానికి ప్రతీకవి
పోరుబాటులో అడుగుజాడవి
చరిత్ర పుటలకు దొరికిన చరితార్థుడివి.
ఓ త్యాగధనుడా!
తెలంగాణకై ఉదయించిన
గులాబీరంగు సూరీడివి
రాష్ట్ర పునఃర్నిర్మాణంలో పునాది రాయివి
అణగారిన వర్గాల ఆశాకిరణానివి
అందరి ఆత్మబంధువువి
ప్రపంచాన్ని నివ్వెర పరిచిన అద్భుతశక్తివి.
ఓ ఉద్యమవీరుడా!
జైత్రయాత్రలో శవయాత్రకు సైతం
సిద్ధపడిన ప్రజాపక్షానివి
తరతరాలు స్మరించే యుగపురుషుడివి.
ఓ రాజనీతిజ్ఞుడా!
సంక్షేమ పథకాల ఆపద్బాంధవుడివి
అభివృద్ధే ధ్యేయంగా అనితర సాధ్యుడివి
తల్లిఋణం తీర్చుకున్న ఆరాధ్యుడివి ఆదర్శానివి..
తడారిన ఎడారినేలపై
ఆశల జల్లులు కురిపించిన భగీరథుతుడివి
ఇంటింటి పెద్దన్నవి..
ఓ కారణ జన్ముడా!
అస్తిత్వపు దేవులాటలో
ఆగడాలను తరిమికొట్టిన అగ్గిపిడుగువి
'మనభాష –మనయాస'లో మార్గదర్శివి..
అవును, నాయకుడా.. అవును
మహాత్ముడి బాటలో మహామనీషి నీవు..

- డాక్టర్ ఎం.దేవేంద్ర, 9490682457

(రేపు సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా..)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

న్యాయం



మంగారి రాజేందర్

న్యాయమూర్తుల ఎంపికలో జాప్యానికి..

ఒక వ్యక్తి జీవితకాలంలో అతని కేసుకు సంపూర్ణ పరిష్కారం లభించకపోతే పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఇప్పుడు మన దేశంలో దాదాపు అలాంటి పరిస్థితే నెలకొని ఉంది. కోర్టుల పట్ల ప్రజలకు ఎంత విశ్వాసం ఉందో అంత అవిశ్వాసం కూడా ఉంది.

కేసుల పరిష్కారంలో జరుగుతున్న జాప్యానికి కారణాలెన్నో. ప్రొసీజర్లలో ఉన్న లొసుగులు, వాయిదాలు ఒక కారణమైతే, న్యాయమూర్తుల నియామకం జరుపకపోవడం మరో కారణం. కింది కోర్టుల్లో 5925 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయి. కేంద్ర న్యాయశాఖా సహాయ మంత్రి పీపీ చౌదరి పార్లమెంట్‌లో ఈ విషయాన్ని తెలియజేశారు. సరైన అభ్యర్థులు దొరుకకపోవడం, కొన్ని నియామకాలు కోర్టు కేసుల్లో చిక్కుకొనిపోవడం లాంటి కారణాల వల్ల కేసుల విచారణల్లో ఆలస్యం జరుగుతుందని ఈ నియామకాలు పూర్తిగా హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలను కూడా ఆయన పార్లమెంట్‌కు వివరించారు. నిజమే. కానీ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివి. ఆ న్యాయమర్తుల నియామకాలు కూడా నత్తనడక నడుస్తున్నాయి.

దేశవ్యాప్తంగా మంజూరు అయిన హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 1079. అందులో 403 పదవులు ఖాళీగా ఉన్నాయి. సుప్రీంకోర్టులో 31 న్యాయమూర్తులకుగాను 25 మంది న్యాయమూర్తులే ఉన్నారు. ఈ ఖాళీలను ఎందుకు పూరించలేదో తెలియదు. న్యాయమూర్తులు తక్కువగా ఉండి కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు కేసుల పరిష్కారంలో గుణాత్మకత (క్వాలిటీ) తగ్గిపోతుంది. న్యాయమూర్తుల మీద ఒత్తిడి పెరుగుతుంది. న్యాయమూర్తుల మీద కూడా క్లయింట్ల నుంచి విపరీతమైన ఒత్తిడి ఉంటుంది.

తమ హైకోర్టుల్లో న్యాయమూర్తులను నియమించండి అంటూ న్యాయవాదులు రోడ్లమీదికి వచ్చే పరిస్థితి ఏర్పడింది. సుప్రీంకోర్టు కొలీజియమ్ ఈ పరిస్థితికి బాధ్యత వహించాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం కారణమా, సుప్రీంకోర్టు కారణమా? రెండింటి మధ్య ఏర్పాటు కావాల్సిన మెమోరాండమ్ కారణమా అన్నది సామాన్య లిటిగెంట్‌కు సంబంధంలేని అంశం. ఈ ఖాళీలకు నిరసనగా మొన్న కర్ణాటక న్యాయవాదులు నిరాహారదీక్ష చేశారు. సీనియర్ న్యాయవాదులు కూడా ఈ నిరాహారదీక్షలో పాల్గొన్నారు. చివరికి ప్రభుత్వం ఐదుగురు న్యాయమూర్తులను కర్ణాటక హైకోర్టుకు నియమించింది. ఈ పరిస్థితి చూసి ఇప్పుడు ఒడిషా న్యాయవాదులు కూడా సమ్మె చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఓ వారం రోజుల పాటూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సమ్మె చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 16, 19వ తేదీల్లో మళ్లీ సమావేశం ఏర్పరిచి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని కూడా న్యాయవాదులు మీడియాతో చెబుతున్నారు.

మన హైకోర్టులో హైకోర్టు న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు కన్పించడం లేదు. జిల్లా న్యాయమూర్తుల నుంచి హైకోర్టు న్యాయమూర్తులను నియమించే ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయింది. దిగువకోర్టు న్యాయమూర్తుల విభజన జరుగులేదని అందుకని ఈ ప్రక్రియ ముందుకు జరుగడం లేదని కూడా కొంతమంది అంటున్నారు. అయితే ఇందులో ఎలాంటి హేతుబద్ధత కన్పించడం లేదు. ఎందుకంటే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత జిల్లా న్యాయమూర్తుల నుంచి ఇద్దరు న్యాయమూర్తులకు



పదోన్నతి కల్పించారు. అందులో ఈ జూనియర్ న్యాయమూర్తి కూడా ఉన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరో కారణాన్ని కూడా కొంతమంది న్యాయవాదులు అంటున్నారు. మన హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిని నియమించకపోవడం అన్నది ప్రధాన కారణమని ఆ

> మన దేశంలో హైకోర్టుల విచారణలో ఉన్న కేసుల సంఖ/్య 4.2 మిలియన్ కేసులు. ఇందులో 49 శాతం కేసులు ఐదు సంవత్సరాలు దాటినవి. కేసుల సంఖ్య పెరుగడం ఒక కారణం అయితే తగు సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం మరో కారణం. కోర్టు కేసులు పెండింగ్ ఉండటం వల్ల దేశ ఆర్థిక పరిస్థితికి ఎంత నష్టమో ఓ వ్యక్తికి అంతకన్నా ఎక్కువ నష్టం. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని పరిస్థితి అదుపు తప్పకుండా చూడాల్సిన బాధ్యత కొలిజీయమ్ మీదా ప్రభుత్వాల మీదా ఉన్నది.

న్యాయవాదులు అంటున్నమాట. ఈ మాటలో కూడా హేతుబద్ధత కన్పించడం లేదు. ఎందుకంటే ఇటీవలనే కొంతమంది న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి లభించింది.

మన హైకోర్టుకు శాశ్వత ప్రధాన న్యాయమూర్తి లేకుండా దాదాపు రెండున్నర సంవత్సరాలు దాటింది. శాశ్వత ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని ఆదేశించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది మన హైకోర్టులో ఓ ప్రజాహిత కేసును దాఖలు చేశారు. హైకోర్టు ఈ కేసును స్వీకరించలేదు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసినట్టు వార్తలు కన్పించాయి. అది ఏ దశలో ఉన్నదో తెలియదు. ఈ పరిస్థితి ఇలా ఉండగా న్యాయమూర్తి ఛత్తీస్‌గఢ్ ప్రధాన న్యాయమూర్తిగా వున్న టి.బి.ఎన్.రాధాకృష్ణన్‌ను మన హైకోర్టు శాశ్వత ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తారన్న వార్తలు వెలువడ్డాయి. ఈ వారంలో ఆ ప్రక్రియ తుదిరూపం దాల్చవచ్చని అంటున్నారు. ఏమైనా రెండు రాష్ట్రాలకు కలిపి ఉన్న కామన్ హైకోర్టుకు శాశ్వత ప్రధాన న్యాయమూర్తి రెండున్నర సంవత్సరాలుగా లేకపోవడం ఎంతవరకు సమంజసమో న్యాయకోవిదులు, న్యాయవాదులు, పాలకులు, రాజకీయ నాయకులు ఆలోచించాలి.

న్యాయమూర్తుల కోసం, ప్రధాన న్యాయమూర్తుల కోసం ప్రజాహిత కేసులను, సమ్మెలను న్యాయవాదులు చేస్తూపోతే న్యాయవ్యవస్థ విచ్ఛిన్నం కావడమే కాదు, విశ్వసనీయత కూడా కోల్పోయే అవకాశం ఉంది.

ప్రభుత్వం అందిస్తున్న సమాచారం ప్రకారం 24 హైకోర్టుల్లో 37 శాతం ఖాళీలున్నాయి. 13 హైకోర్టులు సిఫారసు చేసిన 120 ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. అవి ప్రభుత్వం దగ్గర సుప్రీంకోర్టు కొలీజియమ్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. 280 వరకు ఇంకా ఖాళీగా ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల పదవులకు హైకోర్టు సిఫారసు చేయాల్సి ఉన్నది. ఈ నియామకాల్లో ప్రభుత్వం ఆధిక్యత ఉండాలో, కొలీజియమ్ ఆధిక్యత ఉండాలానన్నది కక్షిదారుడికి సంబంధించిన అంశం కాదు. అందుకని ఈ రెండు వ్యవస్థలు ఒక ఏకాభిప్రాయానికి వచ్చి ఈ సమస్యను అధిగమించాలని సామాన్యుడు కోరుకుంటున్నాడు.

మన దేశంలో హైకోర్టుల విచారణలో ఉన్న కేసుల సంఖ/్య 4.2 మిలియన్ కేసులు. ఇందులో 49 శాతం కేసులు ఐదు సంవత్సరాలు దాటినవి. కేసుల సంఖ్య పెరుగడం ఒక కారణం అయితే తగు సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం మరో కారణం. కోర్టు కేసులు పెండింగ్ ఉండటం వల్ల దేశ ఆర్థిక పరిస్థితికి ఎంత నష్టమో ఓ వ్యక్తికి అంతకన్నా ఎక్కువ నష్టం. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని పరిస్థితి అదుపు తప్పకుండా చూడాల్సిన బాధ్యత కొలిజీయమ్ మీదా ప్రభుత్వాల మీదా ఉన్నది.


మిగతా రాష్ట్రాల న్యాయవాదులు కోర్టులను బహిష్కరించకముందే న్యాయమూర్తుల నియామకాలు జరుగుతాయని, జరుగాలని ఆశిద్దాం. అదేవిధంగా న్యాయమూర్తుల ఎంపిక పారదర్శకంగా జరుగాలని ఒత్తిడి చేద్దాం.

తెలుగు రాష్ట్రాల న్యాయవాదులు కేసులను మాత్రమే దాఖలు చేస్తున్నారు. రోడ్ల మీదికి రావడం లేదు. అందుకు సంతోషిద్దాం. కేసుల పరిష్కారంలో జాప్యానికి ఓ అర్థం ఉన్నది. మరి న్యాయమూర్తుల ఎంపికలో జాప్యానికి...?

(వ్యాసకర్త: కవి, రచయిత)

నూతన సమాజ నిర్మాణ ప్రదాత

విశ్లేషణ



బి.ఎస్.రాములు

కేసీఆర్ నూతన సమాజ నిర్మాణంలో తీసుకుంటున్న కార్యక్రమాలు ఎన్నో.. అందులో కేజీ టు పీజీ రెసిడెన్షియల్ స్కూల్స్ రేపటి సమాజ నిర్మాణానికి సంబంధించినవి. మనకండ్ల ముందే గౌలిదొడ్డి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఒక నూతన సమాజ నిర్మాణం జరుగుతున్నది. నూతన భారతదేశ నిర్మాణం తరగతి గదిలో జరుగుతుందని రజనీ కొఠారీ చెప్పిన మాట అక్షరాల నిజం. మేం కలలు గన్న నూతన సమాజం గౌలిదొడ్డి రెసిడెన్షియల్ స్వారోస్‌లో దర్శనమిస్తు న్నది. అది భవిష్యత్ సమాజం రూపుదిద్దుకుంటున్న ఒక ఆదర్శ నమూ నా. గౌలిదొడ్డి రెసిడెన్షియల్ పాఠశాల దేశానికే ఒక నమూనా. ఆదర్శం. కేసిఆర్ జన్మదినం సందర్భంగా ప్రజలకు ఇంతకన్నా గొప్ప కానుక ఏముంటుంది?

గౌలిదొడ్డి స్వారోస్‌లో జరుగుతున్న విశేషాలను చూడాలని ఎన్నాళ్లనుంచో అనుకుంటున్న. హైదరాబాద్ గచ్చిబౌలి సమీపంలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించాను. ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, అధికారులు, విద్యార్థినులు రోజువారీ పాఠశాల కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తున్నారో స్వయంగా తెలుసుకున్నాను.

పాఠశాల వరండాలోకి చేరగానే వరండాలోగల పాఠశాల వివరాలను పరిచయం చేశారు. బిల్డింగ్ మధ్యలో పాఠశాల విశేషాలను, సందర్శకులు వచ్చి చూసిన విశేషాలను, విద్యార్థినుల ప్రతిభా పాటవ విశేషాలను విద్యార్థినులు బోర్డ్‌పై అతికించిన ఫొటోలను చూపిస్తూ, వివరించారు. ప్రిన్సిపల్ పాఠశాల పూర్వపరాలు, విశేషాలు వివరించారు. వారి కాల ప్రణాళిక, పత్రికలు, బ్రోచర్లు అందజేస్తూ, సంక్షిప్తంగా వివరించారు.

తర్వాత తరగతిగదుల సందర్శన. ఒక గదిలో విద్యార్థినులే పాఠాలు చెప్పే పద్ధతి. మరొక గదిలో గ్రూపులుగా విడివడి ఒక అంశంపై డిబేట్ చేయడం, ఐఐటీ శిక్షణ, సమ్మర్ సమరైజ్ ప్రోగ్రాం ఇందులో హార్స్ రైడింగ్, సింగింగ్, స్విమ్మింగ్, ఫిల్మ్‌మేకింగ్, జర్నలిస్ట్ క్యాంప్, యంగ్ పొలిటీషియన్ క్యాంప్, రొబోటిక్ క్యాంప్, ఆర్ట్స్ క్యాంప్ ఇంకా మొదలైన 40 క్యాంపులు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయి.

లైబ్రరీ చూడముచ్చటగా అనేకరంగాల పుస్తకాలు తీర్చిదిద్దిన తీరు ఆదర్శంగా ఉన్నది. పిల్లలే ఆయా పుస్తకాల విశేషాలను, లైబ్రరీ పుస్తకాల వివరాలను చెప్పడం ఆసక్తికరం. పాఠశాలలో నిత్యం ప్రార్థనలో పఠించే 10 కమాండ్‌మెంట్స్ వలె ఇవన్నీ చేయగలుగుతున్నామని విద్యార్థులు చెప్పారు. మిర్రర్ ప్రాక్టీస్ ఒక అద్భుతమైన ప్రక్రియ. ప్రసంగించేముందు విద్యార్థినులు అద్దం ముందు నిలబడి తననుతాను చూసుకుంటూ ప్రసంగిస్తారు. అలా ఉపన్యాసాలు ఇవ్వడాన్ని, పాఠం చెప్పడాన్ని, హావభావాలను ప్రాక్టీస్ చేస్తుంటారు. ఇదెంతో ఉపయుక్తంగా ఉన్నది.

'అవర్ ఐడలాజికల్ ఫాదర్' అని ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ రాసిన కవిత ఒక నినాదంగా మారిపోయింది. 'అవర్ ఐడలాజికల్ ఫాదర్' అనగానే విద్యార్థినులందరూ అంబేద్కర్ పేరు నినదించడం ఉత్తేజకరం.

సాధారణంగా గ్రామాల్లో, హాస్టల్లో పల్లెనిద్ర, హాస్టల్ నిద్ర అనే కార్యక్రమం సాగుతుంది. ఈ రెసిడెన్షియల్ పాఠశాల విషయానికి వస్తే ఉదయం ప్రార్థనా సమయం నుంచి రాత్రి భోజనం దాకా వారిని, వారి తరగతులను, కార్యకలాపాలను గమనిస్తే ఒక నూతన ప్రపంచం ఆ పాఠశాలలో రూపుదిద్దుకున్న విషయం అనుభూతిలోకి వస్తుంది. రేపటి సమాజ నిర్మాతలు వీరే.

పిల్లలు ఐదు, ఆరు తరగతుల నుంచి అందరూ చక్కగా ఇంగ్లీషులో వేగంగా మాట్లాడటం, జవాబులివ్వడం, జంకు, గొంకు లేకుండా ఆనందంగా, స్వేచ్ఛగా హావభావాలతో అడిగినదానికి చెప్పడం, తాము చెప్ప దలచుకున్నదాన్ని హావభావాలతో ఉన్నతమైన వ్యక్తిత్వం ఉట్టిపడే బాడీ లాంగ్వేజ్‌తో ప్రసంగించడం అద్భుతం. గ్రీన్ బల్లపై పాఠం చెప్తూ ఇంగ్లీషులో రాస్తున్న అక్షరాలు అచ్చు అక్షరాల్లా అందంగా మెరిసిపోతున్నాయి. ఎనిమిదవ తరగతి బాలిక అంత అందంగా అక్షరాలు రాయడం గురించి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా హ్యాండ్‌రైటింగ్ ప్రాక్టీస్ కోసం రెండు నెలలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అందరి హ్యాండ్‌రైటింగ్ ఇంతే అందంగా ఉంటుందని చెప్పడం ఆనందం కలిగించింది.

> రేపటి సమాజ నిర్మాతలం మేమే అనే విశ్వాసం విద్యార్థినుల వారి కండ్లల్లో, మాటల్లో, హావభావాల్లో వ్యక్తం కావడం చూసి తీరవలసిందే. ప్రతి ఒక్కరిలో తమ జీవిత లక్ష్యాలపట్ల స్పష్టత ఉండటం గొప్ప విషయం. సీఎం కేసిఆర్ జన్మదినానికి ఇంతకన్నా గొప్ప కానుక ఏముంటుంది? భవిష్యత్ నిర్మాణం చేస్తున్న ముఖ్యమంత్రి కేసిఆర్‌కు అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు.

పిల్లలతో కలిసి ఉంటే పిల్లలుగా మారిపోవాలనిపిస్తుంది. ప్రిన్సిపల్, ఉన్నతాధికారులు, టీచర్లు కూడా విద్యార్థినుల వలె కూర్చొని పిల్లలు పాఠం చెప్తే శ్రద్ధగా విన్నారు. ఈ పాఠశాల విశేషాలను ఒక్కమాటలో వివరించలేం. అనేక రాష్ట్రాల నుంచి విద్యార్థులు, ప్రిన్సిపల్స్, పాఠశాలను ఒక పవిత్రక్షేత్రంలా దర్శించి వివరాలు తెలుసుకొని వెళ్లడం సంతోషమేసింది. అవన్నీ చూస్తుంటే మహారాష్ట్రలో ఆదర్శగ్రామంగా రూపుదిద్దుకున్న రాలేగాంసిద్ధి గ్రామాన్ని, దాని రూపశిల్పి అన్నాహజారేను గుర్తుకు తెచ్చింది. సరిగ్గా అలాగే ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తన అధ్యయనాన్ని ప్రపంచంలో అనేక దేశాల్లో సాగుతున్న విద్యా విధానాల్లోని విశేషాలను, ప్రయోగాలను, వాటిలోని మంచిని స్థానిక పరిస్థితులకు, పేద, దళిత, విద్యార్థినులకు అన్వయించి అమలుచేయటం అద్భుతం. వాటిని విజయవంతంగా అమలు జరుపడం హర్షణీయం. అందుకు సీఎం కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి జగదీశ్వర్‌రెడ్డిల ప్రత్యేక శ్రద్ధతో నిధుల, సిబ్బంది కొరత లేకుండా చూడటం వల్ల ఈ పాఠశాల దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నది. మేం ముప్పై ఏండ్లుగా కలలు గంటున్న రెసిడెన్షియల్ విద్యావిధానం కండ్ల ఎదుట కనపడింది. తలచుకుంటే ఎంత తొందరగా సమాజాన్ని మార్చవచ్చో, రేపటి సమాజాన్ని నేడే రూపొందించవచ్చో ఈ పాఠశాలను చూస్తే అర్థమైంది.

బాధాకరమైన విషయమేమంటే ఇటీవలే కేంద్రం 15 వేల కోట్ల రూపాయలతో కొన్ని తుపాకులు కొంటున్నారనే వార్త. ఈ తుపాకులు లేకపోతే గడువదా? ఇప్పుడున్న ఆయుధ సంపద చాలదా! 15 వేల కోట్ల రూపాయలతో విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తే ఎంత మార్పు వస్తుందో కదా! విద్యార్థులకు ఆయా దశల్లో సైనిక శిక్షణ ఇచ్చే ఇజ్రాయెల్ వలె విద్యారంగంలో ప్రవేశపెడితే సైనిక వ్యయం అంతా విద్యారంగానికే కేటాయించవచ్చు. ఇటీవల ఇదే దృక్పథంతో తెలంగాణ ప్రభుత్వం ఒక సైనిక పాఠశాలను ప్రారంభించింది. 15 వేల కోట్లతో ఇలాంటి పాఠశాలలను ప్రారంభిస్తే ఎంత బాగుండేది. సైనిక వ్యయాన్ని ప్రత్యేక సైనిక వ్యవస్థ, పోలీసు వ్యవస్థ తీర్చిదిద్దడానికి ఆ బడ్జెట్‌ను విద్యా బడ్జెట్‌లో భాగంగా చేసి, విద్యతోపాటు, ఎన్‌సీసీ, పారామిలిటరీ వంటి శిక్షణలు అందించడం ద్వారా క్రమశిక్షణతో పాటు, దేశభక్తి, సమస్త రంగాల ఆత్మవిశ్వాసం, నైపుణ్యం ఎదుగుతుంది. వాళ్లే దేశాన్ని రక్షించుకుంటారు. పరిపాలించుకుంటారు.

రేపటి సమాజ నిర్మాతలం మేమే అనే విశ్వాసం విద్యార్థినుల వారి కండ్లల్లో, మాటల్లో, హావభావాల్లో వ్యక్తంకావడం చూసి తీరవలసిందే. ప్రతి ఒక్కరిలో తమ జీవిత లక్ష్యాలపట్ల స్పష్టత ఉండటం గొప్ప విషయం. సీఎం కేసిఆర్ జన్మదినానికి ఇంతకన్నా గొప్ప కానుక ఏముంటుంది? భవిష్యత్ నిర్మాణం చేస్తున్న ముఖ్యమంత్రి కేసిఆర్‌కు అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 16 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

జీన్స్‌లూ.. స్కర్టులే సౌకర్యం అనుకుంటున్నారు నేటి తరం అమ్మాయిలు..
పండుగ వచ్చినా.. పబ్బం వచ్చినా పట్టు పరికిణీలే కట్టాలంటున్నారు పెద్దవాళ్లు..
పదహారణాల తెలుగింటి ఆడపడుచుగా వెలిగిపోవాలంటే.. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలంటే..
పట్టు పరికిణీలు కట్టాల్సిందే! తెలుగింటి అమ్మాయికి బ్రాండ్ పట్టు లంగానే!
ఇప్పుడంతా పెండ్లిళ్ల సీజన్ నడుస్తున్నది.. కాంజీవరం.. బెనారస్‌తో చేసిన పట్టు పరికిణీలే ఈ వారం ఫ్యాషన్..

పట్టు పరవళ్లు!



పవులూరి నాగతేజ
ఫ్యాషన్ డిజైనర్, తేజ శారీస్
కూకట్‌పల్లి, హైదరాబాద్
tejasarees@yahoo.com

ఆకుకూరలే మంచివి!



- పొన్నగంటికూర కంటిచూపును మెరుగుపరిచి, శరీరానికి చలువనిస్తుంది.
- రక్తాన్ని శుద్ధి చేసి, కాలేయానికి పుష్టినిచ్చే ఆకుల్లో చింతచిగురు ముందుంటుంది.
- కిడ్నీ, మూలవ్యాధులను నయం చేయడంలో చామకూర బాగా పనిచేస్తుంది.
- ముల్లంగి ఆకు సర్వరోగ నివారినిలా పనిచేస్తుంది.
- గ్యాస్ సమస్యలను తగ్గించడంలో పుదీనాను మించినది లేదు.
- కంటి సమస్యలకు చెక్ పెట్టాలంటే వారానికి కనీసం రెండుసార్లు పాలకూర తినండి.
- రక్తవృద్ధికి తోటకూర తినండి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది మంచి పోషకం.

ఎండ వల్ల జుట్టుకు నష్టమా?



అడుగండి చెబుతా

నేను ఒక ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తాను. వృత్తిరీత్యా ఎక్కువగా ప్రయాణాలు చెయ్యాల్సి ఉంటుంది. ఎక్కువ సమయం ఎండలో గడుపాల్సి కూడా ఉంటుంది. ఈ మధ్య జుట్టులో తేమ చాలా తగ్గిపోతున్నట్టు అనిపిస్తున్నది. జీవం లేనట్టు కనిపిస్తున్నది. ఇలా జరుగడానికి కారణం ఏమిటి? ఎండ వల్ల జుట్టుకు నష్టం వాటిల్లుతుందా? వచ్చేది ఎండాకాలం. వేసవిలో జుట్టు విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పూర్తిగా వివరించగలరు.

నిహారిక, హైదరాబాద్

ఎండ వల్ల జుట్టుకు కూడా నష్టం వాటిల్లుతుంది. సూర్యరశ్మి వల్ల జుట్టుమీది పైపొర తొలగిపోతుంది. ఫలితంగా జుట్టు చివర్లు చిట్లి పోతాయి. ఇలా జరిగినపుడు జుట్టులోని తేమ చాలా త్వరగా నష్టపోతుంది. అందు వల్ల జుట్టు జీవంలేనట్టుగా కనిపిస్తుంది. ఎండాకాలంలో కేవలం చర్మం కోసం మాత్రమే కాదు జుట్టుకోసం కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరమవుతుంది. ఎండాకాలంలో ఎక్కువగా చమట పడుతున్నదన్న కారణంగా కొంతమంది ప్రతిరోజూ షాంపులు ఉపయోగించి తలస్నానం చేస్తుంటారు. ఇది అంత మంచిది కాదు. రోజూ షాంపు వాడడం వల్ల జుట్టు, తల మీది చర్మంలోని తేమ తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వారంలో రెండుసార్లు షాంపూ ఉపయోగించి తలస్నానం చేస్తే చాలు. ఎండలో బయటికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా జుట్టును స్కార్ఫ్‌తో కప్పుకోవడం అవసరం. అందువల్ల అతి నీలలోహిత కిరణాల బారి నుంచి జుట్టును రక్షించుకోవచ్చు. వారంలో రెండు సార్లు తలస్నానానికి ముందు కొబ్బరి నూనె జుట్టుకు, మాడుకు రాసుకోవడం వల్ల జుట్టు, తలమీది చర్మంలో తేమ తగ్గిపోకుండా ఉంటుంది. తడి జుట్టును వీలైనంత వరకు సహజంగా ఆరిపోయేట్టు చూసుకోండి. జుట్టును ఆరబెట్టడం కోసం హెయిర్ డ్రయర్లను, బ్లోయర్లను ఉపయోగించడం, పలు రసాయనాలను జుట్టు మీద వాడడం, జుట్టు దువ్వే సమయంలో సున్నితంగా ప్రవర్తించడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు కూడా జుట్టుకు జరిగే నష్టం నుంచి కాపాడుతాయి.



డాక్టర్ ఆకాన్ష్ జైన్
డెర్మటాలజిస్ట్
సన్‌షైన్ హాస్పిటల్స్
సికింద్రాబాద్

హిజాబ్‌తో ప్రచారం!



జుట్టు ఉత్పత్తులను వాణిజ్య ప్రకటనలో చూపించాలంటే కురులు అలా గాల్లోకి ఎగురాలి. ముంగురులను అమ్మాయిలు సుతారంగా సర్దుకోవాలి. కానీ హిజాబ్‌తో ఉన్న ఈమె వినూత్న ప్రచారం చేస్తున్నది.

అందాల ప్రపంచంలో ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచించకపోతే ఎలాంటి వాణిజ్య ఉత్పత్తులైనా వెనుకబడి పోవాల్సిందే! అందుకే లోరియల్ కాస్త కొత్తగా ఆలోచించింది. బ్రిటీష్ ముస్లిం బ్లాగర్ అయిన అమీనా ఖాన్‌తో జుట్టుకు చెందిన ప్రొడక్ట్‌లపై క్యాంపెయిన్ చేపట్టింది. ఈమె ఆర్డెరీ కాస్మొటిక్స్‌కి కో ఫౌండర్ కూడా. ఈ క్యాంపెయిన్‌లో ఎక్కడా ఈమె జుట్టు కనిపించదు. కానీ ఈమె చేసిన వీడియోకి మాత్రం విశేష స్పందన లభించింది. వారం రోజుల్లోనే ఆరు లక్షలకు పైగా మంది ఈ వీడియోని వీక్షించారు. పైగా అందరూ పొగడ్తలతో ఈ క్యాంపెయిన్‌ని మెచ్చుకుంటారు. మనం చేయాలనుకునే ప్రచారానికి మన మాటలు వినిపిస్తే చాలు అంటున్నది అమీనా!

గోరింట పోతుందిలే!



- గోరింటాకు బట్టలకు అంటగానే చాలామంది నీళ్లతో కడిగేస్తుంటారు. అలా చేస్తే మరక ఇంకాస్త పెద్దదవుతుందే కానీ.. పోదు. మరకపడిన చోట మెత్తని వస్త్రంతో తుడిచి, ఆరిన తర్వాత ఉతుకాలి.
- మరక పోకుండా మొండికేస్తే.. ఆ వస్త్రాన్ని కాస్త వెనిగర్ కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే ఫలితం ఉంటుంది.
- మరకపడిన చోట చిన్న సబ్బుముక్కతో గుండ్రంగా గీయండి. ఆ తర్వాత టూత్‌బ్రష్‌తో దాన్ని రుద్ది, చన్నీళ్లతో ఉతికితే వస్త్రం పాడవదు. ఇలా చేస్తే గోరింటాకు మరకలే కాదు.. హెన్నా మరకలు కూడా పోతాయి.
- పాలను బాగా మరిగించి అందులో మరకపడిన వస్త్రాన్ని నానబెట్టి, కొద్దిసేపటి తర్వాత సబ్బుతో ఉతికితే మరక మటుమాయమవుతుంది.
- మార్కెట్లో దొరికే హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో దుస్తులను ఉతికితే హెన్నా, గోరింటాకు మరకలు సులభంగా పోతాయి.

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 16 ఫిబ్రవరి 2018

బుద్ధమార్గం

మనసులోనూ మంచే..

చెడ్డగా మాట్లాడడం, చెడ్డపనులు చేయడమే కాదు, మనసుతో కూడా చెడ్డ ఆలోచనలు లేకుండా ఉండడమే సరైన వ్యక్తిత్వం అని బౌద్ధం చెప్తుంది. ఒక చిన్న విషయాన్ని తప్పుగా ఆలోచించిన ఒక ధార్మికుని కథ ఈ విషయాన్ని తెలియజేస్తుంది.

వారణాసిని బ్రహ్మదత్తుడనే రాజు పాలిస్తున్నాడు. ఆ నగరానికి ద్వారపాలకునిగా ఉంటున్నాడు సుజనుడు. అతడు మనసా, వాచా, కర్మణా చిన్నపాటి దోషం కూడా ఎరుగనివాడు. ద్వారపాలకునిగా తన ఉద్యోగ ధర్మాన్ని చక్కగా పాటిస్తాడు. వ్యక్తిగా పరమ ధార్మికునిగా జీవిస్తాడు.

ఒకరోజున కళింగరాజు పంపిన పండితులు కొందరు. బ్రహ్మదత్తుని ఆస్థానానికి వచ్చి –

'మహారాజా! మీరు పరమ ధార్మికులని విన్నాం. మీరు పాటించే నియమాలు తెలుసుకురమ్మని మా ప్రభువులు పంపారు. వాటిని జాగ్రత్తగా ఆచరిస్తే మా రాజ్యం కూడా సుభిక్షంగా ఉంటుందని తలచి మీ వద్దకు పంపారు. మనిషి పాటించాల్సిన గొప్ప ధర్మం ఏది?' అని అడిగారు. దానికి రాజు –'ధర్మాన్ని గురించి చెప్పే అర్హత నాకు లేదు. మా నగర ద్వారపాలకుడు సుజనుడు అందుకు తగినవాడు' అని చెప్పి పంపాడు. వారు సుజనుని దగ్గరకు వెళ్లి, విషయం చెప్పారు.

'పండితులారా! నిజం చెప్పాలంటే ఆ అర్హత నాకూ లేదు' అన్నాడు.

'మరి మహారాజుగారే మీ వద్దకు పంపారు గదా!' అని అడిగారు.

'నిజమే! కానీ.. నేనొక పెద్ద అపచారం చేశాను' అన్నాడు.

'అంత పెద్ద తప్పు చేస్తే రాజుగారికి తెలియకుండా ఉంటుందా?' అని ప్రశ్నించారు. 'తెలియదు' అన్నాడు.

'ఇంతకీ మీరు చేసిన అపచారం ఏమిటి?' అని ప్రశ్నించారు.



'ఒకరోజున నగర ద్వారం మూసే సమయంలో ఆ విషయాన్ని తెలియజేస్తూ గంటలు మ్రోగించాను. ముమ్మారు మ్రోగించి తలుపులు మూస్తున్నాను. ఖచ్చితంగా అదే సమయానికి ఒక పురుషుడు, ఒక స్త్రీ ఇద్దరూ కట్టెల మోపు నెత్తిన పెట్టుకుని పరుగుపరుగున వస్తున్నారు. వారికోసం తలుపులు వేయడం ఆపాను. ఈ భార్యాభర్తలిద్దరూ కబుర్లాడుకుంటూ వస్తూ ఉంటారు. అందుకే ఈ ఆలస్యం' అనుకుని, 'ఏమయ్యా! వేళకే తలుపులు మూస్తారని తెలియదా? జాగు చేసుకుంటూ వచ్చారు!' అన్నాను. 'నా చెల్లెలు నడవలేకపోయింది. అందుకే ఆలస్యమైంది' అన్నాడు. ఆమె అతని చెల్లెలు. కానీ వారిద్దరూ భార్యాభర్తలై ఉంటారని, సరసాలాడుకుంటూ, ఆలస్యం చేశారని అనుకున్నాను. ఈ ఆలోచనే తప్పు. ఇంత పెద్ద తప్పు చేసిన నేను ధర్మం బోధించడానికి తగను' అన్నాడు సుజనుడు.

పండితులు మారుమాట్లాడకుండా తిరిగి వెళ్లి, ఈ విషయం రాజుగారికి చెప్పారు. మహారాజే ధర్మాన్ని గురించి తన ద్వారపాలకుణ్ణి అడగమని చెప్పడం, అతడు తన మనస్సులో అనుకున్న చిన్న విషయాన్ని కూడా ఘోరమైన తప్పిదంగా భావించడం.. విన్నాక ధార్మిక జీవనం, ధర్మం అంటే ఏమిటో అర్థమైంది. కుశల ఆలోచనే ధర్మానికి తొలిమెట్టు అని అవగతమైంది.

... ✍ బొర్రా గోవర్ధన్

ఉపనిషత్సుధ - 9



చావు, పుట్టుకల గుట్టు తెలిపే కఠోపనిషత్తు!

బాల్యావస్థను దాటి కౌమారంలోకి ప్రవేశించిన నచికేతసుడు ఒక ప్రక్క... సంయమీంద్రుడు, ధర్మచక్రవర్తి, మరణ రహస్యాన్ని యెరిగిన ప్రశాంత, ప్రసన్న గంభీర మూర్తి యమధర్మరాజు మరొకవంక మాట్లాడుకుంటున్న అద్భుత సందర్భం..

అలా.. సాధకుడు - బోధకుడు, అన్వేషి - ఆచార్య సత్తముడు, అర్థి - వరదాత కలుసుకుంటే ఏం జరుగుతుందో, జరగాలో తెలియజెప్పే కఠోపనిషత్ ఆరంభమే ఒక రసమయ కవితామృత ధార.

అందుకే శంకర భగవత్పాదులు ఈ ఉపనిషత్తుకు భాష్యం వ్రాయాలని సంకల్పించుకున్నప్పుడు ముందుగా మృత్యుదేవతకు, ఆపైన నచికేతసుడికి ప్రణమిల్లుతాడు.

ఆధ్యాత్మ శాస్త్రాన్ని ఔపోశనం చేసిన మహనీయ మూర్తుల కలయిక బ్రహ్మ విద్యా రహస్యాన్ని అంటే జనన మరణ మూలాలను, జీవాత్మ పరమాత్మ సంగతులను, దయామయంగా విశ్లేషించే భాగ్యసీమను పరిచయం చేస్తుంది. ఆ భాగ్యసీమ కఠోపనిషత్.

సాధనకు, శోధనకు, బోధకు, అన్వేషణకు, రహస్యాన్ని ఛేదించడానికి రాజమార్గాన్ని తెరిచి, పరిచే కఠోపనిషత్, మత మౌఢ్యాన్ని వదల్చి, మనిషి పూర్ణ మానవుడిగా జీవించగల అధ్యాత్మ బోధను అధివాస్తవికంగా ఆవిష్కరిస్తుంది. సంకుచితత్వం నుండీ విశాల భావనా భూమిక వైపు నడిపిస్తుంది. నిజానికి చావు పుట్టుకల గుట్టును రట్టు చేసే రమణీయ బోధ ఇది.

ప్రవచనాలు భావావేశాన్ని రగిలించి స్వర్గ సుఖాల గురించి, పరలోక ప్రభావాలను ప్రస్తావిస్తే ఈ ఉపనిషత్ ఉత్తమ మానవ జీవితాన్ని గడుపుతూ ఇహలోకంలోనే జీవన్ముక్త స్థాయిని అందుకోవడం సాధ్యమేనని నిరూపణ చేస్తుంది.

ఏ అధ్యాత్మ సాధనకైనా శీలమే ఆధారం. ముందుగా తనపై తనకు ఆత్మ విశ్వాసం ఆపై ఆత్మశక్తి ఉండాలి. ఈ రెండింటిని సమన్వయం చేసుకున్నప్పుడు అది ఆత్మ ప్రజ్ఞగా మారుతుంది. అదొక అజేయ శక్తి. అనంత ఆనంద ప్రవాహం..

ఏ విద్యను అభ్యసించాలన్నా శ్రద్ధ అవసరం. శ్రద్ధలో విశ్వాసం, భౌతిక బలం, పట్టుదల, నిరంతర కృషి, అలుపెరుగని ప్రయాణం, నైపుణ్యం వంటివి ఎన్నో ఇమిడి ఉన్నయ్. దీనికి ఆత్మశక్తి జతగూడితే అన్వేషణ సుసాధ్యం.

మృత్యువు కన్నా గొప్పది...సత్యం!

నిర్వేదం, నిరాశ, అలసత్వం, అవిశ్వాసం, అనైతికత వంటి వ్యతిరిక్త విషయాలు మనిషిని మహనీయత వైపు నడిపించలేవు. కేవలం లౌకిక భౌతిక విషయాలు శాశ్వతమని నమ్మి ఆ మార్గంలో సాగించే ప్రయాణం ఒక నిరర్థక ప్రయాస.

ఈ నేపథ్యంలోనే నచికేతసుడు తన తండ్రి చేస్తున్న యాగ ప్రక్రియను, దాన విధానాన్ని గమనించి తండ్రితో సూటిగా 'తండ్రీ! ఈ పాలివ్వని, శక్తిహీనమైన ఆవుల్ని ఎందుకు దానం చేస్తున్నావు? ఇది అనైతికం, అధర్మం కాదా' అంటూ విడువకుండా ప్రశ్నిస్తూనే 'నన్నెవరికి దానం చేస్తావు?' అని అడిగినప్పుడు పరధ్యానంలో అప్పటికే విసుగెత్తి ఉన్న తండ్రి 'మృత్యువుకు' అన్నాడు.

నచికేతసుడికి కావలసింది ఇదే. అమరము, అచ్యుతము, అప్రమేయము, అనంతము, అపరిణామము, నిత్య సత్య శాశ్వతమైన ఆత్మవిద్యా రహస్యము తెలియని కారణంగా, అజ్ఞానానికి లోనైన తన తండ్రి దాన వ్రతం సాగిస్తున్నాడని, తండ్రి సత్యపథాన్ని నిర్దేశించాలని అనుకున్నాడు నతికేతసుడు.

తండ్రి యందు గల ప్రేమే అతనికి ఈ ప్రేరణ కలిగించింది. ఈ ధైర్యం, నిర్భయం తనలోని శ్రద్ధ నుండి తనకు లభించినవే. ఇంతలోనే తండ్రికి పశ్చాత్తాపం కలిగింది. తన తొందరపాటుతనానికి దుఃఖం కలిగింది. ఏ తండ్రీ అనకూడని, అనరాని, అనలేని మాట అతణ్ణి యాతనకు గురిచేసింది. తాను అన్న మాటను ఉపసంహరించుకునే ప్రయత్నం చేస్తున్నప్పుడు శ్రద్ధాళువు, సత్యవాది, సత్యార్థి, సత్యాన్వేషి అయిన నచికేతసుడు దాన్ని అంగీకరించక, వెనుకంజ వేయక, 'మృత్యువు ఎదురైనా వెనక్కి వెళ్లవద్దు. సత్యం మృత్యువు కంటే ఉన్నతమైనది, అది చావు లేనిది. గతంలోంచి స్ఫూర్తిని పొందాలి. సత్యం ఆచరణాత్మకం కావాలి. సత్యం సమాజాన్ని నడిపించాలి. సమాజం సత్యాన్ని గౌరవించి దాన్ని ఆచరించాలి. ఆదరించాలి' అన్నాడు.

నచికేతసుడు యమలోకానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. అది తిరుగులేని నిర్ణయం.

... ✍ వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

వేదోక్తి

ఏది నిష్కామ కర్మ?



ఫలాపేక్ష లేకుండా కర్మలు చేయాలి. ఫలాపేక్షతో చేసిన కర్మలు మనిషిని బంధిస్తాయి. అట్లని కర్మలు చేయకుండా ఉండరాదు. అకర్మ కంటే సకామ కర్మ ఉత్తమం. సకామ కర్మ కంటే నిష్కామ కర్మ ఉత్తమం. కర్మలు చేయనివాడిని సోమరిపోతుగా లెక్కించింది వేదం. వేదం కర్మలను ప్రోత్సహిస్తుంది. కర్మలాచరిస్తూనే నూరేళ్లు జీవించమని ప్రబోధిస్తుంది.

కర్మ సన్యాసం అనే మాటకు కర్మలను విడిపెట్టడమని అర్థం చెప్పుకోరాదు. కర్మలను చేస్తూ వాటి ఫలాలను విడిచిపెట్టడమని గ్రహించాలి.

ఆత్మను వెలిగించే దైవం

సృష్టి జడచేతనాత్మకమైంది. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. అతనితో సమానుడు గాని, అతణ్ణి మించినవాడు గాని లేడు. అతడు అనంతుడు. న్యాయకారి. సర్వ జీవ హితమే అతని సృష్టి రహస్యం. అందుకే అతనికి ఒక శరీరంగా జడ జగత్తును, మరొక శరీరంగా చేతన జగత్తును పేర్కొంటారు. దేహం లేనివాడే దేహంలో ఉంటాడు. ఆత్మను వెలిగించేవాడతడే. అప్పుడప్పుడు ఆత్మను ప్రబోధించేవాడు కూడా అతడే.

'సర్వేజనాః సుఖినోభవంతు' అందరూ సుఖంగా ఉండాలని వేదం ప్రబోధిస్తుంది. భగవంతుని శాసనం అందరికీ ఒకేవిధంగా వర్తిస్తుంది. పక్షపాతరహితమైంది అతని శాసనం. అన్ని కాలాల్లోను అది ఒకే విధంగా ఉంటుంది. కృతయుగంలో ఒక విధంగా, కలియుగంలో మరొక విధంగా ధర్మం నడుస్తుందని చెప్పడం సరికాదు. ఏ యుగంలోనైనా ధర్మం ధర్మమే. సత్యం సత్యమే. ధర్మం తప్పితే మనిషి శిక్షార్హుడే. ఒకవేళ అధర్మానికి పాల్పడి తప్పించుకున్నా భగవంతుడు మాత్రం ఏదో ఒక రూపంలో, ఏదో ఒక సమయంలో దుఃఖాన్ని కలిగించకుండా ఉండడు. దుఃఖమే శిక్ష, సుఖమే రక్ష. సుఖ దుఃఖాలను ప్రసాదించేవాడు భగవంతుడే.

కర్మ సన్యాసం అంటే ఇదే...

మనం చేసే కర్మలను బట్టి సుఖ దుఃఖాలుంటాయి. సుఖ దుఃఖాలను అనుభవించడానికి జన్మలెత్తవలసి ఉంటుంది. కర్మలు చేసినంత కాలం జన్మలు తప్పవు. జన్మలున్నంతకాలం సుఖ దుఃఖాలు తప్పవు. అందుకే జన్మరాహిత్యం కోసం ప్రయత్నించాలి. ముఖ్యంగా ఫలాపేక్ష లేకుండా కర్మలు చేయాలి. ఫలాపేక్షతో చేసిన కర్మలు మనిషిని బంధిస్తాయి. అట్లని కర్మలు చేయకుండా ఉండరాదు. అకర్మ కంటే సకామ కర్మ ఉత్తమం.



సకామ కర్మ కంటే నిష్కామ కర్మ ఉత్తమం. కర్మలు చేయనివాడిని సోమరిపోతుగా లెక్కించింది వేదం. వేదం కర్మలను ప్రోత్సహిస్తుంది. కర్మలాచరిస్తూనే నూరేళ్లు జీవించమని ప్రబోధిస్తుంది.

'కుర్వన్నేవేహ కర్మాణిజ జీవిషేత్ శతఃమాసమాః'

కర్మలు చేస్తూ ఉండాలి. కాని వాటి ఫలాలను ఆశించరాదు. ఒకవేళ ఫలాలాశిస్తే కర్మబంధనాలలో చిక్కుకోవలసి వస్తుంది. కర్మవాసనలు వట్టిగా పోవు. మనల్ని ఏ జన్మలోనైనా వెన్నంటి ఉండేవి అవే. చేయదగిన కర్మకే కర్తవ్య కర్మ అని పేరు. కర్తవ్య కర్మలే శుభకర్మలు. ఇతరులకు వాటివల్ల ప్రయోజనం కలిగితే అవి పుణ్యకర్మలవుతాయి. పుణ్యకర్మలు గాని, పాపకర్మలు గాని మనిషిని సంసారంలో పడేసేవే. సంసారం కర్మల రూపంలో మనిషిని బంధిస్తుంది. పుణ్మకర్మలు చేసినంత కాలం మానవ జన్మ సిద్ధిస్తుంది. కర్మలు చేయడానికి, వాటి ఫలాలు అనుభవించడానికి అనువైంది ఒక్క మానవ జన్మే.

మనిషిగా ఉంటేనే చేసిన కర్మలకు గుర్తింపు. కనుకనే భగవంతుడు ఏవి సత్కర్మలో, వేటిని మనిషి ఆచరించాలో చెప్పవలసి వచ్చింది.

'శరీరమాద్యంఖలు ధర్మసాధనమే' అనే మాట మానవునికే వర్తిస్తుంది. కర్మయోగాన్ని గూర్చి వేదం సూక్ష్మంగా తెలియజేసింది. నిష్కామకర్మకే కర్మయోగమని పేరు. సంన్యాసులు కూడా కర్మలు చేయకుండా ఉండరు. ఐతే కర్మఫలాలు ఆశించకుండా సత్కర్మలాచరిస్తారు కనుక వారు సంన్యాసులయ్యారు. కర్మ సన్యాసం అనే మాటకు కర్మలను విడిపెట్టడమని అర్థం చెప్పుకోరాదు. కర్మలను చేస్తూ వాటి ఫలాలను విడిచిపెట్టడమని గ్రహించాలి.

ఏది సత్కర్మ?

వేదం ఏవి సత్కర్మలో, ఏవి పాపకర్మలో నిర్దేశించింది. యజ్ఞ యాగాదులు సత్కర్మలు. త్రికరణశుద్ధి గలిగి చేసే పనులన్నీ సత్కర్మలే, జపతపాదులూ సత్కర్మలే. అన్నింటిని మించి శ్రేయోరాజ్య సంపాదనకై చేసే పనులన్నీ సత్కర్మలే. ఉపనిషత్తులను అవలోకిస్తే కర్మలు అనేక రకాలుగా కనిపిస్తాయి. పురాకృత కర్మలు మనల్ని వెన్నంటి వస్తాయి. వీటినే ప్రారబ్ద కర్మలని, సంచితకర్మలని పిలుస్తారు. పూర్వ జన్మలో చేసిన కర్మలకు ఈ జన్మలో సుఖదుఃఖాలు అనుభవించాల్సి వస్తుంది. ఇట్టి కర్మలే ప్రారబ్ధకర్మలు. కొన్నిసార్లు ఈ జన్మలో అనుభవించలేకపోయినట్లైతే వాటిని వచ్చే జన్మలో అనుభవించవలసి వస్తుంది. వాటికే సంచిత కర్మలని పేరు. ఎన్ని కర్మలు చేసినా వాటిని యోగశక్తి ద్వారా అనుభవానికి రాకుండా చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇదే విషయం భగవద్గీతలో 'యోగాగ్ని దగ్ధకర్మాణాం' అని చెప్పబడింది.

ఈ కర్మ చేయాలా వద్దా అని నిశ్చయించేది బుద్ధి. బుద్ధిపూర్వకంగానూ, అనాలోచితంగానూ, ఏవిధంగాను కర్మలు చేసినా ఫలాలను అనుభవించక తప్పదు. బుద్ధిపూర్వకమైన ప్రయత్నంతో ధాన్యాన్ని పండించినట్లే కర్మలు చేయాలని ఉపనిషత్తులు ప్రబోధిస్తున్నాయి. వేదం జ్ఞానకర్మలను ప్రస్తావిస్తుంది. కర్మయోగం మృత్యువును జయించడానికి తోడ్పడుతుందని, జ్ఞానయోగం అమృతత్వ సిద్ధి (ముక్తి)కి ఉపయోగపడుతుందని వేదం చెప్పిన మాటలు విస్మరించరానివి.

'అవిద్యయామృత్యుం తీర్త్వా విద్యాయామృతమశ్నుతే ॥'

(యజుర్వేదం)

వేదం పరమ లక్ష్యం విశ్వ కల్యాణమే. విశ్వ జనులకు హితకారి వేదం. అందరిది వేదం. కొందరిది వాదం. అన్ని కాలాల్లో, అన్ని దేశాల వారికి, అన్ని వేళల ఉపయోగపడే ఉపదేశం కేవలం వేదం వల్ల మాత్రమే లభిస్తుంది. 'స్వస్తి పంథామనుచరీమ సూర్యాచంద్ర మసావివ' సూర్య చంద్రుల వలె మంచి మార్గంలో నడవాలి అని వేదం ఉపదేశిస్తుంది. సూర్యుడు స్వయం ప్రకాశకుడు. చంద్రుడు స్వయంగా ప్రకాశించకపోయినప్పటికీ లోకం కోసం సూర్యుని వెలుగును ఆశ్రయించి, తానూ వెలుగుతాడు. మనుష్య జీవనం కూడా ఇలాగే ఉండాలని నగమం నిర్దేశిస్తుంది. అందరూ వేదాల్ని చదవాలని, దానివల్ల శుభాన్ని పొందాలని వేదంలోనే ఉంది. 'యథేమాం వాచం కలాల్యాణమావదాని జనేభ్యః' వేదవాక్కు కల్యాణప్రదమైంది. అది అందరికోసం సృష్టిలాగానే రచింపబడింది.


– ఆచార్య మసన చెన్నప్ప
వేద పరిశోధకులు

గీతాంజలి



**భవకేళీ మదిరా మదంబున మహా పాపాత్ముడై వీడు న
న్ను వివేకింప డటంచు నన్ను నరకార్ణోరాశి పాలైన బ
ట్టవు, బాలుండొక చోట నాటతమితోడన్ నూత గూలంగ దం
డ్రి విచారింపక యుండునా? కటకటా! శ్రీ కాళహస్తీశ్వరా!**


శ్రీకాళహస్తీశ్వరా! జనన మరణ రూపమైన సంసారమనే ఆటలో పడి, కల్లు తాగినట్టుగా మత్తెక్కి అదే సుఖమనుకొని ఉన్నాడు ఈ నరుడు. అలాంటి మహా పాపియైనవాడు నన్ను (అంటే భగవంతుని) తెలుసుకోలేకపోతున్నాడు. అందుకోసం నరక సముద్రంలో మునిపోతుంటే కూడా అలాగే చూస్తూ ఊరుకుంటావా? ఆటల ధోరణిలో పడి పిల్లవాడు బావిలో పడినప్పుడు తండ్రి వాడి గురించి పట్టించుకోకుండా, రక్షించకుండా ఊరుకోగలడా? అదేవిధంగా నీవు నన్ను ఇలా నరకంలో పడేసి రక్షింపకుండా ఉండడం నీకు న్యాయము కాదు.



సువార్త

సాత్వికులు దేవుని గెలిచినవారు!

మానవుల అంతరంగంలో అనేక విషయాలపై అంతర్మథనం జరుగుతూ ఉంటుంది. నేనే గొప్ప, నాకు అన్నీ తెలుసు అన్న భావన మనలో అహంకారాన్ని పెంపొందిస్తుంది. దీనత్వం లేదా తగ్గింపు గుణం లేకపోవడం వల్లనే ఈ దుర్గుణాలు అలవడుతుంటాయి. తమకొరకు తాము జీవించే వారికి దీనత్వం అంటే అర్థం తెలియదు. కానీ, జ్ఞానంలో అత్యంత గొప్పది దీనత్వం అని దైవభక్తి గల వారు భావిస్తారు. దీనత్వం లేక సాత్వికం అనేది బలహీనత కాదు అది గొప్ప శక్తి అని బైబిల్ చెప్తుంది. సర్వశక్తిగల దేవుని బలమైన హస్తాలలో మనల్ని మనం తగ్గించుకోవడమే మన బలానికి కారణం. ఇతరుల నుండి గుర్తింపు పొందడానికి, వారి నుండి ప్రశంసలు అందుకోవడానికి కొందరు వినమ్రతను నటిస్తుంటారు. ఇది వారి గర్వానికి వేసుకొన్న ముసుగు మాత్రమే. నిజమైన దీనత్వం పాపపు వాంఛలను జయించడం. దీనత్వం గల హృదయం ఈ లోక ప్రశంసలను కోరదు. అహంకారంతో వ్యవహరించేవారు తమ గురించి తాము గొప్పగా చెప్పుకుంటూ ఇతరులను చులకన చేసి మాట్లాడుతుంటారు. ఇది సాధారణంగా రెండురకాలుగా ఉంటుంది. ఎదుటివారిని గూర్చి తీర్పు తీర్చే వైఖరి ఒకటైతే నిందలు మోపడం రెండోది. కాని దీనత్వం గలవాడు తనకన్నా ఇతరులను ప్రాముఖ్యమైనవారిగా గుర్తిస్తాడని బైబిల్ చెప్తుంది (ఫిలిప్పీ 2:3). ఇతరుల విజయాన్ని చూసి తాను ఆనందిస్తాడు (రోమా 12:3, 10). ఇతరులను హీనంగా చూడటం లేదా కించపరచడం అంటే దేవుని ప్రేమను ఉల్లంఘించడమే. మన హృదయాలు దీనత్వము గలవైతే ఇతరుల ఘనతను చూసి మనం ఆనందించాలి. గర్విష్టుడైన ఒక న్యాయవాది భక్తిపరుడైన తన సోదరునితో కలిసి వెళుతున్నాడు. న్యాయవాద వృత్తిని మానుకోమని తన సోదరుడు చెప్పినప్పుడు అతడు 'నీ దేవునికి నిజంగా నీపైన శ్రద్ధ ఉంటే నీవెందుకు ధనవంతుడివి కాలేదు? నన్ను చూడు! నాకు మంచి భవిష్యత్తు ఉంది. బ్యాంకు బ్యాలెన్స్ ఉంది, ఖచ్చితమైన ఆదాయం ఉంది, నేను మరింత ధనవంతుడినవుతాను, కావాల్సినంత విశ్రాంతి లభిస్తుంది. నువ్వు కూడా నాతో కలిసి పనిచేయి. నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది' అన్నాడు. అందుకు ఆ సోదరుడు 'నాకు ఉన్నదాంట్లో నేను సంతోషంగా ఉన్నాను. ఇక్కడి రైతులకు సహాయపడుతూ, వారి సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నాను. కీర్తి, సంపదలు నాకు వద్దు, డంబాలు పలుకలేను' అన్నాడు. ఆ పక్కనే ఉన్న గోధుమ చేనువైపు చూపిస్తూ 'ఖాళీ వెన్నులే నిఠారుగా నిలిచి ఉన్నాయి. అందులో గింజలు లేవన్న సంగతి గుర్తించు' అన్నాడు. 'అహంకారము వెంబడి అవమానము వచ్చును. వినయముగల వారి యొద్ద జ్ఞానమున్నది' అని బైబిల్ చెప్తుంది (సామెతలు 11:2).



ఖురాన్ మాట



ప్రవక్త చెప్పిన ఆరోగ్యం!

అల్లాహ్ అనుగ్రహించిన అసంఖ్యాక వరాల్లో ఆరోగ్యం గొప్ప మహదానుగ్రహం. ఆరోగ్యం లేకుండా ఎన్ని ఉన్నా ఏమీ లేనట్లే. ఆరోగ్యం ఉంటే అన్నీ ఉన్నట్లే. ఆరోగ్య పరిరక్షణ ఆరాధనతో సమానం. ఆరోగ్యం బాగుంటేనే ఆరాధనకు శరీరం సహకరిస్తుంది. ఆరోగ్య పరిరక్షణ పట్ల అలక్ష్యం వహించడమంటే దైవం ప్రసాదించిన అమూల్యమైన జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకోవడమే. దైవానికి కూడా సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది. నీతి నిజాయితీలు, బుద్ధి వివేకాలు, విశ్వాస చైతన్యాలు మానవ జీవితానికి ప్రాణం లాంటివి. బలహీనమైన, రోగగ్రస్థమైన శరీరంలో విశ్వాస స్ఫూర్తి కూడా బలహీనంగానే ఉంటుంది. చైతన్యం మందగిస్తుంది. ఆరాధనా స్ఫూర్తి కొరవడుతుంది. ఆరాధనకు అర్థం చేకూరాలంటే, దైవప్రసన్నతకు పాత్రులు కావాలంటే పరలోక సాఫల్యం ప్రాప్తం కావాలంటే ఆరోగ్య పరిరక్షణ పట్ల శ్రద్ధ వహించడం తప్పనిసరి. దైవ ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. ఆ దిశగా ప్రజల్ని ప్రోత్సహించేవారు. నిరాడంబరమైన, ప్రభావశీలమైన, ఆహ్లాదకరమైన జీవితం గడపడానికి ఇష్టపడేవారు శారీరక శక్తి సామర్థ్యాలను వృథా చేసేవారు కాదు. ఆరోగ్యానికి వ్యాయామం మంచి సాధనమని చెబుతూ ఈతకు మొదటి ప్రాధాన్యాన్నిచ్చేవారు. ఈత పరిపూర్ణ వ్యాయామమని ప్రవక్త మహనీయులు ప్రవచించారు. 'నమాజు' స్వతహాగా గొప్ప వ్యాయామం, ధ్యానం. అయితే దాన్ని వ్యాయామంగా కాకుండా దైవప్రసన్నత కోసం చెయ్యాలి. సంతోషం కోసం మాత్రమే ఈ విధిని నిర్వహిస్తే ఆరోగ్యం, ప్రశాంతత వాటంతట అవే లభిస్తాయి. ప్రాతఃకాల నమాజు తరువాత పచ్చని చెట్ల మధ్య విహరించడం మంచి అలవాటు. ప్రవక్త వారు ఫజర్ నమాజు అనంతరం విహరించడానికి ఇష్టపడేవారు. ప్రాతఃకాలపు నిర్మలమై, స్వచ్ఛమైన గాలి ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని ప్రవక్త మహనీయులు చెప్పారు. ప్రవక్త వారు ఆరోగ్య పరిరక్షణకు అనేక రకాల చికిత్సా విధానాలు, ఔషధాలను, దుఆలను సూచించడంతో పాటు రకరకాల వ్యాయామాలు, ఆహార నియమాలను కూడా సూచించారు. 'హదీసు' గ్రంథాల అధ్యయనం ద్వారా మనం అవన్నీ తెలుసుకోవచ్చు.



కవలలతో ప్రథమేశ్ తల్లి రాజశ్రీ (ఎడమ వైపు చివర), కుటుంబ సభ్యులు; (ఇన్‌సెట్)లో ప్రథమేశ్

చనిపోయిన యువకుడి వీర్యంతో కవలలు జననం

పుణె: చనిపోయిన ఓ యువకుడు ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చాడు. వినటానికి వింతగా ఉన్నా ఇది మహారాష్ట్రలో జరిగింది. సదరు యువకుడు జీవించి ఉన్నప్పుడు అతడి నుంచి సేకరించిన వీర్యం ద్వారా.. ఇద్దరు పిల్లలు (కవలలు) పుట్టారు. తమ కుమారుడి జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవటం కోసం ఆ యువకుడి తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలగలిసి ఇది సాధ్యమయ్యింది. ఉన్నత చదువుల కోసం మహారాష్ట్ర నుంచి జర్మనీకి వెళ్లిన 27 ఏళ్ల ప్రథమేశ్‌పాటిల్ 2013లో అనారోగ్యం పాలయ్యారు. ఆయన మెదడులో కణితి ఉందని పరీక్షల్లో వెల్లడయ్యింది. దానిని తొలిగించటానికి అక్కడి వైద్యులు కీమోథెరపీ చికిత్సను అందించారు. అయితే, చికిత్స కారణంగా ప్రథమేశ్ సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉండటంతో అతడి అనుమతితోనే వీర్యం శాంపిళ్లను తీసి భద్రపరిచారు. క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న క్రమంలోనే 2016లో ప్రథమేశ్ మరణించారు. అప్పటికీ ఆయనకు పెండ్లి కూడా కాలేదు. చదువుల్లో గొప్ప ప్రతిభను చూపి, మృత్యుముఖంలో కూడా ధైర్యం కోల్పోని తమ కుమారుడి వంటి మనవలుంటే బాగుండునని భావించిన అతడి తల్లిదండ్రులు.. పుణె-అహ్మద్‌నగర్ రోడ్డులో ఉన్న సహ్యాద్రి దవాఖాన వైద్యులతో చర్చించారు. జర్మనీలో భద్రపరిచిన ప్రథమేశ్ వీర్యాన్ని గతేడాది తీసుకొచ్చారు. ప్రథమేశ్ కుటుంబసభ్యుల లక్షణాలతో సరిపోయే ఒక మహిళ నుంచి వైద్యులు అండాలు సేకరించి, వాటితో నాలుగు పిండాలను రూపొందించారు. వీటిని తన గర్భంలో ఉంచుకోవటానికి ప్రథమేశ్ తల్లి రాజశ్రీ (49) ముందుకొచ్చినప్పటికీ, గర్భధారణకు ఆమె శరీరం అనుకూలించదని పరీక్షల్లో తేలింది. దీంతో రాజశ్రీ వరుస సోదరి ముందుకు రావటంతో ఆమె గర్భంలో రెండు పిండాలను మే నెలలో ప్రవేశపెట్టారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించారు. సోమవారం ఆమె ఆరోగ్యంగా ఉన్న ఇద్దరు మగ పిల్లలకు (కవలలకు) జన్మనిచ్చారు. దీంతో ప్రథమేశ్ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇలాంటి పద్ధతిన పిల్లల్ని కనడం ఇదే మొదటిసారి కాదని, ఇప్పటివరకు రెండు, మూడు జరిగాయని ఇండియన్ సరోగసీ లా సెంటర్ వ్యవస్థాపకుడు హరిరామసుబ్రమణియన్ చెప్పారు.



ప్రియ వారియర్ పాటకు కేరళ సీఎం బాసట

తిరువనంతపురం: 'ఒరు ఆడార్ లవ్' సినిమా పాటకు కేరళ సీఎం పినరాయి విజయన్ బాసటగా నిలిచారు. ఈ పాట వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని హైదరాబాద్‌లో కొందరు సినిమా దర్శకుడు ఒమర్‌లులూపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కళలో భావప్రకటన స్వేచ్ఛపై అసహనాన్ని ఆమోదించే ప్రసక్తే లేదని గురువారం సీఎం విజయన్ తన ఫేస్‌బుక్ ఖాతాలో పేర్కొన్నారు. ఈ పాటలో నటించిన మలయాళ నటి ప్రియా ప్రకాశ్ వారియర్.. తన కనుసైగలతో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మపిల్ల పట్టు అనే ముస్లిం సంప్రదాయ పాట ఆధారంగా పీఎంఏ జబ్బార్ రాసిన గేయాన్ని రఫీఖ్ పాడారని తెలిపారు. 1978లోనే ఆకాశవాణిలో ఈ పాట ప్రసారమైందని, ముస్లింల వివాహాల్లో ఈ పాటను దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నారని విజయన్ పేర్కొన్నారు. ఛాందసవాదం, మతతత్వంపై పోరాటానికి కళలు, సాహిత్యం ఆయుధాలని ఆయన తెలిపారు.

మహిళా ప్రాతినిధ్యమే లేని 'నాగా' అసెంబ్లీ!

కోహిమా: నాగాలాండ్ ఏర్పాటై 54 ఏండ్లు.. ఇప్పటికీ రాష్ట్ర అసెంబ్లీకి ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదు. 60 స్థానాల నాగాలాండ్ అసెంబ్లీకి ఈ నెల 27న పోలింగ్ జరుగనున్నది. మొత్తం 195 మంది అభ్యర్థుల్లో ఐదుగురే మహిళా అభ్యర్థులు. అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్) మహిళా అభ్యర్థులనే నిలుపలేదు. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) తరపున వెడియో యు క్రొను, మంగ్యాంగ్పు లా, బీజేపీ అభ్యర్థిగా రాఖిల్లా పోటీ చేస్తున్నారు. కొత్త పార్టీ ఎన్డీపీపీ నుంచి అవన్ కోయాంక్, స్వతంత్ర అభ్యర్థిగా రేఖారోజ్ దుక్రు పోటీ చేస్తున్నారు. రాఖిల్లా మినహా మిగతా నలుగురు మహిళా అభ్యర్థులు తొలిసారి పోటీ చేస్తున్నారు. 2006లో మరణించిన మాజీ ఎమ్మెల్యే లఖౌమొంగ్ భార్యే రాఖిల్లా. ఆమె క్రితం సారి 800 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ నెల ప్రారంభంలో మరణించిన మాజీ ఎమ్మెల్యే నియోవాంగ్ కొన్యాంక్



కూతురు ఎన్డీపీపీ అభ్యర్థి అవాన్ కోన్యాక్. వీరు కొన్ని వారాలుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. మహిళా అభ్యర్థులకు నాగాలాండ్ ఎన్నికల ప్రధానాధికారి అభిజిత్ సిన్హా స్వాగతం పలికారు. గత ఎన్నికలతో పోలిస్తే మహిళా అభ్యర్థుల సంఖ్య ఇద్దరి నుంచి ఐదుగురికి పెరిగిందన్నారు. 1977లో యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ తరపున రానో షైజా అనే మహిళా నేత తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అనారోగ్యంతో 2015లో ఆమె మృతి చెందారు.



బ్రిటన్‌ను మించిపోయాం

- రక్షణశాఖకు నిధుల కేటాయింపులో టాప్-5లోకి భారత్
- మొదటి స్థానంలో అమెరికా, రెండోస్థానంలో చైనా
- 2017లో భారత రక్షణ రంగ వ్యయం రూ.3.35 లక్షల కోట్లు
- చైనాకన్నా భారత్ సైనిక సామర్థ్యం తక్కువేనన్న బ్రిటన్ సంస్థ

మిలిటరీ బడ్జెట్ 2018

లండన్, ఫిబ్రవరి 15: రక్షణశాఖకు నిధులను వెచ్చించడంలో భారత్ మొదటిసారి బ్రిటన్‌ను అధిగమించింది. టాప్-5 దేశాల జాబితాలో చోటు దక్కించుకున్నది. అయితే పొరుగుదేశం చైనాతో పోల్చితే ఇప్పటికీ చాలా వెనుకబడి ఉన్నది. భారత్ క్రమంగా బడ్జెట్‌ను పెంచుతుండటం, మేకిన్ ఇండియా, రక్షణ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం వంటి సానుకూల అంశాలు సైనిక సామర్థ్యం పెంపునకు తోడ్పడుతున్నాయి. లండన్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్) 2017లో రక్షణశాఖకు అత్యధికంగా నిధులు వెచ్చించిన దేశాలపై ప్రపంచవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించి 'మిలిటరీ బడ్జెట్-2018' పేరుతో నివేదికను విడుదల చేసింది. ఈ జాబితాలో అమెరికా మొదటి స్థానంలో నిలువగా భారత్ మొదటిసారి బ్రిటన్‌ను అధిగమించి ఐదో స్థానంలో నిలిచింది. నివేదిక ప్రకారం భారత్ రక్షణశాఖకు 2016లో రూ.3.26 లక్షల కోట్లు (51.1 బిలియన్ డాలర్లు) వెచ్చించగా, 2017లో దానిని రూ.3.35 లక్షల కోట్లకు పెంచింది. ఇదే సమయంలో బ్రిటన్ తన కేటాయింపులను రూ.3.35 లక్షల కోట్ల(52.5 బిలియన్ డాలర్లు) నుంచి రూ.3.24 లక్షల కోట్లకు (50.7 బిలియన్ డాలర్లు) తగ్గించింది. దాయాదులను ధీటుగా ఎదుర్కోవడంతోపాటు ప్రాంతీయంగా తన సామర్థ్యాన్ని పెంచుకోవడంపై భారత్ దృష్టి సారించిందని, ఈ మేరకు వనరులను సమకూర్చుకుంటున్నదని నివేదిక వెల్లడించింది.

నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..

- రక్షణశాఖ కేటాయింపుల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండోస్థానంలో ఉన్నది.
- 2017లో అమెరికా రక్షణశాఖ బడ్జెట్ రూ.9.62 లక్షల కోట్లు (150.5 బిలియన్ డాలర్లు). ఇది భారత్ బడ్జెట్ కన్నా మూడురెట్లు ఎక్కువ. చైనా సైతం దాదాపు 150 బిలియన్ డాలర్ల బడ్జెట్‌ను కేటాయించింది.
- ఈ జాబితాలో రూ.4.9 లక్షల కోట్లతో (76.7 బిలియన్ డాలర్లు) సౌదీ అరేబియా మూడో స్థానంలో నిలువగా, రష్యా రూ.3.91 లక్షల కోట్లతో (61.2 బిలియన్ డాలర్లు) నాలుగో స్థానంలో నిలిచింది.
- 2016తో పోల్చితే 2017 నాటికి రక్షణశాఖ కేటాయింపులను చైనా దాదాపు 25 శాతం పెంచితే భారత్ కేవలం 2.4 శాతం మాత్రమే పెంచింది.
- 2000 సంవత్సరం నుంచి చైనా భారీగా సబ్‌మెరైన్లు, విధ్వంసక నౌకలను, ఫైటర్ జెట్లను ఇతర అత్యాధునిక ఆయుధాలను తయారు చేసుకుంటున్నది. భారత్, జపాన్, దక్షిణ కొరియా సైనిక సామర్థ్యాన్ని కలిపినా చైనా కంటే తక్కువే.
- చైనా ఆర్మీలో భారత్ కన్నా ఆరు లక్షల మంది సైనికులు ఎక్కువగా ఉన్నారు.
- మేకిన్ ఇండియా పాలసీ, రక్షణరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం వంటి చర్యలు భారత సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవడంలో కలిసొస్తుందని సర్వే వెల్లడించింది.
- భారత సైన్యాన్ని మందుగుండు, విడిభాగాల కొరత తీవ్రంగా వేధిస్తున్నది.
- అమెరికాతో సైనిక సహకారాన్ని పెంపొందించుకోవడం ద్వారా భారత్ బలపడే అవకాశాలు ఉన్నాయి.

భారత్, అమెరికా కోసమే మాపై చర్యలు

- పాక్ ప్రభుత్వంపై మండిపడ్డ హాఫీజ్ సయీద్
- న్యాయస్థానంలో తేల్చుకుంటానని వెల్లడి



లాహోర్: కేవలం అమెరికా, భారత్ కోసమే పాకిస్థాన్ ప్రభుత్వం తమపై చర్యలు తీసుకుంటున్నదని ముంబై పేలుళ్ల సూత్రధారి, ఉగ్రవాద సంస్థ జమాత్ ఉద్ దవా (జేయూడీ) అధిపతి హఫీజ్ సయీద్ ఆరోపించాడు. చట్ట విరుద్ధంగా తీసుకుంటున్న చర్యలపై న్యాయస్థానంలో తేల్చుకుంటానని స్పష్టంచేశారు. హఫీజ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన పాక్ ప్రభుత్వం.. అక్కడ అతడి స్థిరచరాస్తులను, బడులు, నాలుగు వైద్యశాలల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. 'చట్టపరమైన ఆధారాలు లేకపోవడం వల్లే నన్ను పదినెలల నిర్బంధం తర్వాత వదిలిపెట్టారు. ఇప్పుడు మా ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నది. పంజాబ్, బలూచిస్థాన్, సింధ్, ఆజాద్ కశ్మీర్ తదితర ప్రాంతాల్లో మేము అందిస్తున్న సహాయ సహకారాలకు ఆటంకం కలిగిస్తున్నది' అని సయీద్ చెప్పారు.

25 రోజుల పోలీస్ కస్టడీకి ఉగ్రవాది అరీజ్‌ఖాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది అరీజ్‌ఖాన్ అలియాస్ జునైద్ (32)ను 25 రోజుల పోలీస్ కస్టడీకి ఢిల్లీ అడిషనల్ సెషన్స్ జడ్జి సిద్ధార్థ శర్మ అనుమతించారు. 2008లో బాట్లాహౌస్ ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న అరీజ్‌ఖాన్.. ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, ఢిల్లీలో బాంబు పేలుళ్లకు పాల్పడ్డాడు. ఈ దాడుల్లో 165 మంది చనిపోగా, 535 మంది గాయపడ్డారు. అతనిపై ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు కూడా జారీచేసినట్టు పోలీసులు వివరించారు. ఈ నెల 13న నేపాల్ సరిహద్దు బాన్‌వాసలో అరీజ్‌ఖాన్‌ను అరెస్ట్‌చేసిన ఢిల్లీ ప్రత్యేక పోలీసులు బుధవారం సాయంత్రం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి కస్టడీకి అనుమతించారు. అతని సహచరుడు తౌఖీర్‌ను కూడా ఈ ఏడాది జనవరిలో అరెస్ట్ చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

వాయుసేన హెలికాప్టర్ కూలి.. ఇద్దరు పైలట్ల మృతి

గౌహతి: భారత వాయుసేనకు చెందిన ఓ తేలికపాటి హెలికాప్టర్ కూలిన సంఘటనలో ఇద్దరు పైలట్లు మృతి చెందారు. ఈ సంఘటన గురువారం అస్సాం రాష్ట్రంలోని మాజులీ జిల్లాలో చోటుచేసుకున్నది. ఈ హెలికాప్టర్ జొర్హాత్ జిల్లాలోని రోరియా ఎయిర్‌పోర్టునుంచి ఇద్దరు పైలట్‌లతో అరుణాచల్‌ప్రదేశ్‌కు బయలుదేరింది. మాజులీ జిల్లాలోని బ్రహ్మపుత్ర నదీ పరివాహక ప్రాంతంలోని ఇసుకద్వీపంలో కూలిపోయింది. సాంకేతిక కారణాల వల్లే హెలికాప్టర్ కూలినట్టు భారతవాయుసేన అధికారులు తెలిపారు.

ఉగ్రవాద సంస్థల్లో ఉన్న ముస్లింలనూ లెక్కించండి

అసదుద్దీన్‌పై సుబ్రమణ్యస్వామి ఎదురుదాడి

న్యూఢిల్లీ: సుంజ్వాన్ ఉగ్ర దాడిలో ఐదుగురు ముస్లిం సైనికులు చనిపోయారంటూ ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ఎదురుదాడి చేశారు. ''సుంజ్వాన్ దాడిలో మృతిచెందిన ముస్లిం సైనికులను ఓవైసీ లెక్కిస్తున్నారు, కానీ ఉగ్రవాద సంస్థల్లో ఉన్న ముస్లింలను కూడా ఆయన లెక్కించాలి' అని తన ట్వీట్‌లో సుబ్రమణ్యస్వామి సూచించారు.

తీవ్రవాదుల శిక్షణ కేంద్రంగా తమిళనాడు!

కేంద్రమంత్రి పొన్ రాధాకృష్ణన్ వివాదాస్పద వ్యాఖ్య



కోయంబత్తూర్: తమిళనాడు ఇంకెంతో కాలం శాంతియుతంగా ఉండలేదని, రాష్ట్రం తీవ్రవాదులకు శిక్షణ కేంద్రంగా మారుతున్నదని కేంద్రమంత్రి పొన్ రాధాకృష్ణన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1998 ఫిబ్రవరి 14న జరిగిన వరుస బాంబు పేలుళ్ల ఘటనలో మృతులకు నివాళులర్పించేందుకు వివిధ హిందూసంస్థలు, బీజేపీ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'తమిళనాడు ఎంతోకాలం శాంతియుత రాష్ట్రంగా ఉండలేదు. ఇక్కడి పరిపాలనకు వ్యతిరేకంగా నక్సలైట్లు, తమిళ అతివాదులు, ఇస్లామిక్ ఉగ్రవాదులు అందరూ చేతులు కలిపారు. గత ఏడాది జల్లికట్టు కోసం జరిగిన ఆందోళనలే ఇందుకు నిదర్శనం' అని రాధాకృష్ణన్ చెప్పారు. ఈ దళాలు వచ్చే 10 నుంచి 20 ఏండ్ల సుదీర్ఘ ప్రణాళికతో ముందుకెళ్తున్నాయని, ఈ విషయం ప్రభుత్వం, పోలీసుశాఖకు తెలిసిందా లేదా అనేది తనకు తెలియదని పేర్కొన్నారు. 1998 నాటి మృతుల స్మారక చిహ్నం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అనుమతించలేదన్నారు.

రేప్ పరిహారం ఆరువేలేనా!

మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై మండిపడిన సుప్రీంకోర్టు ■ నిర్భయ నిధుల వినియోగంపై అఫిడవిట్ దాఖలు చేసిన ఏకైక రాష్ట్రం సిక్కిం

రాష్ట్రాల అలసత్వంపై ధర్మాసనం అసహనం ■ నాలుగు వారాల్లోగా అఫిడవిట్లు సమర్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:



ఒక లైంగికదాడి ఖరీదు రూ.6 వేలా? ఇంత స్వల్ప మొత్తం అందజేసి అత్యాచార బాధితులపై ప్రభుత్వం దయచూపుతున్నదా? అని మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం విడుదల చేసిన నిర్భయ నిధుల నుంచి పెద్ద మొత్తంలో మధ్యప్రదేశ్‌కు అందినా బాధితులకు తక్కువ మొత్తం అందించడం దిగ్భ్రాంతిని కలిగిస్తున్నదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. 2012 డిసెంబర్ 16 నాటి నిర్భయ ఘటన తర్వాత లైంగికదాడుల బాధితులను ఆదుకునేందుకు కేంద్రం నిర్భయ పథకాన్ని తెచ్చింది. 'మధ్యప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం, ఒక్కో అత్యాచార బాధితురాలికి సగటున రూ.6వేల ఆర్థిక సాయం అందుతున్నది. మీరేమన్నా వారికి దానమిస్తున్నారా? రూ.6వేలతో వెలకట్టడమేమిటి?' అని సుప్రీంకోర్టు మండిపడింది. 'మధ్యప్రదేశ్‌లో 1,951 మంది బాధితులున్నారు. వారికి మీరు రూ.6 వేల నుంచి రూ.6,500 ఇస్తున్నారు. ఇదేమన్నా సబబా?' అని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడా ధర్మాసనం ప్రశ్నించింది.

హర్యానా ప్రభుత్వానికి చివాట్లు

లైంగికదాడుల బాధితులకు నిర్భయ పథకం కింద అందజేసిన సాయం వివరాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించినా పట్టించుకోని హర్యానా ప్రభుత్వానికి సుప్రీంకోర్టు చివాట్లు పెట్టింది. నిర్భయ మూలధన పథకం కింద కేంద్రం నుంచి అందిన మొత్తమెంత? బాధితులెంతమంది? ఎంతమందికి నిర్భయ పథకం కింద సాయం అందించారు? వివరాలను తెలపాలని గత నెలలోనే సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. 24రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇంకా అఫిడవిట్ సమర్పించాలి. త్వరలో అఫిడవిట్ దాఖలు చేస్తామని హర్యానా ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనానికి విన్నవించగా, అఫిడవిట్ సమర్పించకపోడంలోనే మహిళల రక్షణ పట్ల మీ ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తున్నదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇంకా అఫిడవిట్ దాఖలు చేయని రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం 'అఫిడవిట్ సమర్పించేందుకు మీ ఇష్టమున్నంత సమయం తీసుకోండి. మిమ్మల్ని కాపాడే బాధ్యత కూడా తీసుకోలేమని మీమీ రాష్ట్రాల్లోని మహిళలకు చెప్పండి' అని ధర్మాసనం ఆగ్రహించింది. సిక్కిం తరపునే ఒక అఫిడవిట్ దాఖలైంది. 48 మంది బాధితులకు రూ.30.55 లక్షలు అందించామని మరో రాష్ట్రం మేఘాలయ సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఇప్పటికైనా అన్ని రాష్ట్రాలు స్పందిస్తే బాగుంటుందన్న సుప్రీంకోర్టు, నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. నిర్భయ పథకం కింద అత్యాచార బాధితులకు సాయం అందించడంలో రాష్ట్రాల సహకారం సరిగా లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంతకుముందు కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. నిర్భయ ఘటన తర్వాత ఇంతవరకు సుప్రీంకోర్టులో ఆరు పిటిషన్లు దాఖలయ్యాయి.

దోచుకోండి!.. పారిపోండి!!

- ఇది కేంద్రప్రభుత్వ విధానం
- నీరవ్ మోదీని ఎవరు కాపాడుతున్నారు
- కేంద్రప్రభుత్వాన్ని నిలదీసిన కాంగ్రెస్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) శాఖలో రూ.11,400 కోట్ల కుంభకోణం జరుగడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కుంభకోణాన్ని నిలువరించడంలో కేంద్రం విఫలమైందని విమర్శించింది. 'దోచుకోండి.. పారిపోండి అన్నట్లు కేంద్రం విధానం ఉంది. స్వాతంత్ర్యం వచ్చాక బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంతపెద్ద కుంభకోణం జరుగడం దురదృష్టకరం. నీరవ్ కుట్రలపై పీఎంవోకు 2016లోనే సమాచారం ఉంది. అయినా ఆయన కుట్రలను, మోసాలను నిరోధించడంలో పీఎంవో విఫలమైంది' అని కాంగ్రెస్ విమర్శించింది. పలువురు వ్యాపారవేత్తల విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నది. మద్యం వ్యాపారి విజయ్ మాల్యా, ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోదీ ఇలా పలువురు దేశంలో మోసాలకు పాల్పడి విదేశాలకు పారిపోయారని గుర్తుచేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్వీట్ చేస్తూ 'మోసానికి పాల్పడిన నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోడానికి ప్రభుత్వం సహకరించింది. గత నెలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లిన ప్రధాని మోదీ ప్రతినిధి బృందంలో నీరవ్ మోదీ ఉన్నారు. అవినీతి పరుడితో ప్రధాని వేదికను పంచుకోవడం దురదృష్టకరం. ప్రభుత్వ విధానం ''దోచుకోండి.. పారిపోండి'' అన్నట్లు ఉన్నది' అని అన్నారు. కాంగ్రెస్ మీడియా ఇంచార్జి రణ్‌దీప్ సూర్జేవాలా మాట్లాడుతూ నీరవ్ మోదీ జనవరి 1న దేశం విడిచి పారిపోక ముందే అతడిపై సీబీఐకి పీఎన్బీ ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఒక వ్యక్తిపై ఫిర్యాదు ఉన్నప్పుడు దేశం విడిచి పారిపోవడం ఎలా సాధ్యమో ప్రభుత్వం చెప్పాలన్నారు. నీరవ్ మోదీని ఎవరు కాపాడుతున్నారో జవాబు చెప్పాలన్నారు.'నీరవ్ మోదీ రెండో చోటా మోదీ.. లలిత్ మోదీ మొదటి చోటా మోదీ' అని ఎద్దేవా చేశారు.

ఎవ్వరినీ వదిలిపెట్టం

- కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందన

న్యూఢిల్లీ: పీఎన్‌బీ కుంభకోణంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేంద్రం స్పందించింది. కుంభకోణానికి పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని తెలిపింది. కుంభకోణాన్ని వీలైనంత త్వరగా ఛేదిస్తామని, దర్యాప్తు వేగంగా జరుగుతుందని గురువారం కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ మీడియాతో అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను కుప్పకూల్చాలని ప్రయత్నించినా, కుంభకోణాలకు పాల్పడినా ఎవ్వరినీ వదిలిపెట్టేదిలేదని చెప్పారు. గత నెలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లిన ప్రధాని మోదీ బృందంలో వ్యాపారి నీరవ్ మోదీ లేరన్నారు.

ఆర్థిక ఉగ్రవాదిని దేశం నుంచి తప్పించిన మోదీ సర్కార్

గత ఎన్డీయే ప్రభుత్వం ముగ్గురు భయంకరమైన ఉగ్రవాదులను భారత్‌లోకి తెచ్చింది. ప్రస్తుత బీజేపీ సర్కార్ ఆర్థిక ఉగ్రవాదిని, మోసగాన్ని సురక్షితంగా దేశం దాటించింది.

-ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

నీరవ్‌మోదీని తప్పించడంలో బీజేపీ భాగస్వామి

బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్టు ఉండకపోతే నీరవ్‌మోదీ, విజయ్ మాల్యా దేశం వదలి పారిపోవడం సాధ్యమవుతుందా?

- ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

దావోస్‌లో ప్రధానితో కలిసి ఫొటోలు దిగాడు..

దావోస్‌లో ప్రధానితో నీరవ్ మోదీ ఫొటోలు దిగక ముందే దేశం నుంచి పారిపోయాడా? మోదీ ప్రభుత్వం స్పష్టంచేయాలి.

-సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

జేకబ్ జుమా రాజీనామా

- దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా సిరిల్ రమాఫోసా ఏకగ్రీవ ఎన్నిక



సిరిల్ రమాఫోసా

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా దేశాధ్యక్ష పదవికి జేకబ్ జుమా రాజీనామా చేశారు. తదుపరి అధ్యక్షుడిగా సిరిల్ రమాఫోసా ఎన్నికయ్యారు. సిరిల్ ఎన్నికకు దక్షిణాఫ్రికా జాతీయ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. రెండు నెలల క్రితం అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ అధ్యక్షుడిగా సైరిల్ రమాఫోసా బాధ్యతలు చేపట్టారు. అవినీతి ఆరోపణలతో జేకబ్ జుమా ను అధ్యక్ష పదవి నుంచి దిగిపోవాలని మూడు రోజుల క్రితం కోరిన ఏఎన్‌సీ.. తప్పుకోకుంటే అవిశ్వాస తీర్మానం తెస్తామని హెచ్చరించడంతో రాజీనామా సమర్పించారు. 1958లో ఏఎన్‌సీలో చేరిన జుమా, 2007లో పార్టీ అధ్యక్షుడయ్యారు. 2009లో ఏఎన్‌సీని మెజార్టీతో గెలిపించి దేశాధ్యక్షుడిగా జుమా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 2014 ఎన్నికల్లోనూ గెలిపించారు. 2019లో ఆయన పదవీకాలం ముగియాలి. జేకబ్ 2009 నుంచి తొమ్మిదేండ్లు పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు.

నేపాల్ ప్రధానిగా కేపీ ఓలి

- రెండోసారి అత్యున్నత పదవికి ఎన్నిక



కఠ్మాండు: కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్-మార్క్సిస్ట్ లెనినిస్ట్ కూటమి (సీపీఎన్-యూఎంఎల్) చైర్‌పర్సన్ కేపీ శర్మ ఓలి గురువారం నేపాల్ ప్రధానిగా రెండోసారి ఎన్నికయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో సీపీఎన్ సెంటర్ మావోయిస్టు పార్టీతో కలిసి ఓలి నేతృత్వంలో లెఫ్ట్ కూటమి అధిక స్థానాలను గెలుచుకున్నది. 65 ఏండ్ల ఓలిని దేశ 41వ ప్రధానిగా అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ నియమించారు. ఇంతకుముందు నేపాల్ ప్రధానిగా ఓలి 2015 అక్టోబర్ 11 నుంచి 2016 ఆగస్టు 3 వరకు సేవలందించారు. నేపాల్ రాజ్యాంగంలోని 76వ ఆర్టికల్ ప్రకారం ఓలి ఎన్నిక జరిగింది. సభలోని పార్టీలకు స్పష్టమైన మెజారిటీ రాకుంటే రెండు అంతకంటే ఎక్కువ పార్టీల మద్దతు ఉన్న సభ్యుడిని ప్రధాని ఈ ఆర్టికల్ ప్రకారం ఎన్నుకుంటారు. ఓలికి ప్రధాని అభ్యర్థిగా యూ సీపీఎన్-మావోయిస్టు, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ నేపాల్, మాదేశీ రైట్స్ ఫోరం-డెమొక్రటిక్‌తోపాటు మరో 13 చిన్న పార్టీలు మద్దతు తెలిపాయి.

అమెరికా పాఠశాలలో నరమేధం



కాల్పుల్లో గాయపడిన విద్యార్థిని దవాఖానకు తరలిస్తున్న పోలీసులు



నిందితుడు నికోలస్ క్రజ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మూడోపేజీ తరువాయి...

విద్యార్థులు తిరిగి క్లాసుల్లోకి పరిగెత్తారు. ఈ కాల్పుల్లో 12మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు తర్వాత మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 17కు చేరింది. కాల్పుల్లో 15మంది వరకు గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. భారతీయ అమెరికన్ల పిల్లలు ఎక్కువమంది ఈ పాఠశాలలోనే చదువుతున్నారు. అయితే 9వ తరగతి చదువుతున్న ఇండో-అమెరికన్ విద్యార్థికి మాత్రం స్వల్పగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల అనంతరం స్కూల్లోనే దుండగుడిని పోలీసులు బంధించారు. స్వల్పగాయాలైన నిందితుడికి దవాఖానలో చికిత్స నిర్వహించారు. అనంతరం బ్రోవర్డ్‌కౌంటీ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అతడిని తరలించారు.

సస్పెండ్ చేశారన్న కసితోనే..

డగ్లస్ స్కూల్లో కాల్పులకు పాల్పడిన టీనేజర్‌ను అదే పాఠశాల విద్యార్థి నికోలస్ క్రజ్ (19)గా గుర్తించారు. స్కూల్ యాజమాన్యం తనను సస్పెండ్ చేసిందన్న కోపంతోనే నికోలస్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. 'ఇది పార్క్‌లాండ్‌కు భయంకరమైన రోజు కానుంది' అని నికోలస్ కాల్పుల ఘటనకు ముందు సోషల్ మీడియాలో పేర్కొన్నాడని బ్రోవర్డ్‌కౌంటీ పోలీస్ అధికారి స్కాట్ ఇజ్రాయెల్ చెప్పారు. 'నిందితుడి వద్ద ఏఆర్-15 రైఫిల్‌తోపాటు లెక్కకుమించిన ఆయుధాలున్నాయి. భారీగా తుపాకీ మ్యాగజైన్స్ (బుల్లెట్లు) లభ్యమయ్యాయి. గ్యాస్ మాస్కు, పొగ బాంబులనూ వెంట తెచ్చుకున్నాడు' అని స్కాట్ వెల్లడించారు. నిందితుడి నేపథ్యం గురించి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఎక్కువమందిని హతమార్చేందుకే నికోలస్ సిద్ధమై వచ్చాడని, ఫైర్ అలారంను కూడా అందుకే మోగించాడని పోలీసులు తెలిపారు. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతాపం తెలిపారు. ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్‌కు ఫోన్‌చేసిన ట్రంప్.. సహాయ కార్యక్రమాల గురించి మాట్లాడారు.

భీతిల్లిన విద్యార్థులు

కాల్పుల ఘటనకు సంబంధించి సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు.. విద్యార్థులు భీతిల్లిపోయిన స్థితిని కళ్లకు కట్టాయి. కాల్పులు జరుగుతుండగా, తరగతి గదిలో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ కూర్చున్న వీడియోను ఓ విద్యార్థి తన సోదరికి పంపగా ఆమె ట్విట్టర్‌లో పోస్టు చేసింది. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు తుపాకులతో క్లాస్‌రూంలోకి రావడంతో విద్యార్థులంతా భయంతో చేతులు పైకెత్తడం ఈ వీడియోలో కనిపిస్తున్నది. 'మేమంతా వణికిపోయాం. టీచర్ క్లాసురూంలోకి మమ్మల్ని తీసుకొచ్చి తలుపులు, కిటికీలు మూసేశారు. లైట్లు కూడా ఆఫ్ చేశారు. పోలీసులు వచ్చే వరకు మేం బల్లలమధ్యే నక్కి ఉన్నాం' అని మాక్స్ చార్లెస్ అనే విద్యార్థి వెల్లడించాడు.

అమెరికా చరిత్రలో ఎనిమిదోసారి..

అమెరికా చరిత్రలో ఒక పాఠశాలలో నరమేధం జరుగడం ఇది ఎనిమిదోసారి అని మదర్‌జోన్స్ క్రైమ్‌డేటా వెల్లడిస్తున్నది. 1982 నుంచి జరిగిన నరమేధాలను రికార్డు చేసిన ఆ సంస్థ పాఠశాలల్లో ఇలా కాల్పులు జరిగిన ప్రతీసారి కనీసం నలుగురు వ్యక్తులు మృతిచెందినట్లు తెలిపింది. 2012లో కనెక్టికట్‌లోని శాండీహుక్ పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటన తర్వాత ఫ్లోరిడా ఘటన అత్యంత పాశవికమైన ఘటన.

సహచరులతో ఘర్షణ.. తుపాకులంటే మోజు

19 ఏండ్లు అంటే పుస్తకాలతో కుస్తీ పడుతూనే.. ప్రపంచజ్ఞానం అందిపుచ్చుకునే వయసు. స్నేహితులు, సరదాలతో హాయిగా సాగే ప్రాయం.. కానీ నికోలస్ క్రజ్ అందుకు భిన్నం. పుస్తకాలకన్నా తుపాకులపై మోజు పెంచుకున్నాడు. తోటి విద్యార్థులనే దారుణంగా హతమార్చాడు. ఫ్లోరిడా భీకర కాల్పుల వెనుక ఉన్నది అదే పాఠశాల విద్యార్థి అని తెలియగానే ప్రపంచం నివ్వెరపోయింది. 'మిమ్మల్ని కాల్చేస్తా..' అంటూ తోటి విద్యార్థులను నికోలస్ బెదిరించేవాడట. తనకు తానే స్కూల్ గోడలకు చేతుల్ని బలంగా కొట్టుకునేవాడట. తన మాజీ గర్ల్‌ఫ్రెండ్‌తో చనువుగా తిరుగుతున్న ఓ విద్యార్థిని నికోలస్ తీవ్రంగా చితకబాదాడు. అతడి ప్రవర్తనతో మిగతా విద్యార్థులకు ప్రమాదం ఉందని భావించిన యాజమాన్యం గత ఏడాదే అతడిని స్కూల్ నుంచి పంపించేసింది. నికోలస్ ప్రవర్తన చాలా వింతగా ఉండేదని అతడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను చూస్తే అర్థమవుతున్నది. తుపాకీతో దిగిన ఫొటోలు, చంపేసిన బల్లులు, కప్పల ఫొటోలను సోషల్‌మీడియాలో పెట్టి ఆనందించేవాడు. తన మానసిక స్థితికితోడు ఇటీవల సోదరి మరణం నికోలస్‌లో సమాజంపై ద్వేషభావాన్ని పెంచి ఉంటుందని తెలిసినవారు చెబుతున్నారు.

ఆ దొంగలు నా మనవిని పట్టించుకోలేదు!



మోహన్‌బాబు, మదన్

'ఒక విషయంలో నిర్మాతగా నా హృదయం రోదిస్తున్నది. నేను నటించిన 'గాయత్రి' సినిమా విడుదలైన వెంటనే పైరసీకి గురికావడం నన్ను బాధించింది. నిర్మాతల కష్టసుఖాల గురించి ప్రేక్షకులకు బాగా తెలుసు. నాలా మదనపడుతున్న వాళ్లు చిత్ర పరిశ్రమలో చాలా మంది వున్నారు' అని తెలిపారు మోహన్‌బాబు. ఆయన కథానాయకుడిగా నటించి నిర్మించిన తాజా చిత్రం 'గాయత్రి'. విష్ణు కీలక పాత్రలో నటించారు. మదన్ రామిగాని దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం గురువారం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్‌ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ ' గుడికి వెళ్లే వాళ్లు మేము బాగుండాలి. మాతో పాటు మా పక్కవాళ్లు కూడా బాగుండాలని కోరుకుంటారు. రాక్షసులకు కూడా దేవుడు వరాలిస్తుంటాడు. తొమ్మిది మాసాలు కష్టపడి ఎన్నో దెబ్బలకోర్చి సినిమా చేశాను. నా వయసుకు మించి ఇందులో చేయకూడని పోరాటాలు చేశాను. భగవంతుడు చల్లగా చూడటం వల్లే ఈ రోజు ఈ స్థాయిలో వున్నాను. సక్సెస్‌లు రావచ్చు. రాకపోవచ్చు. అయితే ఈ సినిమా విషయంలో పైరసీ చేయకండని దొంగలకు మొరపెట్టుకున్నాను. అయినా ఆ దొంగలు నా మనవిని పట్టించుకోలేదు. పైరసీని ప్రోత్సహించవొద్దని నేటి తరానికి విన్నవించుకుంటున్నాను. సినిమా చూసిన వాళ్లు విష్ణు నటనను మెచ్చుకుంటున్నారు. ఇందులో విష్ణు ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే నా పాత్రలో నటించి దర్శకుడిని, నన్ను మెప్పించాడు. ఈ సినిమాతో విష్ణుకు మంచి పేరురావడం ఆనందాన్ని కలిగించింది' అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు మదన్, రాజా రవీంద్ర, డైమండ్ రత్నబాబు, పృథ్వీ, గీతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు జీవితాన్ని ఆస్వాదిస్తున్నా!


సందీప్‌కిషన్

'నా గత చిత్రాలు కొన్నింటిలో వినోదం మిస్ అయింది. అందుకే విజయాలు దక్కలేదు. ఇకనుంచి మెజారిటీ ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకొని కథాంశాల్ని ఎంచుకుంటాను. ప్రతి సినిమాలో నాశైలి వినోదం, కొత్తదనం వుండేలా చూసుకుంటాను' అన్నారు సందీప్‌కిషన్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'మనసుకు నచ్చింది'. మంజుల దర్శకురాలు. నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సందీప్‌కిషన్ పాత్రికేయులతో ముచ్చటించారు.

ఆధునికి భావాలు కలిగిన సూరజ్ అనే యువకుడి కథ ఇది. అనుభూతిప్రధానంగా కథాగమనం ఉంటుంది. ప్రేమికుల పరిచయం, ఎడబాటు, పునరైక్యం వంటి హృదయాల్ని స్పృశించే అంశాలతో సాగుతుంది. ప్రతి సన్నివేశం సహజంగా ఉంటుంది. సంభాషణలు కూడా రియలిస్టిక్‌గా అనిపిస్తాయి. ఇప్పటివరకు నేను పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రాన్ని చేయలేదు. అందుకే కథ వినగానే సినిమాకు ఓకే చెప్పాను. 'మనసుకు నచ్చింది' ప్రతి ఒక్కరి మనసుకు నచ్చుతుంది. చక్కటి వినోదం, హృదయాల్ని హత్తుకునే ఉద్వేగాలతో మెప్పిస్తుంది. నటుడిగా నన్ను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమవుతుంది. వినోదం మిస్ కావడం వల్ల ఈ మధ్యకాలంలో విజయాలకు దూరమయ్యాను. 'మనసుకు నచ్చింది' ఆ లోటును తీర్చుతుంది.

ప్రకృతిని ఆస్వాదించాలి...

ప్రకృతితో మమేకం కావడం వల్ల జీవితాన్ని ఎలా ఆస్వాదించొచ్చనే చక్కటి అంశాన్ని ఆ సినిమాలో చర్చించాం. అందమైన సూర్యోదయాన్ని చూస్తే మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. నేనుండే అపార్ట్‌మెంట్ దగ్గరలో దుర్గం చెరువు ఉంది. బాల్కనీ నుంచి చూస్తే చెరువు మొత్తం కనిపిస్తుంది. కానీ నేనెప్పుడు ఆ సరస్సుమీద సూర్యోదయాన్ని చూడలేదు. మంజులగారు చెప్పిన తర్వాత ఓ రోజు చూశాను. ఎంతో అందంగా అనిపించింది. మనసుకు ప్రశాంతత కలిగింది. గత మూడునెలలుగా వృత్తి వ్యవహారాలకు దూరంగా ఇప్పుడు ప్రతిరోజు జీవితాన్ని ఆస్వాదించే పనిలో ఉన్నాను. చిన్న చిన్న ఆనందాల్ని అనుభవిస్తూ జీవితంలోని అసలైన మాధుర్యం ఏమిటో తెలుసుకుంటున్నాను. మహేష్‌బాబుగారు ఈ సినిమాలోని కొన్ని భాగాల్ని చూసి బాగుందని మెచ్చుకున్నారు. ఈ రోజు కుటుంబ సభ్యులందరితో కలిసి సినిమా చూస్తానని చెప్పారు.

తదుపరి చిత్రాలు..

నందిని పులి దర్శకత్వం వహించే ఓ సినిమాకు ఓకే చేశాను. ప్రేమకథా చిత్రమది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాను. తమిళంలో అరవింద్‌స్వామితో కలిసి చేసిన 'నరగాసురన్' విడుదలకు సిద్ధంగా ఉంది.

అందరూ వెళుతున్న దారికి భిన్నంగా వెళ్లాలనుకున్నప్పుడు చాలా మంది భయపెడుతుంటారు. మన మంచి కోరేవారు వద్దని వారిస్తుంటారు. అలాంటి వాటికి భయపడి కొత్త అడుగు వేయడానికి ఆలోచిస్తే ముందుకు వెళ్లలేం సరికదా ఏ మార్పును తీసుకురాలేం' అన్నారు నాని. హీరోగా వరుస సక్సెస్‌లతో దూసుకుపోతున్న ఆయన నిర్మాతగా మారి రెగ్యులర్ పంథాకు భిన్నంగా నిర్మించిన చిత్రం 'అ!'. ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా నాని గురువారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

'అ!' అవసరమే అనిపించింది!


నాని

నిర్మాతగా 'అ!' సినిమా ఓ పరీక్ష అనుకుంటున్నారా?

• మాకు ప్రతీది పరీక్షే. రాత్రి కొంత మంది మిత్రులకు సినిమా చూపించాను. 'అష్టాచమ్మా' అదే ల్యాబ్‌లో అదే స్క్రీన్‌మీద నిలబడి చూశాను. అప్పుడు ఎలాంటి ఒత్తిడికి లోనయ్యానో 'అ!' విడుదల విషయంలోనూ అదే ఒత్తిడికి లోనవుతున్నాను.

సినిమా చేయాలనుకున్న సందర్భంలో ఇదినాకు అవసరమా? అనే ప్రశ్న ఉత్పన్నమైందా?

• అలాంటి ప్రశ్న ఎదురైనప్పుడు అవసరమే అనిపించింది. అయితే నాకు అవసరం అని కాదు ఇలాంటి కొత్త తరహా సినిమా చేయడం ఇండస్ట్రీకి అవసరం అనిపించింది. తెలుగులో కొత్త సినిమాలు రావడం లేదని చాలా సందర్భాల్లో మనమే ప్రశ్నిస్తున్నాం. అలాంటి కొత్త తరహా సినిమాల్ని ఎవరో ఒకరు చేస్తారని ఎదురు చూడటం ఎందుకు మనమే చేస్తే బాగుంటుంది కదా అనిపించింది. అందుకే ఈ సినిమా నిర్మించాను.

హీరోగా వరుస చిత్రాలు... నిర్మాణ బాధ్యతలు.. ఈ రెండింటిని ఎలా సమన్వయం చేసుకున్నారు?

• ఈ రెండింటిని సమన్వయం చేసుకోవడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను.

'ఈ సినిమా వల్ల నిర్మాతపై గౌరవం పెరిగిందా?

• నేను ఎప్పుడూ నిర్మాతలను గౌరవిస్తూనే వుంటాను. అయితే ఈ సినిమాతో ఓ నిర్మాత తన సినిమా విషయంలో తెరవెనుక ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటారో..ఎన్ని సమస్యల్ని సమర్థవంతంగా ఎదుర్కొంటె ఒక సినిమా విజయవంతంగా బయటకు వస్తుంది అనే విషయాలపై కొంత అవగాహన ఏర్పడింది.

రిలీజ్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా?

• 'అ!'. ఇది ఆడుతుందా? ఆడదా? అనేది మాత్రం నాకు తెలియదు. అయితే నూటికి నూరు శాతం ఇప్పుడు ఇలాంటి సినిమా చేయాల్సిన అవసరం మాత్రం ఖచ్చితంగా వుందనిపించి తీశాను. అలాంటి సినిమాను నా మీద నమ్మకంతో రిలీజ్ చేయడానికి వచ్చిన డిస్ట్రిబ్యూటర్‌లకు ఇవ్వడం కంటే నేనే విడుదల చేయడం కరెక్ట్ అనిపించి ఈ చిత్రాన్ని నేనే విడుదల చేస్తున్నాను. నా లాంటి ప్రేక్షకుడికి నచ్చే అంశాలన్నీ వున్న సినిమా ఇది. సినిమా చూసిన వాళ్లు మాత్రం గొప్ప సినిమా అని ఖచ్చితంగా మెచ్చుకుంటారు. అది వారం తరువాతా? లేక సంవత్సరం తరువాతా? అనేది మాత్రం చెప్పలేను.

ప్రశాంత్‌వర్మపై ఏ నమ్మకంతో ఈ సినిమా చేశారు?

• ఇలాంటి కథ రాసి నాకు వినిపించినప్పుడే ప్రశాంత్‌వర్మ సగం విజయం సాధించాడు. ఇలాంటి ఐడియాతో ఇక్కడ వున్నాడంటేనే అందరిలో అతని ఆలోచన విభిన్నం అని అర్థమైంది. ఈ కథను ప్రశాంత్‌వర్మ సక్రమంగా తీర్చిదిద్దడానికి దానికి తగ్గ నటుల్ని, సాంకేతిక నిపుణుల్ని అందించడం నిర్మాతగా నా బాధ్యత. నేను ఎప్పుడైతే కథను నమ్మానో అప్పుడే ప్రశాంత్‌ను నమ్మాను. ఈ కథకు నిర్మాతగా నేను ఏం చేయగలనో అవన్నీ చేశాను. ఫైనల్ కాపీ చూసిన తరువాత చెప్పినదానికన్నా గొప్పగా తీశాడని గర్వంగా ఫీలయ్యాను.

నిత్యామీనన్, కాజల్, రెజీనా, ఇషారెబ్బా..మీ కోసం పనిచేశారా? లేక కథను నమ్మి చేశారా?

• వాళ్లంతా కథను నమ్మే ఈ సినిమాకు పనిచేశారు. పారితోషికం మిగతా చిత్రాలకు ఎలా తీసుకుంటారో నా దగ్గరా అలాగే తీసుకున్నారు. నా సినిమా కదా అని నాకు ఫేవర్ ఏమీ చేయలేదు. నేను నిర్మాతగా, వాళ్లంతా నటీనటులుగానే ప్రవర్తించారు.

వాయిస్ ఓవర్ కోసం వస్తే మీరే సినిమా చేస్తానని అన్నారట?

• చేప పాత్రకు డబ్బింగ్ చెప్పమని ప్రశాంత్ నా దగ్గరికి వచ్చి కథ చెప్పాడు. ఒక్క సన్నివేశం కూడా ఇంతకు ముందు చూసినట్టుగా కానీ, చేసినట్టుగా కానీ అనిపించలేదు. ఇలాంటి కథను నేనే నిర్మిస్తే బాగుంటుందని అనిపించింది. ఈ జోనర్ సినిమా తెలుగు ఇండస్ట్రీలోనే కాదు. మన దేశంలోనే ఇంత వరకు రాలేదు.

ఈ సినిమా చేయాలనుకున్న సందర్భంలో ప్రశాంతంగా వున్న నీకు అవసరమా? అని ఎవరైనా మిమ్మల్ని ఆపే ప్రయత్నం చేశారా?

• ఇది నీకు అవసరమా అని చాలా మంది అన్నారు. అది వాళ్లతప్పుకాదు. నా మంచి కోసమే చెప్పారు. ఏదైనా ఒక కొత్త అడుగు వేయాలనుకున్నప్పుడు ఖచ్చితంగా వద్దని చాలా మంది అంటారు. అందరూ వెళుతున్న దారికి భిన్నంగా వెళ్లాలనుకున్నప్పుడు చాలా మంది భయపెడతారు. మన మంచి కోరేవారు వద్దని వారిస్తారు. అలాంటి వాటికి భయపడి కొత్త అడుగు వేయడానికి ఆలోచిస్తే ఎప్పటికీ ముందుకు వెళ్లలేంసరికదా ఏ మార్పును తీసుకురాలేం.

'అ!' అని సినిమా చూసిన ప్రేక్షకులు ఫీలవ్వాలనే ఆ టైటిల్ పెట్టారా?

• సినిమా చూసి బయటికి వచ్చే ప్రేక్షకుల్లో కలిగే ఒక ఆశ్చర్యమే 'అ!'. అందుకే ఈ టైటిల్ పెట్టాం.

తదుపరి చిత్రాల గురించి?

• మేర్లపాక గాంధీ దర్శకత్వంలో 'కృష్ణార్జున యుద్ధం' చేస్తున్నాను. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. దీనితో పాటు నాగార్జునతో కలిసి ఓ సినిమా చేయబోతున్నాను. అది ఈ నెలలోనే మొదలవుతుంది.

స్వచ్ఛమైన ప్రేమకథ!


సాయిరోనక్

సాయి రోనక్, శ్రావ్య, శిరీషా వంక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మసక్కలి'. ఎన్. నబి ఏనుగుబాల దర్శకుడు. గుడ్ ఫాలో రైట్ ప్రొడక్షన్స్ పతాకంపై సుమిత్ సింగ్ నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కొన్ని కథలు విని నమ్ముతాం. కొన్ని కథల్ని చూసి నమ్ముతాం. అలాంటి కథే 'మసక్కలి'. స్వచ్ఛమైన ప్రేమ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలి.' అన్నారు. మధుర శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'పాజిటివ్ ఎనర్జీ వున్న టీమ్ అంతా కలిసి చేసిన సినిమా ఇది. టైటిల్, ట్రైలర్ నాకు బాగా నచ్చాయి. ఈ ఏడాది అంతా ప్రేమకథలదే అనుకుంటాను. ఈ సినిమా కూడా సక్సెస్ కావాలి' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''మసక్కలి' ఓ స్వచ్ఛమైన ప్రేమకథ. ఆల్ ఎమోషన్స్ వున్న సినిమా ఇది. ప్రతి పాట కథను చెప్పే విధంగా సాగుతుంది. అలరాజు అద్భుతమైన పాటలిచ్చారు. మహిరామ్స్ చక్కని సంగీతాన్ని అందించారు' అని తెలిపారు.

'శివకాశీపురం' గీతాలు


ప్రియాంకశర్మ

ప్రముఖ సంగీత దర్శకుడు చక్రవర్తి మనవడు రాజేష్ శ్రీ చక్రవర్తి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'శివకాశీపురం'. హరీష్ వట్టికూటి దర్శకత్వంలో మోహన్‌బాబు పులిమామిడి నిర్మిస్తున్నారు. ప్రియాంకశర్మ కథానాయిక. పవన్‌శేష సంగీతాన్నందించిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. దర్శకనిర్మాత గుణ్ణం గంగరాజు ఆడియో సీడీలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'రాజేష్ శ్రీ చక్రవర్తి భవిష్యత్తులో మంచి కథానాయకుడిగా ఎదగాలని కోరుకుంటున్నాను. పాటలు, ట్రైలర్స్ చాలా బాగున్నాయి' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'టీనేజ్ ప్రేమకథ నేపథ్యంలో నడిచే సైకలాజికల్ థ్రిల్లర్ ఇది. గ్రామీణ ఇతివృత్తంతో సహజంగా సాగుతుంది.' అన్నారు. తమ బ్యానర్‌లో తొలి చిత్రమిదని, చక్రవర్తి మనవడిని పరిశ్రమకు పరిచయం చేయడం ఆనందంగా ఉందని నిర్మాత చెప్పారు.

ఆకట్టుకున్న మైనింగ్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనింగ్‌టుడే ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాల నుంచి ఆయా కంపెనీలు, ప్రైవేట్ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాల్లో లభ్యమయ్యే ఖనిజ సంపదను ప్రదర్శనకు పెట్టారు. తెలంగాణతో పాటు ఏపీ, మధ్యప్రదేశ్, జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి పలు కంపెనీలు 150 స్టాళ్లను ఏర్పాటుచేశాయి. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో బుధవారం మొదలైన మైనింగ్‌టుడే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్ ఈ నెల 17 వరకు జరుగనున్నది. రాష్ట్రం తరఫున టీఎస్‌ఎండీసీ, మైనింగ్‌శాఖ, సింగరేణితోపాటు ఎన్ఎండీసీ ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటుచేశాయి. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి లభించే గ్రానైట్, మార్బుల్ రకాలను ప్రదర్శనలో పెట్టాయి. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో లభించే బ్లాక్ గ్రానైట్, కరీంనగర్ జిల్లాలో లభించే బ్లాక్ గ్రానైట్, రోసీ గ్రానైట్, రాయల్ గ్రానైట్‌తోపాటు పలు మార్బుల్స్ ఆకట్టుకొంటున్నాయి. సింగరేణి సంస్థ 2012లో ఒపెన్‌కాస్టుల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన విధానాన్ని ప్రదర్శనలో చూపిస్తున్నారు. ఆయా కంపెనీలు నూతన వాహనాలు, మైనింగ్ తీసేందుకు వినియోగించే వాహనాలను ప్రదర్శనకు తీసుకొచ్చారు. శనివారం మైనింగ్‌టుడే ఎగ్జిబిషన్‌కు సాధారణ సందర్శకులకు అవకాశమివ్వనున్నారు.

నేడు ముగింపు కార్యక్రమం: మైనింగ్ టుడే సదస్సు ముగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు జరుగనుంది. ఈ కార్యక్రమంలో అటవీశాఖ మంత్రి జోగు రామన్న, గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్, ఎన్ఎండీసీ డైరెక్టర్ ఎన్‌కే నంద, కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ బీఆర్వీ సుశీల్‌కుమార్ పాల్గొంటారు. గురువారంనాటి సదస్సులో కేంద్ర గనుల శాఖ సంయుక్త కార్యదర్శి బిపుల్ పతక్, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ బీవీఆర్ సుశీల్ కుమార్, ఏపీ గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, మినరల్స్ రిసోర్సెస్ కన్సల్టెంట్ డాక్టర్ వీఎన్ వాసుదేవ్, సింగరేణి డైరెక్టర్ భాస్కర్‌రావు తదితర నిపుణులు పాల్గొన్నారు. మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ (ఎంఎండీఆర్) చట్టం సవరణతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని కొందరు వక్తలు అభిప్రాయపడ్డారు.



హైటెక్స్‌లో మైనింగ్‌టుడే ఎగ్జిబిషన్‌లో దేవాపూర్ లైమ్‌స్టోన్ మైన్స్ ప్రదర్శన

అభివృద్ధిలో తెలంగాణ ముందంజ

- 16.5 శాతం జీడీపీతో రాష్ట్రం దూసుకెళ్తున్నది
- మధ్యప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రి కడియం వెల్లడి
- అమర్‌కంటక్‌లోని ఇందిరాగాంధీ ట్రైబల్ వర్సిటీ సందర్శన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అభివృద్ధిలో వేగంగా ముందుకు వెళ్తున్నదని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. 16.5 శాతం జీడీపీతో దేశంలో రికార్డు స్థాయిలో తమ రాష్ట్రం దూసుకెళ్తున్నదని అన్నారు. గురువారం మధ్యప్రదేశ్‌లోని అమర్‌కంటక్ పట్టణంలో ఇందిరాగాంధీ ట్రైబల్ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని హైదరాబాద్ హ్యాపెనింగ్ సిటీగా పేరుతెచ్చుకుంటున్నదన్నారు. ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక విధానం టీఎస్‌ఐపాస్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తమ రాష్ట్రం వైపు చూస్తున్నారని చెప్పారు. సంక్షేమరంగంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉన్నదన్నారు. రూ.40 వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని డిప్యూటీ సీఎం కడియం చెప్పారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, టీ హబ్ వంటి పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయని అన్నారు. నీతిఆయోగ్ పెద్దలు తెలంగాణ చేపడుతున్న పథకాలు మిగిలిన రాష్ట్రాలు కూడా ఆచరిస్తే మంచిదని సూచించారని గుర్తుచేశారు. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు మూడేండ్లలో 540 గురుకులాలు ఏర్పాటుచేశామని చెప్పారు. వర్సిటీల్లో పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను వేగవంతంచేశామని తెలిపారు.



మధ్యప్రదేశ్ అమర్‌కంటక్ పట్టణంలోని ఇందిరాగాంధీ ట్రైబల్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

వాటా తేలితేనే పరిధిపై చర్చ

- ఇంకెన్నాళ్లీ 299 టీఎంసీల అన్యాయం
- నాలుగేళ్లయినా రాష్ట్ర వినతి బేఖాతరు
- ఏ ప్రాతిపదికన పోతిరెడ్డిపాడు నీటి విడుదల
- ఇప్పటికీ తేలని టెలిమెట్రీ, బజాజ్ కమిటీ
- కేంద్ర జలవనరుల శాఖ భేటీలో గట్టిగా తెలంగాణ వాదనలు.. అభిప్రాయాలు సేకరించామన్న కార్యదర్శి
- తదుపరి సమావేశాల్లోనూ చర్చిద్దామని రెండు రాష్ట్రాలకు సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నదీ యాజమాన్య బోర్డుల పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకురావాలనే కేంద్ర సర్కారు ప్రతిపాదనకు తెలంగాణ గట్టి జవాబు చెప్పింది. ఏ ప్రాతిపదికన దీనిని అమలు చేస్తారని నిలదీసింది. బచావత్ కేటాయింపుల్లోనూ తెలంగాణకు అన్యాయం జరిగిందని.. ఈ క్రమంలో ఉమ్మడి ఏపీలో నిర్ణయించిన 299 టీఎంసీల అన్యాయమైన వాటాను ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారని నిలదీసింది. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో రెండు తెలుగు రాష్ట్రాల నీటిపారుదలశాఖ కార్యదర్శులు, కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోర్డుల పరిధిలోకి ప్రాజెక్టులు అనే అంశాన్ని మొదటగా కేంద్రం చర్చకు తీసుకురాగా.. ఇతర అంశాలపైనా తెలంగాణ నీటిపారుదలశాఖ బలమైన వాదనలు వినిపించింది. ఈ నేపథ్యంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది. ప్రాథమికంగా మొదటి సమావేశాన్ని నిర్వహించామని కేంద్ర జలవనరులశాఖ వివరణ ఇచ్చింది. కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి యూపీ సింగ్ తొలిసారిగా తెలుగు రాష్ట్రాలతో సమావేశమయ్యారు. సమావేశం ప్రారంభంలోనే కార్యదర్శి యూపీ సింగ్.. బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకురావడం(జ్యూరిస్‌డిక్షన్)పై చర్చను ప్రారంభించారు. కృష్ణాజలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, వాస్తవంగా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో 574.60 టీఎంసీల న్యాయమైన వాటా రావాల్సి ఉన్నదని, తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేంద్రాన్ని కోరుతున్నా ఏమాత్రం పట్టించుకోలేదని తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి బలమైన వాదనలు వినిపించినట్టు తెలిసింది. అలాంటి పరిస్థితుల్లో బోర్డుపరిధిలోకి ప్రాజెక్టులను తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ కోరిన న్యాయమైన వాటా ఇచ్చి, ఆపై ఏ ప్రాజెక్టుకు ఎంత కేటాయింపు, ఉమ్మడిప్రాజెక్టులేవో తేల్చాకే బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులు తీసుకొస్తే బాగుంటుందని కోరారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ మాట్లాడుతూ.. తమకు కృష్ణాజలాలు సరిగా రావడంలేదని, సాగర్ ప్రాజెక్టు తెలంగాణ నియంత్రణలో ఉండటంతో కుడికాల్వ కింద నీటిని తీసుకోవడం కష్టంగా ఉన్నదని చెప్పారు. దీనిపై తెలంగాణ సీఎస్ జోషి స్పందిస్తూ.. అసలు ఏ ప్రాతిపదికన పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను అనుమతిస్తున్నారని గట్టిగా నిలదీశారు. 'ఆర్డీఎస్‌కు నీళ్లు రావడం లేదు.. ఆధునీకరణ పనులకు ఏపీ సహకరించడం లేదు'అని పేర్కొన్నారు.

అది వేరు.. ఇది వేరు

పోలవరం, పట్టిసీమ ద్వారా ఏపీ కృష్ణా డెల్టాకు గోదావరిజలాల మళ్లింపు, తద్వారా సాగర్ ఎగువన ఉన్న తెలంగాణకు 90 టీఎంసీల కృష్ణాజలాల వాటా పెంపు అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారమే తెలంగాణకు కృష్ణాలో వాటా పెరుగాల్సి ఉందని, కానీ కేంద్రం ఇప్పటివరకు తేల్చడంలేదని కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి దృష్టికి తెలంగాణ సీఎస్ జోషి తీసుకెళ్లారు. తెలంగాణ కూడా కృష్ణాబేసిన్‌లో 212 టీఎంసీల గోదావరిజలాలను వినియోగిస్తున్నదని ఏపీ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌చెప్పారు. అసలు ఆగ్‌మెంటేషన్ (ఒక బేసిన్‌లో సాగునీరు అందుతున్న ప్రాంతాలకు ఇంకో బేసిన్ నుంచి నీటిని తరలించడం), యుటిలైజేషన్ (ఒక బేసిన్‌లో సాగునీరు అందని ప్రాంతాలకు ఇంకో బేసిన్ నుంచి నీటిని తరలించి వినియోగించడం) మధ్య తేడా ఉందని జోషి బలంగా వాదించారు. ట్రిబ్యునల్‌లో పేర్కొన్న ఆగ్‌మెంటేషన్ ప్రకారం తాము వాటాను కోరుతున్నామని, కానీ ఏపీ వినియోగాన్ని (యుటిలైజేషన్) ప్రస్తావిస్తున్నదని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ కూడా.. అసలు తేడా ఏమిటంటూ కేంద్ర జలసంఘం చైర్మన్ నరేంద్రకుమార్ అడిగినట్లు తెలిసింది. అనంతరం చిన్న నీటిపారుదల కింద వినియోగం(చెరువులు) అంశాన్ని ఏపీ సమావేశంలో ప్రస్తావించగా, ఏపీలోనూ సుమారు 60 వేల వరకు చెరువులు ఉన్నాయని, తెలంగాణలోని చెరువులు ఉమ్మడి ఏపీ హయాంలో విధ్వంసానికి గురైనట్టు జోషి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఈ క్రమంలో రెండువైపులా చెరువుల కింద నీటి వినియోగంపై శాస్త్రీయ అంచనాకు రావాలని కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి యూపీ సింగ్ అభిప్రాయపడినట్టు తెలిసింది. ఈ సమావేశంలో ప్రాథమికంగా రెండురాష్ట్రాల అభిప్రాయాల్ని తెలుసుకున్నామని, తదుపరి సమావేశాల్లోనూ ఇంకా చర్చిద్దామని సింగ్ చెప్పారు. 20న హైదరాబాద్‌లో జరిగే దక్షిణాది రాష్ట్రాల సమావేశంలోనూ ఈ అంశాలను చర్చిద్దామని అన్నట్టు తెలిసింది. ఆయన అధ్యక్షతన గురువారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో కేంద్ర జలవనరులశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుందు, కేంద్ర జలసంఘం చైర్మన్ మసూద్ హుసేన్, కృష్ణా, గోదావరి బోర్డు చైర్మన్లు వైకే శర్మ, సాహు, తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, ఇంటర్‌స్టేట్ చీఫ్ ఇంజినీర్ నర్సింగరావు, ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, కృష్ణాబోర్డు మాజీ చైర్మన్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

ఏ అంశాన్నీ తేల్చడం లేదు

ఒకవైపు కేంద్రం కృష్ణాజలాల్లో న్యాయమైన వాటా తేల్చడం లేదనీ.. మరోవైపు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కూడా దేనినీ తేల్చడం లేదని తెలంగాణ సీఎస్ జోషి బలంగా వాదించినట్టు తెలిసింది. టెలిమెట్రీ వ్యవస్థను మూడునెలల్లో ఏర్పాటు చేయమంటే..రెండేండ్లయినా ఇంతవరకు ఏర్పాటుచేయలేదని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. పట్టిసీమ ద్వారా ఏపీ గోదావరిజలాల మళ్లింపుపై తెలంగాణ వాటా తేల్చేందుకు వేసిన బజాజ్ కమిటీ ఏమైందని కూడా జోషి సూటిగా ప్రశ్నించినట్టు సమాచారం. ఆ కమిటీకి అప్పగించిన బాధ్యతల్లో పట్టిసీమ అంశాన్ని ఎలా తొలగిస్తారని నిలదీసినట్టు తెలిసింది. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం భద్రాచలం ఆలయంతోసహా ప్రధాన ప్రాంతాలపై ఉంటుందని, దీనిపై అధ్యయనం చేయాలన్ని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొత్తదంటూ ఈ సమావేశంలోనూ ఏపీ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దీంతో ఇది ఆన్‌గోయింగ్ ప్రాజెక్టు అని కేంద్ర జలవనరుల శాఖ ఇప్పటికే ధృవీకరించిందని, తెలంగాణ ఏ కొత్త ప్రాజెక్టు చేపట్టినా నదీ యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తుందని జోషి స్పష్టంచేశారు.

డీపీఆర్ల తయారీలో జాప్యం తగదు

- రహదారుల పనులపై సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డీపీఆర్‌ల తయారీకి జాప్యం సహించరానిదని, కేంద్రానికి సకాలంలో సమగ్ర రిపోర్టులు అందించి నూతన ప్రాజెక్టులు సాధించుకోవడమే లక్ష్యంగా అధికారులంతా పనిచేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. డిటేల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లను తయారుచేసే నెపంతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని అధికారుల తీరుపై మంత్రి అసహనం వ్యక్తంచేశారు. 2014 నుంచి మంజూరైన జాతీయ రహదారుల తీరుతెన్నులు, డీపీఆర్‌ల తయారీ వంటి అంశాలపై గురువారం ఎర్రమంజిల్‌కాలనీలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో సమీక్షించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గ్రాంటు పెంచాలని నితిన్ గడ్కరీకి వినతి

రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్వహణకు గ్రాంటును పెంచాలని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. కేంద్రం ప్రకటించిన 25 నూతన జాతీయ రహదారులకు 3155 కిలోమీటర్ల నిడివికి అదనంగా మరో 1207 కిలోమీటర్ల నిడివి గల 11 రోడ్లను ఎన్‌హెచ్‌లుగా బదలాయించాలని కోరామన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, ఎన్‌హెచ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ఎమ్మార్పీఎస్ ఉప కుల సంఘాల నాయకులు

20న ఓయూలో మాదిగ ఉపకులాల రాష్ట్ర సదస్సు

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: మాదిగ ఉపకులాల సంక్షేమం, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు 57 ఉపకులాల ప్రతినిధులతో ఈనెల 20న మాదిగ ఉపకులాల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు టీఎస్ఎమ్మార్పీఎస్, ఉపకులసంఘాల నేతలు తెలిపారు. గురువారం విద్యానగర్‌లోని టీఎస్ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఉపకులాల రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపకులాల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ నిధులు న్యాయబద్ధంగా కేటాయించాలని టీఎస్ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకపాక దేవయ్య కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, జాతీయ ప్రధానకార్యదర్శి మేడిపాపయ్య, బేడ బుడగ జంగాలహక్కుల దండు పోరాటసమితి నేతలు తూర్పాటి హన్మంతు, శిరిగిరి మన్యం, వోలియ దాసరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరేశ్, డక్కలి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బాగాల మంగేశ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలతోనే రాష్ట్రాభివృద్ధి: డీజీపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజలు 'నేను సైతం' అంటూ ముందుకు వచ్చి పోలీసుశాఖ సమన్వయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనమని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీసులు చేస్తున్న కృషికి ప్రజలు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాగన్నగూడలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం డీజీపీ లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా శాంతిభద్రతలు ఎంతో కీలకమన్నారు. ఇప్పటివరకు రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 'నేను సైతం' కార్యక్రమం ద్వారా 2,20,000 సీసీ టీవీలు, కమ్యూనిటీ సీసీ టీవీ కార్యక్రమం ద్వారా 20,000 సీసీటీవీలను ఏర్పాటు చేశామన్నారు. 10 లక్షల కెమెరాల ఏర్పాటును లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలని సూచించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఎం మహేశ్‌భగవత్ మాట్లాడుతూ.. నేనుసైతం, కమ్యూనిటీ సీసీ టీవీ ప్రాజెక్టులో ప్రజలు ముందుకు వచ్చి నేరాల నిర్మూలనకు కృషి చేయడం హర్షించే విషయమన్నారు. నేను సైతం ప్రాజెక్టుపై ముద్రించిన కరపత్రాలు, సీసీ కెమెరాల ఉపయోగాలను వివరించే లఘుచిత్రాన్ని విడుదలచేశారు.

23 నుంచి సర్పంచ్‌ల సమ్మేళనాలు

- మహబూబ్‌నగర్ నుంచి మొదలు
- 27న వరంగల్, వచ్చేనెల 5న నిజామాబాద్
- జిల్లాకు 100 మంది చొప్పున ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సర్పంచ్‌ల సమ్మేళనాలు నిర్వహించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ సన్నాహాలు చేస్తున్నది. మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలో సర్పంచ్‌ల సమ్మేళనాలు నిర్వహించనున్నారు. ఈనెల 23న జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల సర్పంచ్‌ల సమ్మేళనాన్ని మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, యాదాద్రి భువనగిరి జిల్లాల సర్పంచ్‌ల సమ్మేళనాన్ని వరంగల్‌లో ఈ నెల 27న ఏర్పాటుచేశారు. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల సర్పంచ్‌ల సమ్మేళనాన్ని మార్చి 5న నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్నారు. ప్రతీ జిల్లా నుంచి 100 మంది సర్పంచ్‌లను ఈ సమ్మేళనానాకి ఆహ్వానిస్తున్నారు. వీరికి జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందిన గ్రామసర్పంచ్‌లతో వారి అనుభవాలు పంచుకుంటారు. మంత్రి జూపల్లి సమ్మేళనాల్లో పాల్గొననున్నారు.

ఈనెల 24 నుంచి టీశాట్‌లో టీసీపార్డ్ కార్యక్రమాలు

టీశాట్ చానెల్‌లో తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యక్రమాల ప్రసారాలు ఈ నెల 24న మంత్రి జూపల్లి ప్రారంభించనున్నారు. ప్రతీ వారం గంటపాటు పథకాలపై కార్యక్రమాలు ప్రసారమవుతాయి.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి

- బీసీ సంక్షేమ, అటవీశాఖల మంత్రి జోగు రామన్న
- సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో మేరు కులస్థుల సదస్సు

మారేడ్‌పల్లి: వెనుకబడినవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని.. బీసీ సంక్షేమ, అటవీశాఖల మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. వెనుకబడినవర్గాల కోసం ఈ ఏడాది రూ. 8 వేల కోట్లు కేటాయించాలని సీఎం కేసీఆర్‌కు బీసీ మంత్రులందరం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కులవృత్తులపై ఆధారపడే వారికోసం బ్యాంక్‌లతో సంబంధం లేకుండా రూ.50 వేల నుంచి 2 లక్షల వరకు రుణాలను అందించబోతున్నామని తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మేరు సంఘం, తెలంగాణ మేరు ఫెడరేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగాహాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ సాగుతున్నదన్నారు. మేరు కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, వీరిని బీసీ డీ నుంచి ఏ కు మార్చే అంశాన్ని బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన వెల్లడించారు. మేరు కులస్థులకు వృత్తిలో నైపుణ్యాలు పెంచుకునేందుకు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. బీసీ నిరుద్యోగులకోసం పాత పదిజిల్లాల్లో స్టడీ సర్కిళ్లకు సొంతభవనాలు నిర్మించామని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు స్థానం కల్పించేలా సీఎంతో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సభాధ్యక్షుడు వెన్ను లింబాద్రి, ప్రధాన కార్యదర్శి బీ రవితేజ, కోశాధికారి సత్యనారాయణ, సలహాదారుడు మల్లేశం, కేసీఆర్ సేవామండలి ఫౌండర్ అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావు, మాడిశెట్టి శ్రీనివాస్, మోండా డివిజన్ కార్పొరేటర్ ఆకుల రూప పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న. చిత్రంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు



ఆర్టీసీ కళాభవన్‌లో ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్ ఎస్ యాదిరెడ్డి, ఆయన కుటుంబసభ్యులను సన్మానిస్తున్న టీఎస్ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు

ఇంధన పొదుపులో ఆర్టీసీదే అగ్రస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోని ప్రజా రవాణా సంస్థల్లో ఇంధన పొదుపులో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) అగ్రస్థానంలో ఉన్నదని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు చెప్పారు. డ్రైవర్ల కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. 2016-17 సంవత్సరానికి సంస్థకు ఇంధనం పొదుపుచేసి రాష్ట్ర, రీజియన్‌స్థాయిలో అత్యుత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, ఉత్తమ మెకానిక్‌లను గురువారం ఆర్టీసీ కళాభవన్‌లో 'ఇంధన సంరక్షణ సర్వజన బాధ్యత' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబసమేతంగా సన్మానించారు. రివార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే సంస్థకు రూ.270 కోట్ల ఆదాయం పెరిగిందని, ప్రస్తుతం 29 డిపోలు లాభాల బాటలోకి రాగా, 36 డిపోలు నష్టాల నుంచి గట్టెక్కుతున్నాయని చెప్పారు. 1980-81లో కేవలం 4.09 ఉన్న కేఎంపీఎల్ నిర్దేశిత లక్ష్యం.. 2016-17లో 5.13కి పెరుగడం చెప్పుకోదగ్గ విషయమని పేర్కొన్నారు. టీఎస్ఆర్టీసీ పెట్రోలియం కన్జర్వేషన్ రిసెర్చ్ అసోసియేషన్ నుంచి 26 సార్లు, ఏఎస్ఆర్టీయూ నుంచి 37 సార్లు జాతీయస్థాయిలో అవార్డులు అందుకున్నదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్) ఎం రవీందర్, చీఫ్ మెకానికల్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ శివేంద్ర గుప్తా, డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి రీజియన్ మియాపూర్-2 డిపోకు చెందిన ఎస్ యాదిరెడ్డి రాష్ట్రస్థాయిలో ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్‌గా అవార్డు పొందగా, తర్వాత స్థానాల్లో నిజామాబాద్-2 డిపోకు చెందిన బీ శ్రీనివాస్, నల్లగొండ డిపోకు చెందిన ఆర్ నర్సింహ పురస్కారాలు, సన్మానాలు పొందారు.

..జొన్నలు కొంటాం

మూడోపేజీ తరువాయి...

ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్, మార్క్‌ఫెడ్ జీఎం రాములుతో కలిసి మంత్రి పోచారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రజొన్న రైతుల పేరుతో కాంగ్రెస్ నేతలు రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. నిజామాబాద్, బాల్కొండ, ఆర్మూర్, జగిత్యాల నియోజకవర్గాలలోని రైతులు ఎర్రజొన్నలు ప్రతి ఏడాది పండిస్తున్నారని.. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ఎప్పటికప్పుడు వ్యవసాయ దిగుబడులు, రైతుల కష్టాలు, మద్దతుధరలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఇప్పుడు కోతకు వచ్చిన ఎర్రజొన్న పంటను వ్యాపారులు కొనడానికి ముందుకు రాకపోవడంతో.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎంపీ కవిత, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఏ జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌లతో కలిసి ఈ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సీఎం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారని మంత్రి పోచారం వెల్లడించారు. తాజాగా ముఖ్యమంత్రి ఆదేశం మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని, సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ప్రకటించారు. క్వింటాలుకు రూ.2300 చొప్పున కొంటామని తెలిపారు. 2014కు ముందు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎర్రజొన్నలను కొనుగోలు చేయకుండా మోసం చేసిందని, అప్పుడు రైతులకు బకాయిపడ్డ రూ.12 కోట్లను టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెల్లించిందని గుర్తుచేశారు. ఇలాంటి పనులు కాంగ్రెస్ వల్ల కావని అన్నారు.

చేయరు.. చేయనివ్వరు..

కాంగ్రెస్ నేతలు చేయరు.. చేసేవాళ్లను చేయనివ్వరని మంత్రి పోచారం మండిపడ్డారు. తప్పుడు సలహాలిచ్చి ఎర్రజొన్న రైతులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు కర్ణాటకలో ఒకతీరు.. ఇక్కడ మరో తీరుగా వ్యవహరిస్తున్న విషయాన్ని తెలంగాణ రైతులు అర్థం చేసుకుంటున్నారన్నారు. 'కర్ణాటకలోని బళ్లారిలో కూడా ఎర్రజొన్నలు పండిస్తున్నారు. అక్కడ రూ.1600కు క్వింటాలు చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణలో సోమవారం నుంచి రూ.2300 చొప్పున చెల్లించనున్నాం. అక్కడ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా రూ.2300 చొప్పున కొనుగోలు చేయాలని ఈ నేతలు ఎందుకు ప్రశ్నించరు' అని మంత్రి పోచారం నిలదీశారు. ఎర్రజొన్నల కొనుగోలుకు సంబంధించి కొంతకాలంగా సీఎం కేసీఆర్, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కవితతో చర్చిస్తూనే ఉన్నామని.. పంట కోతకు రానందున తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ప్రతి గింజ కొనాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని.. ఈరోజు ప్రకటించామన్నారు. కాంగ్రెస్ నేతలు రైతులకు సొల్లు మాటలు చెప్తున్నారని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతోనైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. పదేండ్లు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ నేతలు అప్పుడు ఎర్రజొన్నలకు మద్దతు ధర ప్రకటిస్తే ఇప్పుడు ఈ సమస్య వచ్చేది కాదన్నారు. సీఎం కేసీఆర్ ధైర్యంతో సరైన సమయంలో నిర్ణయం తీసుకున్నారని, కేవలం ఎర్రజొన్నలనే కాకుండా కంది, మొక్కజొన్న, సోయాబీన్, పెసర్లు, మినుములను కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా మద్దతు ధరతో పెద్ద ఎత్తున కొనుగోలు చేశామని తెలిపారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో2,716 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 18.26 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేశామని మంత్రి వివరించారు.

రైతులపై కాల్పులు జరిపిన చరిత్ర కాంగ్రెస్‌ది: ఆర్మూర్ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి

ఎర్రజొన్నలకు మద్దతు ధర కల్పించిన ఘనత సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని ఆర్మూర్ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి అన్నారు. 2008లో కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఎర్రజొన్న రైతులకు మద్దతు ధర కల్పించలేదని, ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర ఆ పార్టీదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు కాల్పులు జరిపి.. ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎర్రజొన్నలను క్వింటాలుకు రూ.1600కు కొనుగోలు చేస్తుంటే సీఎం కేసీఆర్ రూ.2300కు కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారని.. రైతులపై, వారి సమస్యల పరిష్కారంపై ఎవరికి ఎక్కువ నిజాయితీ ఉందో దీంతో అర్థమవుతుందన్నారు. రైతులను రెచ్చగొట్టేందుకే ఎర్రజొన్నల రైతుల పేరుతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన నాటకమాడుతున్నారని మండిపడ్డారు. ఆర్మూర్‌కు 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా పనిచేసినవాళ్లు ఎర్రజొన్నల రైతుల సమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి ఎప్పుడైనా తీసుకెళ్లారా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. నీతి, నిజాయితీ ఉన్నది ఎవరికో రైతులు అర్థం చేసుకుంటున్నారని.. కాంగ్రెస్ నేతల మోసపూరిత వైఖరిని గుర్తించి వారికి తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. రైతుల సమస్యను గుర్తించి ఎర్రజొన్నలకు రూ.2300 ధర ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ కవితలకు ఆర్మూర్ నియోజకవర్గ ఎర్రజొన్నల రైతుల తరపున జీవన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రైతుల కోసమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు: ఎంపీ కవిత

ఎర్రజొన్న కొనుగోలుపై రెండురోజుల క్రితమే నిర్ణయం తీసుకున్నట్లు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఎర్రజొన్నలకు మద్దతు ధర లేకున్నా.. వాణిజ్యపంట అయినప్పటికీ సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం దృష్ట్యా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. రైతులను గందరగోళపరిచేందుకు కాంగ్రెస్ నేతలు ఆర్మూర్‌లో ఎర్రజొన్నల రైతుల పేరుతో ఆందోళనలకు ప్రయత్నించారని, అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎర్రజొన్న రైతులందరినీ ఆదుకుంటామని ఆమె స్పష్టం చేశారు. 'సోమవారం నుంచి ఎర్రజొన్నలను రూ.2300కు క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తాం. ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం. సీఎం రైతు బిడ్డ. రైతుల కష్టాలు తెలుసు. రైతులకు ఇబ్బంది కలిగే ఏ నిర్ణయం తీసుకోరు. ప్రభుత్వం, ప్రజలు, రైతులు వేరు కాదు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎర్రజొన్న రైతులు మద్దతు ధర కోసం ఆందోళన చేపడితే కాల్పులు జరిపి.. రైతుల కడుపులో బుల్లెట్లు దింపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. రైతులపై కాల్పులు జరిగిన సమయంలో కేసీఆర్ ఉద్యమకారుడిగా రైతులను పరామర్శించారు. ఆ సమయంలోనే తెలంగాణ వచ్చాక ఎర్రజొన్న రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఇప్పుడు చేసి చూపించారు. కాంగ్రెస్ నేతలు కొంగజపం చేసే నాయకులు. వారి మాటలు నమ్మొద్దు. వారి అవసరాల కోసం రెచ్చగొడుతున్నారు. సర్కార్‌లో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదు. దరఖాస్తులు ఇచ్చే రోజులు పోవాలని సీఎం కేసీఆర్ చెప్పారు. రైతులు మాట చెప్పితే సర్కార్ చేస్తుందన్నారు. అది నిజం చేశారు' అని కవిత తెలిపారు. ఆర్మూర్‌లో ఎర్రజొన్నలకు మద్దతు ధర అడిగే కాంగ్రెస్ నేతలు బళ్లారిలో ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలి అని కాంగ్రెస్ నేతలను నిలదీశారు. కాంగ్రెస్ నేతలది ద్వంద్వనీతని మండిపడ్డారు. వారి నైజాన్ని రైతులు గుర్తించాలని, వారి మాయమాటలతో మోసపోకుండా ఆందోళన నుంచి బయటపడాలని సూచించారు. 50 వేల ఎకరాల్లో సాగు చేసిన ఎర్రజొన్న పంటను మార్కెట్‌యార్డులలో ఆఖరిబస్తా.. ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. బళ్లారిలో రూ.1600 ధర ఉంటే ఇక్కడ రూ.2300కు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. దేశంలో పండించే ప్రతి పంటకు మద్దతు ధర కల్పించాలనేది టీఆర్‌ఎస్ విధానమన్నారు. ఇదే విషయాన్ని పార్లమెంటు వేదికగా కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. ఎర్రజొన్నల నిల్వకు కోల్డ్ స్టోరేజీ కావాలని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఎంపీ కవిత చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.2300 చొప్పున సోమవారం నుంచి ఎర్రజొన్నలను కొనుగోలుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు నిజామాబాద్ ప్రజాప్రతినిధులు, రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కేంద్రప్రభుత్వం వెంటనే దేశంలో రైతులు పండించే పంటలన్నింటికీ మద్దతు ధర ప్రకటించాలని ఎంపీ కవిత డిమాండ్ చేశారు.

పాత పద్ధతిలోనే ఉపాధ్యాయులకు సెలవులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రాథమిక, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు పాత పద్ధతిలోనే సెలవులు వాడుకొనేలా ఆదేశాలిస్తామని పాఠశాల విద్యా సంచాలకుడు కిషన్ హామీ ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పీ సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.



జీజీహెచ్‌లో సెల్‌ఫోన్ వెలుతురులో ప్లాస్టిక్ సర్జరీ చేస్తున్న వైద్యులు

సెల్‌ఫోన్ వెలుతురులో ప్లాస్టిక్ సర్జరీ

■ గుంటూరు దవాఖానలో వైద్యుల నిర్వాకం

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రభుత్వదవాఖానలో వైద్యుల నిర్లక్ష్యం మరోసారి వెలుగుచూసింది. ఆపరేషన్ థియేటర్‌లో ట్యూబ్‌లైట్లు పనిచేయకపోవడంతో సెల్‌ఫోన్ వెలుతురులో ఓ రోగికి వైద్యులు ఆపరేషన్ చేసిన ఘటన గురువారం బయటపడింది. ఒక డాక్టర్ సెల్‌ఫోన్‌లైట్ చూపిస్తుండగా, మిగతా వైద్యులు ప్లాస్టిక్ సర్జరీ చేసిన ఘటన సర్వత్రా విమర్శలకు తావిస్తున్నది. జీజీహెచ్‌లో పాడైపోయిన విద్యుత్, వైద్య పరికరాలను సకాలంలో మరమ్మతు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నది. విద్యుత్‌సరఫరాలో అంతరాయం వల్లే ఇలా జరిగిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజునాయుడు చెప్పుకొచ్చారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. గుంటూరు ప్రభుత్వదవాఖాన సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా ఆందోళనకు దిగారు.



నాబార్డ్ జీఎం నారాయణరావు నేతృత్వంలోని అధికారుల బృందంతో గురువారం హైదరాబాద్‌లో సమావేశమైన వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, టీస్‌కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణపై నాబార్డు ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయసహకార కేంద్రాల కంప్యూటరీకరణ విధానాన్ని నాబార్డ్ ప్రశంసించింది. గురువారం కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో పర్యటించిన నాబార్డ్ జీఎం నారాయణరావు నేతృత్వంలోని అధికారుల బృందం పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణను అధ్యయనం చేసింది. రాష్ట్రంలోని 798 సంఘాల్లో 700 సంఘాల కంప్యూటరీకరణ పూర్తయింది. విజయవంతంగా సాగుతున్న ఈ పథకాన్ని తొలిసారిగా తెలంగాణలోనే చేపట్టడం అభినందనీయమని నారాయణరావు అన్నారు. కరీంనగర్ జిల్లాలోని దుర్శేడ్, గట్టుదుద్దెనపల్లి, రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఉప్పరిగూడ పీఏసీఎస్‌లను బృందం సందర్శించింది. కంప్యూటరీకరణ ద్వారా రైతులకు పారదర్శకమైన సేవలు అందించడానికి వీలవుతుందని ప్రశంసించింది. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ విధానాన్ని కేంద్రానికి సిఫారసు చేస్తామని తెలిపింది. సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సహకారంతో పీఏసీఎస్‌లు బలోపేతానికి కృషిచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు, ఎండీ మురళీధర్, నాబార్డ్ జీఎం రత్నప్రసాద్, నాబార్డ్ మాజీ సీజీఎం మోహనయ్య, శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బయటపడ్డ పురుషోత్తంరెడ్డి మరో బ్యాంకు లాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం డైరెక్టర్ (సస్పెన్షన్) పురుషోత్తంరెడ్డి మరో బ్యాంక్ లాకర్‌ను ఏసీబీ అధికారులు గురువారం గుర్తించారు. ఈ లాకర్‌ను శుక్రవారం తెరుస్తామని ప్రకటించారు. ఈ నెల తొమ్మిదన ఏసీబీ అధికారులు అరెస్టుచేసిన పురుషోత్తంరెడ్డి ఇద్దరు బినామీలను నాలుగురోజుల విచారణ నిమిత్తం కోర్టు అనుమతించింది. తమను ఏసీబీ అధికారులు వేధిస్తున్నారని పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాసరెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఏసీబీ విచారణ, సోదాలకు సహకరించాలని కోర్టు అతడిని ఆదేశించినట్టు ఏసీబీ అధికారులు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు. మంచిరేవుల వద్ద సుమారు రూ.30 కోట్ల విలువ గల ఆస్తుల పత్రాలు పురుషోత్తంరెడ్డి బినామీలు యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టుచేశారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వీరిని వారంరోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలుచేయగా నాలుగురోజుల కస్టడీకి అనుమతిస్తూ గురువారం ఆదేశించింది. పురుషోత్తంరెడ్డి ఆస్తులు, బినామీల విషయంలో ఆరాతీస్తున్న ఏసీబీ అధికారుల దృష్టికి కొత్తగా మరో బ్యాంకు లాకర్ వచ్చింది. బోయిగూడలోని ఓ ప్రైవేటు బ్యాంకులో పురుషోత్తంరెడ్డి వియ్యపురాలు పేరుతో లాకర్ ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈ లాకర్‌ను శుక్రవారం పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. పురుషోత్తంరెడ్డి బినామీ, రియల్ ఎస్టేట్ వ్యాపారి యాదవరెడ్డిని రిమాండ్ కొరకు చంచల్‌గూడ జైలులో ములాఖత్ ద్వారా ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చర్య నియామకంగా మారింది.

అన్ని బోధన వైద్యశాలల్లో కంటి వైద్యం

ప్రతి జిల్లా దవాఖానలో ఆప్తాల్మాలజీ విభాగం: డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెరుగైన కంటి వైద్యం అందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశంతో హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి దవాఖానతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధన వైద్యశాలల్లో కంటి చికిత్సా విభాగాలను మరింత పటిష్టం చేసేందుకు అధునాతన పరికరాలను సమకూర్చుతున్నామని వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఎవరైనా కంటి సమస్యలకు గురైతే సరోజినీదేవి కంటి దవాఖానకే రావాల్సిన పరిస్థితి నెలకొన్నందున, దీన్ని అధిగమించేందుకు ప్రతి జిల్లా దవాఖానలో ఆప్తాల్మాలజీ విభాగాన్ని ఏర్పాటుచేయనున్నట్టు పేర్కొన్నారు. 'ఇంటి వద్దకే కంటి వైద్యం' పేరుతో ఇకనుంచి జిల్లా దవాఖానల ఆధ్వర్యంలోనూ ఈ శిబిరాలను నిర్వహించి కంటి పరీక్షలు చేస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో స్పెషల్ విజన్ సెంటర్లు, విజన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ప్రాథమికస్థాయి కంటి పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు.

బఫర్ గోదాముల్లో తనిఖీలు

■ పౌరసరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బఫర్ గోదాముల వద్ద రీసైక్లింగ్ బియ్యానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్టు పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. బఫర్ గోదాముల్లో మిల్లర్ల నుంచి రీసైక్లింగ్ బియ్యాన్ని అనుమతించకుండా ఉండేందుకు, గోదాముల నిల్వలపై తనిఖీలు జరుపడానికి తగిన బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాస్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటుచేశామని చెప్పారు. జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ (సాంకేతిక), ఎన్ఫోర్స్‌మెంట్, జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారులతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ బృందం మూడు నెలలకోసారి బఫర్ గోదాముల్లో ప్రతి నెలా 1వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించి 15వ తేదీలోగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి నివేదికలు అందజేస్తుందన్నారు. బృందాలను నెలవారీగా ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు మారుస్తూ ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు జారీచేస్తామని తెలిపారు. బఫర్ గోదాముల్లో తేమ, దొంగతనం ఇతర కారణాల వల్ల జరిగే నష్టాలను ఈ బృందాలు కలెక్టర్ సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలిస్తారని చెప్పారు. నివేదికల ఆధారంగా గోదాముల్లో నిల్వలను క్రమబద్ధీకరించనున్నట్టు తెలిపారు. నివేదికల ఆధారంగానే స్టోరేజ్ లాసెస్ (తరుగుదల) మీద నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

26లోగా ఎస్సెస్సీ అంతర్గత మార్కుల జాబితా పంపించండి

ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదోతరగతి రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థుల అంతర్గత మార్కుల జాబితాను ఈ నెల 26లోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ గురువారం సూచించారు. ఈ ప్రక్రియ ఈ నెల 12 నుంచి మొదలైందన్నారు. సూచించిన ఫార్మాట్‌లో www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో 2018 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థుల మార్కుల జాబితాను పంపించాలని కోరారు.

'తెల్గీ స్కామ్' నిందితులకు రిమాండ్

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: తెల్గీ స్టాంపుల కుంభకోణంలో నిందితులుగా ఉండి, వాయిదాల ప్రకారం కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ముగ్గుర్ని సీబీఐ అధికారులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో వారిని చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ స్కాంలో సాదిక్ ఇబ్రహీం, ఎలియాస్ మహ్మద్, ముజామ్మిల్ మహ్మద్ నిందితులుగా ఉన్నారు. వీరికి సీబీఐ ప్రత్యేక కోర్టు గతంలో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు విధించిన షరతుల ప్రకారం ఈ ముగ్గురూ పేషీలకు హాజరు కావడంలేదు. దాంతో ముగ్గురిపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ అయింది. ఈ ముగ్గురు వారంట్ రీకాల్ చేసుకునేందుకు హైదరాబాద్‌కు వస్తున్న విషయం తెలుసుకున్న సీబీఐ అధికారులు కోర్టు దగ్గర అదుపులోకి తీసుకొని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

ఎర్రజొన్న రైతుల సమస్య పరిష్కరించండి

కేంద్రమంత్రికి ఎంపీ దత్తాత్రేయ వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎర్రజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ఆహార, వినియోగదారులశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌కు బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన కేంద్రమంత్రిని కలిసి విన్నవించారు. రాష్ట్రంలో ఎర్రజొన్నల ఉత్పత్తి పెరిగినందున, సేకరణకు ఏర్పాట్లు చేయాలని, మద్దతు ధర కల్పించాలని కోరారు. తమ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని దత్తాత్రేయ వెల్లడించారు.





గురువారం ఈడీ సోదాలు..

ఢిల్లీ డిఫెన్స్ కాలనీలోని మోదీ జువెల్లరీ షోరూం

ఢిల్లీలోని చాణక్యపురిలో గల నీరవ్ మోదీ జువెల్లరీ షోరూం

ముంబైలో నీరవ్ కుటుంబం నివసిస్తున్న సముద్రమహల్



నీరవ్ మోదీపై ఈడీ కొరడా

పీఎన్‌బీ కుంభకోణం కేసులో రూ.5,100 కోట్ల బంగారు, వజ్రాభరణాలు జప్తు

ఇండ్లు, షోరూంలు, వ్యాపార కార్యాలయాల్లో విస్తృత సోదాలు ▪ పాస్‌పోర్టు రద్దు చేపించే దిశగా అడుగులు

ముంబై/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో ప్రధాన పాత్రధారు, సంపన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన రూ.5,000 కోట్లకుపైగా విలువైన బంగారు, వజ్రాభరణాలను జప్తు చేసింది. గురువారం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, గుజరాత్ తదితర ప్రాంతాల్లోని నీరవ్ మోదీ ఇండ్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో ఈడీ విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఇందులోభాగంగానే రూ.5,100 కోట్ల విలువైన వజ్రాభరణాలు, బంగారాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, సోదరుడు నిషాల్, వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సీలపై రూ.280 కోట్ల మోసానికి సంబంధించి బుధవారం ఈడీకి పీఎన్‌బీ ఫిర్యాదు చేసింది. అంతకుముందే ఈ కేసును పీఎన్‌బీ ఫిర్యాదుతో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కూడా విచారణ చేస్తుండగా, తాజాగా ఈడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసును నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ సోదాలు జరిగాయి. ముంబైలో నీరవ్ మోదీ, ఇతర నిందితులకు చెందిన ఐదు ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఉదయం నుంచే ఈ తనిఖీలు మొదలవగా, కనీసం పదిచోట్ల ఈడీ అధికారులు సోదాలు చేశారు. ముంబైలో కుర్లాలోని నీరవ్ మోదీ ఇల్లు, అలాగే బాంద్రా, లోయర్ పారెల్‌లోగల మూడు కార్యాలయాల్లో సోదాలు నిర్వహించామని అధికారులు వివరించారు. ఇంకా గుజరాత్‌లోని సూరత్‌లోగల మరో మూడుచోట్ల తనిఖీలు చేపట్టిన ఈడీ.. ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ, చాణక్యపురిల్లోగల నీరవ్ మోదీ షోరూంలలో సోదాలు చేసింది. ఈ సందర్భంగానే మొత్తం రూ.5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు, బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. మరోవైపు నీరవ్ మోదీ పాస్‌పోర్టును రద్దు చేయాలంటూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కోరాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ యోచిస్తున్నది.

జనవరిలోనే అంతా జంప్

పీఎన్‌బీ కుంభకోణంలో నీరవ్ మోదీసహా నిందితులంతా జనవరిలోనే దేశం విడిచి పారిపోయారు. రూ.280 కోట్ల మోసంపై గత నెల 29న సీబీఐకి పీఎన్‌బీ ఫిర్యాదు చేయగా, అంతకుముందే వీరంతా విదేశాలకు జారుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. జనవరి 1న నీరవ్ మోదీతోపాటు ఆయన సోదరుడు నిషాల్ విదేశాలకు వెళ్లిపోగా, భార్య అమీ, వ్యాపార భాగస్వామి, గీతాంజలి జువెల్లరీ భారతీయ ప్రమోటరైన మెహుల్ చోక్సీలు జనవరి 6న పరాయి దేశానికి పయనమయ్యారు. నిషాల్‌కు బెల్జియం పౌరసత్వం ఉండగా, అమీకి అమెరికా పౌరసత్వం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సీబీఐ వీరిపై లుకౌట్ నోటీసులు జారీ చేసింది. రూ.11,400 కోట్ల కుంభకోణంపైనా పీఎన్‌బీ సీబీఐని ఆశ్రయించడంతో ఒకే వ్యక్తిపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు సీబీఐ వద్దకు పీఎన్‌బీ వెళ్లినట్లైంది. కాగా, జనవరి 23న స్విట్జర్లాండ్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భారతీయ కార్పొరేట్ సీఈవోలంతా కలిసి దిగిన ఫొటోలో నీరవ్ మోదీ కూడా ఉండటం గమనార్హం. దీంతో ఆయన స్విట్జర్లాండ్‌లో ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

150 ఎల్‌వోయూలు

నీరవ్ మోదీకి పీఎన్‌బీ నుంచి మోసపూరితంగా 150 లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్‌వోయూ)లు జారీ అయ్యాయి. ఈ మొత్తం వివరాలను సీబీఐకి పీఎన్‌బీ అందించింది. ఈ మేరకు అధికారులు తెలిపారు. ఈ లేఖలతోనే రూ.11,400 కోట్ల కుంభకోణానికి నీరవ్ మోదీ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. తమ ఖాతాదారులకు చెల్లింపులు, లేదా రుణాలు మంజూరు చేయాలని విదేశీ బ్యాంకులకు భారతీయ బ్యాంకులు ఎల్‌వోయూల ద్వారానే తెలియజేస్తాయి.

నీరవ్ మోసాలకు ఇంటి దొంగల అండ

పీఎన్‌బీలో కుంభకోణం ఎలా జరిగిందంటే..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,400 కోట్ల భారీ కుంభకోణం ఇప్పుడు ఇతర బ్యాంకుల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులు, వ్యాపార భాగస్వాముల ప్రమేయంతో ముంబైలోని బ్రాడీ హౌస్ పీఎన్‌బీ శాఖలో జరిగిన ఈ కుంభకోణం దేశ బ్యాంకింగ్ రంగంలో జరిగిన అతిపెద్ద మోసాల్లో ఒకటిగా నిలిచింది. దీంతో ఈ వ్యవహారంలో నీరవ్ మోదీ, ఆయన బంధువులపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం దేశ వ్యాప్తంగా డజనుకుపైగా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది.
ముంబైలోని ఫౌంటెయిన్ పీఎన్‌బీ శాఖలో ఏడేళ్ల క్రితం (2011లో) నీరవ్ మోదీ లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌ఓయూ)ను ప్రారంభించి ఈ కుంభకోణానికి శ్రీకారం చుట్టాడు. ఖాతాదారులకు బ్యాంకు ఇచ్చే గ్యారంటీనే లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ అంటారు. రుణంగా తీసుకున్న మొత్తంతో పాటు దానిపై వడ్డీని ఎటువంటి షరతులు లేకుండా తిరిగి చెల్లించేందుకు అంగీకరించే ఖాతాదారుల కోసం బ్యాంకులు ఎల్‌ఓయూను తెరుస్తాయి. ఇటువంటి ఖాతాదారుల్లో దిగుమతిదారులు కూడా ఉండవచ్చు. ఎల్‌ఓయూ ద్వారా సదరు బ్యాంకు హామీ ఇచ్చిన రుణ మొత్తాన్ని లేదా రుణ పరిమితి మొత్తాన్ని మరో భారత బ్యాంకులో ఉపయోగించి చౌకగా విదేశీ కరెన్సీ రుణాలను పొందేందుకు వీలుంటుంది. ఈ ఎల్‌ఓయూలను ఆసరాగా చేసుకునే నీరవ్ మోదీ ఈ భారీ కుంభకోణానికి పాల్పడ్డాడని, ఈ విషయంలో పీఎన్‌బీ డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ షెట్టి స్విఫ్ట్ మెసేజింగ్ సిస్టమ్ (ఎల్‌ఓయూల రూపంలో ఖాతాదారులకు ఇచ్చిన హామీలను ధ్రువీకరించేందుకు విదేశీ లావాదేవీల్లో బ్యాంకులు ఉపయోగించే వ్యవస్థ)ను ఉపయోగించి నీరవ్ మోదీకి సహకరించాడని తెలుస్తున్నది. ఈ ఎల్‌ఓయూలను ఆధారంగా చేసుకుని విదేశాల్లోని వివిధ భారత బ్యాంకులు నీరవ్ మోదీకి రుణాలను అందజేయడంతో ఇప్పుడు ఈ కుంభకోణం వలన వాటికి కూడా నష్టం వాటిల్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించి పీఎన్‌బీ ఇప్పటివరకూ 10 మంది ఉద్యోలను సస్పెండ్ చేయడంతో పాటు ఈ కేసును సీబీఐ, ఈడీలకు అప్పగించింది.

ప్రభుత్వ బ్యాంకుల్లో కుంభకోణాలు మామూలే..

ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో ఇటువంటి కుంభకోణాలు జరగడం కొత్తేమీ కాదు. 2013-14 నుంచి ఇటువంటి కేసులు తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. ఆ ఏడాది ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.7,542 కోట్ల మోసాలకు సంబంధించిన 2,593 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలోని తొలి తొమ్మిది నెలల్లోనే 2,100కు పైగా కేసుల్లో రూ.11,022 కోట్ల మోసాలు జరిగాయని, వీటిలో కూడా ఎక్కువ కేసులు పీఎన్‌బీలోనే జరిగాయని పీఎస్‌బీలు వెల్లడించాయి. అప్పట్లోనే పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.2,036 కోట్లకు సంబంధించిన 123 వెలుగులోకి రాగా, రూ.1,783 కోట్ల మోసాలకు సంబంధించిన 147 కేసులతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వితీయ స్థానంలో నిలిచింది. అప్పట్లో ఈ బ్యాంకులతో పోలిస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అత్యధికంగా 474 కేసులు నమోదైనప్పటికీ వాటి వల్ల జరిగిన నష్టం (రూ.1,327 కోట్లు) తక్కువగా ఉన్నది. ఈ జాబితాలో ఈ మూడు బ్యాంకుల తర్వాత సిండికేట్ బ్యాంక్ (114 కేసుల్లో రూ.749 కోట్ల మోసాలు), ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (86 కేసుల్లో రూ.719 కోట్ల మోసాలు) ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

హాలీవుడ్‌కి నీరవ్ తళుకులు

సెలబ్రిటీలకే స్టార్ ఎట్రాక్షన్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.11,400 కోట్లకు మోసగించి దేశం నుంచి జారుకున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ (48) చాలా ఆలస్యంగా 2010లో రిటైల్ వ్యాపారంలోకి ప్రవేశించినప్పటికీ అనతి కాలంలోనే అంతర్జాతీయంగా ఎంతో ఖ్యాతిని పొందాడు. కేట్ విన్స్‌లెట్, డకోటా జాన్సన్ మొదలుకొని తరాజీ పీ హెన్సన్ లాంటి ఎంతో మంది హాలీవుడ్ స్టార్లు, సెలబ్రిటీలు నీరవ్ మోదీ బ్రాండ్ వజ్రాలను ధరించి రెడ్ కార్పెట్‌పై హొయలొలికించిన వారే కావడం గమనార్హం. 2013లోనే ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో చోటు దక్కించుకున్న నీరవ్ మోదీ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింతగా విస్తరించుకునేందుకు గతేడాది బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రాను బ్రాండ్ అంబాసిడర్ (వ్యాపార ప్రచారకర్త)గా నియమించుకున్నాడు. దీనితో పాటు నీరవ్ మోదీ పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) టీమ్ తమ బాస్‌కు ప్రచార మాధ్యమాల్లో నిరంతరం తగిన చోటు లభించేలా చూడటంతో ఆయన వ్యాపార సామ్రాజ్యం మరింత వృద్ధి చెంది ఎన్నో దేశాలకు విస్తరించింది. నిన్న మొన్నటి వరకూ భార్య అమీ (పీఎన్‌బీ కుంభకోణంలో సహ నిందితురాలు), ముగ్గురు పిల్లలతో కలసి ముంబైలో నివసించిన నీరవ్ మోదీ 173 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11 వేల కోట్ల) నికర సంపదతో దేశంలోని శ్రీమంతుల జాబితాలో 85వ స్థానంలోనూ, ప్రపంచ సంపన్నుల జాబితాలో 1,234వ స్థానంలోనూ నిలిచాడు. అయితే ఇప్పుడు నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణానికి పాల్పడినట్లు వెలుగులోకి రావడంతో ఒక్కసారిగా ఆయన ప్రతిష్ఠ దిగజారడంతో పాటు వేలాది కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యం పతనమవుతున్నది.



న్యూయార్క్‌లో నీరవ్ షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖ మోడల్ కోకో రోచా, నటి నిమ్రత్ కౌర్, ఆస్కార్ అవార్డు విజేత నవోమి వాట్స్, బాలీవుడ్ స్టార్ లీసా హైడన్



నీరవ్ వ్యాపార సామ్రాజ్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంకా చోప్రా

ఎవ్వరీ్ని వదలం

దోచుకున్న సొమ్మును కక్కిస్తాం

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:

దేశీయ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంకైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం.. భారతీయ ఆర్థిక వ్యవస్థలోనే ప్రకంపనలు సృష్టిస్తుండగా, ఈ కేసులో ఎవ్వరీ్ని విడిచిపెట్టబోమని, ఎట్టి పరిస్థితుల్లోనూ దోషులు తప్పించుకోలేరని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దోచుకున్న సొమ్మును తిరిగి రాబడుతామన్నది. గురువారం ఇక్కడ ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ విలేఖరులతో మాట్లాడుతూ.. ఈ కుంభకోణం నేపథ్యంలో బ్యాంక్ కార్యకలాపాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. బ్యాంక్ వద్ద తగినన్ని నిల్వలున్నాయని చెప్పారు. కాగా, ఈ కేసు పీఎన్‌బీలోని ఒక్క శాఖకే చెందినదన్న ఆయన ఇతర బ్యాంకులనూ ఈ కేసు విషయంలో అప్రమత్తం చేశామని తెలిపారు. తప్పుచేసినవారిపై కఠిన చర్యలను తీసుకుంటామన్నారు. ఏరోజుకారోజు విచారణ వివరాలను పరిశీలిస్తున్నామన్నారు.

వీలున్న అన్ని చర్యలు చేపడుతాం: సీఎండీ
బ్యాంక్ పరువును బజారుకీడ్చిన భారీ కుంభకోణంలో పాలుపంచుకున్న వారందరిపైనా వీలున్న అన్ని చర్యలు చేపడుతామని పీఎన్‌బీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సునీల్ మెహతా అన్నారు. అవకతవకలకు పాల్పడినవారిపై అన్ని రకాల చర్యలనూ తీసుకుంటామని ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. గడిచిన 123 ఏండ్లలో ఎన్నో ఒడిదుడుకులను చూశామన్న ఆయన ఈ కుంభకోణం నేపథ్యంలో ఇతర అన్ని బ్యాంకుల ప్రయోజనాలను కాపాడేందుకే ప్రయత్నిస్తున్నామన్నారు. మచ్చలేని బ్యాంకింగ్ వ్యవస్థకు పీఎన్‌బీ కట్టుబడి ఉన్నదని, అందుకే ఈ కుంభకోణాన్ని తామే బయటపెట్టినట్లు చెప్పారు. స్వచ్ఛంధంగా వివిధ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఈ వివరాలనూ అందించామన్నారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రధాన పాత్ర పోషించిన ఈ రూ.11,400 కోట్ల (1.77 బిలియన్ డాలర్లు) కుంభకోణానికి 2011లోనే బీజం పడగా, ఇందులో డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి ఉన్నతోద్యోగులు భాగస్వాములైనట్లు ఇప్పటికే పీఎన్‌బీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇతర భారతీయ బ్యాంకుల ద్వారా విదేశీ రుణం పొందడానికి ముంబైలోని తమ శాఖ నుంచి మోసపూరితంగా లేఖ (ఎల్‌వోయూ)లను నీరవ్ మోదీ అందుకున్నారని, దీనికి సిబ్బంది సాయం చేశారని పీఎన్‌బీ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇప్పటికే 10 మంది ఉద్యోగులను విధుల నుంచి తప్పించినట్లు ప్రకటించిన బ్యాంకు.. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి కూడా అప్పగించింది.



రాజీవ్ కుమార్

నీరవ్ మోదీ నుంచి అస్పష్టమైన ఆఫర్లు
మరోవైపు కుంభకోణం సొమ్మును తిరిగి చెల్లించడానికి నీరవ్ మోదీ నుంచి కొన్ని అస్పష్టమైన ఆఫర్లు వస్తున్నాయని బ్యాంక్ సీఎండీ సునీల్ మెహతా తెలిపారు. ఇప్పటికే రూ.280 కోట్ల మోసం కేసును పీఎన్‌బీ నుంచి ఎదుర్కొంటున్న నీరవ్ మోదీ.. ఇప్పుడు ఏకంగా రూ.11,400 కోట్ల స్కామ్‌కు మూలపురుషుడని తెలియడంతో పీఎన్‌బీ ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సీబీఐ, ఈడీసహా పలు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయగా, విచారణలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఇప్పటిదాకా కాజేసిన నగదును చెల్లించడానికి ఓ నిర్దిష్ట ప్రణాళికతో ముందుకురాని నీరవ్ మోదీ నుంచి తాజాగా పలు అస్పష్టమైన ఆఫర్లు వస్తున్నాయని మెహతా గురువారం విలేఖరులకు చెప్పారు. వాటిని పరిశీలిస్తున్నామనీ అన్నారు. అయితే నీరవ్ మోదీ వ్యక్తిగతంగా బ్యాంకుకు రాలేదన్న ఆయన డబ్బులు ఎలా చెల్లిస్తారనే దానిపై తమకు లిఖితపూర్వకంగా ఓ ప్రణాళికను స్వయంగా ఇస్తే మంచిదని మీడియా ముఖంగా నీరవ్ మోదీకి సూచించారు. గత వారం నీరవ్ నుంచి ఓ సందేశం వచ్చినట్లు తెలిపారు.

మెహుల్ చోక్సీ, గీతాంజలిపై సెబీ దృష్టి
మరోవైపు పీఎన్‌బీ కుంభకోణం కేసుతో ప్రమేయమున్న మెహుల్ చోక్సీ, ఆయన ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్న గీతాంజలి జ్యుయెల్లర్స్‌పై సెబీ, దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు దృష్టి సారించాయి. నీరవ్ మోదీ బంధువు, ఆయన సన్నిహితుడైన చోక్సీ కదలికలపై ఆరా తీస్తున్నాయి. ఈ కుంభకోణం నేపథ్యంలో మరికొన్నింటిపైనా సెబీ కన్నేసింది. వీటిలో పలు ప్రముఖ జ్యుయెల్లరీ సంస్థలున్నాయి.

భగ్గుమన్న పసిడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పెరుగడంతోపాటు దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో ధరలు ఎగువముఖం పట్టాయి. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.350 పెరిగి రూ.31,650కి చేరుకుంది. పసిడితోపాటు వెండి మరింత ప్రియమయ్యాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు కొనుగోళ్లకు మద్దతు పలుకడంతో కిలో వెండి ధర ఏకంగా రూ.720 ఎగబాకి రూ.39,970 వద్ద ముగిసింది. డాలర్ బలహీనపడటం, దేశీయంగా డిమాండ్ ఊపందుకోవడం ధరలు పెరుగడానికి దోహదపడినట్లు బులియన్ ట్రేడర్ వెల్లడించారు. సింగపూర్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర స్వల్పంగా పెరిగి 1,353.90 డాలర్లకు చేరుకోగా, వెండి 16.92 డాలర్ల వద్ద నిలిచింది.

అన్ని నాణేలనూ స్వీకరించాల్సిందే: ఆర్బీఐ

ముంబై, ఫిబ్రవరి 15: ప్రజల నుంచి బ్యాంకులు అన్ని ముఖ విలువలు కలిగిన కరెన్సీ నాణేలనూ స్వీకరించి తీరాలని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గురువారం స్పష్టం చేసింది. ఈ విషయంలో మొండిగా వ్యవహరించే బ్యాంకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. తక్కువ ముఖ విలువ కలిగిన ఏ కరెన్సీ నోట్లను లేదా నాణేలను తిరస్కరించడానికి వీల్లేదని బ్యాంకులకు ఎన్నోసార్లు స్పష్టం చేసినప్పటికీ ఈ విషయమై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉండటంతో రిజర్వు బ్యాంకు ఈ ఆదేశాలను జారీ చేసింది.

ఎగుమతుల్లో సింగిల్ డిజిట్ వృద్ధి

జనవరిలో 9 శాతానికి పరిమితం.. మూడేండ్ల గరిష్ఠానికి లోటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశీయ ఎగుమతుల్లో వృద్ధి సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. ఈ ఏడాది తొలి నెలకుగాను ఎగుమతుల్లో వృద్ధి 9 శాతం పెరిగి 2438 కోట్ల డాలర్లకు చేరుకున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కెమికల్స్, ఇంజినీరింగ్ గూడ్స్, పెట్రోలియం ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ నెలకొనడంతో ఈ మాత్రమైన వృద్ధి నమోదైంది. అయినప్పటికీ వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) మూడేండ్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఇదే సమయంలో దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 26.1 శాతం పెరిగి 4086 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. దీంతో వాణిజ్యలోటు 1630 కోట్లు డాలర్లుగా నమోదైంది. క్రూడాయిల్ దిగుమతి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం వల్లనే దిగుమతి పెరుగడానికి ప్రధాన కారణమని వాణిజ్య శాఖ విశ్లేషించింది. నవంబర్ 2014లో లోటు 1686 కోట్ల డాలర్లుగా నమోదైంది. గతేడాది ఇదే నెలలో వాణిజ్య లోటు 990 కోట్ల డాలర్లుగా ఉన్నది. గడిచిన నెల విషయానికి వస్తే కెమికల్స్ ఎగుమతుల్లో 33 శాతం వృద్ధిని కనబరుచగా, ఇంజినీరింగ్ గూడ్స్‌లో 15.77 శాతం, పెట్రోలియం ఉత్పత్తులు 39.5 శాతం చొప్పున పెరుగుదల కనిపించింది. కానీ, వస్త్ర ఎగుమతులు 8.38 శాతం తగ్గి 139 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. కొన్ని నెలలుగా పెరుగుతున్న బంగారం దిగుమతులు జనవరిలో 22 శాతం తగ్గి 159 కోట్ల డాలర్లకు జారుకున్నాయి. చమురు దిగుమతులు 42,64 శాతం ఎగబాకి 1165 కోట్ల డాలర్లకు, చమురేతర ఉత్పత్తుల దిగుమతులు 20.49 శాతం వృద్ధి చెంది 2900 కోట్ల డాలర్లకు చేరాయి.

ఇండియన్ బ్యాంక్ గృహరుణ రేటు 8.25 %

హైదరాబాద్, ఫిబ్రవరి 15: ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్..గృహరుణాలపై విధించే వడ్డీరేటును 8.25 శాతానికి తగ్గించింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో ఇస్తున్న వడ్డీరేట్లతో పోలిస్తే ఇదే తక్కువదని బ్యాంక్ వర్గాలు వెల్లడించారు. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో 30 ఏండ్ల లోపు కాలపరిమితి కలిగిన లక్ష రూపాయల రుణంపై నెలకు రూ.751 చొప్పున వసూలు చేయనున్నది. ఈ సందర్భంగా బ్యాంక్ జోనల్ మేనేజర్ ఆర్ మనోహర్ మాట్లాడుతూ..గృహ రుణాలపై వడ్డీరేట్లను తగ్గించడంతోపాటు ప్రాసెసింగ్, తిరిగి చెల్లింపులపై విధించే చార్జీలను సైతం ఎత్తివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జంటనగరాల్లో బ్యాం కుకు ఉన్న శాఖల్లో కేవలం 24 గంటల్లోనే గృహ రుణాన్ని పొందవచ్చునని చెప్పారు.

రెండు రోజుల్లో 8 వేల కోట్లు

పీఎన్‌బీ నష్టపోయిన మార్కెట్ విలువ

ముంబై, ఫిబ్రవరి 15: భారీ కుంభకోణానికి వేదికైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మార్కెట్ విలువ గడిచిన రెండు రోజుల్లో రూ.8 వేల కోట్లకుపైగా హారతి కర్పూరంలా కరిగిపోయింది. బ్యాంకుకు వచ్చిన వార్షిక లాభం కంటే ఇది ఆరు రెట్లుకు సరిసమానం. వరుసగా రెండోరోజు పీఎన్‌బీ షేరు ధర 12 శాతం తగ్గి రూ.128.35 వద్ద ముగిసింది. బుధవారం బ్యాంక్ షేరు 10 శాతం పడిపోయిన విషయం తెలిసిందే. మొత్తంమీద గడిచిన రెండు రోజుల్లో బ్యాంక్ షేరు 20 శాతానికి పైగా పతనం చెందినట్లు అయింది. దీంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.8,076.59 కోట్లు తగ్గి రూ.31,132.41 కోట్లకు చేరుకుంది. 2016-17 ఆర్థిక సంవత్సరానికి నమోదైన రూ.1,324 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది ఆరు రెట్లు ఎక్కువ. అలాగే బ్యాంకులో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణం సంస్థ లాభం కంటే ఎనిమిది రెట్లు అధికం. బ్యాంకు అనుబంధ సంస్థయైన పీఎన్‌బీ హౌజింగ్ ఫైనాన్స్ షేరు కూడా 4.30 శాతం తగ్గి రూ.1,199 వద్ద ముగిసింది.

గీతాంజలి షేర్లు ఢమాల్
ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ గీతాంజలి జెమ్స్ షేర్లు భారీగా పతనం చెందాయి. పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణానికి గీతాంజలి జెమ్స్‌కు సంబంధమున్నట్లు వార్తలురావడంతో కంపెనీకి చెందిన కార్యాలయాలు, దుకాణాలపై సీబీఐ గురువారం దాడులు చేసింది. ఈ నేపథ్యంలో కంపెనీ షేరు ధర ఏకంగా 20 శాతానికి పైగా పడిపోయింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.139.69 కోట్లు తగ్గి రూ.556 కోట్లకు జారుకున్నది. రూ.48 వద్ద ప్రారంభమైన కంపెనీ షేరు ధర ఇంట్రాడేలో రూ.46.90కి తగ్గి 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకింది. గడిచిన నెల రోజుల్లో షేరు ధర 42.20 శాతం పడిపోయినట్లు అయింది. వీటితోపాటు పీసీ జ్యూవెల్లరీ 5.31 శాతం, టీబీజెడ్ 2.64 శాతం, తంగమయిలి జ్యూవెల్లరీ 5 శాతం, రాజేష్ ఎక్స్‌పోర్ట్ 2.10 శాతం పతనమయ్యాయి.



వైభవంగా రథోత్సవం

దుర్గమ్మ నామస్మరణతో మెదక్ జిల్లాలోని ఏడుపాయల గుట్టలు మార్మోగాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం రాత్రి రథోత్సవం కనుల పండువగా జరిగింది. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది భక్తులు ఈ వేడుకను తిలకించారు. ఈ ఉత్సవంలో డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఈవో వెంకట కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

– మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/పాపన్నపేట



సూర్యాపేట మున్సిపాలిటీకి

మరో అవార్డు

సూర్యాపేట మున్సిపాలిటీకి మరో కీర్తి దక్కింది. 'ఐఎస్‌ఓ 9001-2015 అవార్డు'ను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికా ప్రకాశ్‌కు అందజేశారు.

- సూర్యాపేట అర్బన్



భూపాలపల్లి జిల్లా రాంపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు

- శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి

భూపాలపల్లి రూరల్ : గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల ప్రజల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు ప్రసరిస్తున్నాయని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాంపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేసి, మాట్లాడారు. నాడు దూర ప్రాంతాలకు వెళ్లడానికి కనీసం బస్సు సౌకర్యం లేని అటవీ గ్రామాల ప్రజలు, నేడు టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారని తెలిపారు.

యాదాద్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ప్రభుత్వ విప్ సునీతారెడ్డి ఆదేశం



యాదాద్రి కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సునీతారెడ్డి

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ: ఈనెల 17నుంచి 27వరకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం యాదాద్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ అనితారామచంద్రన్, యాదాద్రి ఈఓ గీతతో కలిసి బ్రహ్మోత్సవాలపై సమీక్షించారు. 24న బాలాలయంలో జరిగే కల్యాణోత్సవానికి సీఎం కేసీఆర్ హాజరయ్యే అవకాశమున్నదని, గవర్నర్ నరసింహన్ అదేరోజు సాయంత్రం స్వామిని దర్శించుకోనున్నట్టు చెప్పారు.

ఎంపీ కవిత సంకల్పంతోనే నిత్యాన్నదానం

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా



నిజామాబాద్ జిల్లా కేంద్ర దవాఖానలో నిత్యాన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, మేయర్ సుజాత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్ర దవాఖానలో ఎంపీ కల్వకుంట్ల కవిత సహకారంతో నిత్యాన్నదానం విజయవంతంగా కొనసాగడం సంతోషంగా ఉన్నదని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. ఎంపీ కవిత సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం వంద రోజుల పూర్తయిన సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ కవిత సంకల్పంతోనే ఈ మహా కార్యం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు, తండాల అభివృద్ధే లక్ష్యం



నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

బిజినేపల్లి: గ్రామాలు, తండాల అభివృద్ధే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తండాలు, గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. టీఆర్‌ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు.

డ్రగ్ కల్చర్ పెరిగింది

- జైలు వారోత్సవాల్లో సినీ నటుడు రాజా



సంగారెడ్డి జైలు మ్యూజియాన్ని సందర్శించిన సినీ నటులు రాజా, సూర్య

సంగారెడ్డి టౌన్ : రోజురోజుకూ డ్రగ్ కల్చర్ పెరిగిపోతున్నదని సినీనటులు రాజా, సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సంగారెడ్డిలోని జైలు మ్యూజియంలో నిర్వహించిన వారోత్సవాల్లో పాల్గొన్నారు. జైలును పరిశీలించి, విద్యార్థులతో కలిసి సందడి చేశారు. 'ఫీల్ ద జైలు' ఎంతో బాగున్నదన్నారు.

గులాబీ పార్టీలో చేరికల జోష్



మహబూబ్‌నగర్ జిల్లా తిర్మలగిరిలో టీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలతో మంత్రి లక్ష్మారెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా బొందుగులలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న విప్ సునీతామహేందర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:

గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. గురువారం కూడా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల నాయకులు భారీగా చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిర్మలగిరికి చెందిన 50 మంది కాంగ్రెస్, టీడీపీ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరగా, మంత్రి లక్ష్మారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాంగ్రెస్‌కు చెందిన ఊడ్గులకుంటతండా వాసులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బొందుగులలో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపనకుంట గ్రామంలో సుమారు 50 కుటుంబాలకు చెందిన వంద మంది పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసంలో నార్నూర్ మండలం ఉమ్రి సర్పంచ్ రాథోడ్ రవితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు.



నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లిలో టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

ఆనవాయితీ కొనసాగేనా..?

కోల్ ఇండియా చైర్మన్లుగా సింగరేణి బాస్‌లు • గతంలో నర్సింగరావు, భట్టాచార్య సేవలు

నేటి ఇంటర్వ్యూకు హాజరుకానున్న సింగరేణి సీఎండీ శ్రీధర్



నడిమెట్ల శ్రీధర్, సింగరేణి సీఎండీ

మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కోల్ ఇండియా చైర్మన్‌గా ఎవరు ఎంపిక అవుతారనే విషయం ఆసక్తిగా మారింది. శుక్రవారం ఆ పదవికి సంబంధించి ఇంటర్వ్యూలు జరుగనున్న నేపథ్యంలో అందరి దృష్టి దానిపైనే పడింది. మొత్తం 20మంది అధికారులు హాజరవుతుండగా, అందులో ఐదుగురు ఐఏఎస్ అధికారులున్నారు. ఇందులో తెలంగాణ తరపున సింగరేణి సంస్థ సీఎండీ శ్రీధర్ హాజరవుతున్నారు. కోల్ ఇండియా చైర్మన్‌గా వరుసగా సింగరేణి సీఎండీలే ఎంపికై రికార్డు సాధించారు. ప్రస్తుతం సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ నర్సింగరావు సింగరేణి సీఎండీగా పనిచేసి 2012లో కోల్‌ఇండియా చైర్మన్‌గా వెళ్లారు. నర్సింగరావు కోల్ ఇండియా చైర్మన్‌గా వెళ్లిన సందర్భంలో సింగరేణి సీఎండీగా నియమితులైన ఐఏఎస్ అధికారి సుతీర్థ భట్టాచార్య 2015లో కోల్‌ఇండియా చైర్మన్‌గా ఎంపికయ్యారు. సుతీర్థ భట్టాచార్య రిటైరైన తర్వాత ఆ పదవి ఖాళీగా ఉంది. దాని కోసం జరుగుతున్న ఇంటర్వ్యూలో తిరిగి సింగరేణి ప్రస్తుత సీఎండీ శ్రీధర్‌కు చాన్స్ దక్కే అవకాశం ఉంది. శుక్రవారం నాటి ఇంటర్వ్యూలో శ్రీధర్ ఎంపికైతే సింగరేణి సరికొత్త రికార్డు నమోదు చేయనుంది.


రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం



బాబు, చందు(ఫైల్)

కొండపాక: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్లలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిరిసినగండ్లకు చెందిన కడారి బాబు(40), చందు(32) అన్నదమ్ములు కోనాయిపల్లిలోని బంధువు ఇంట్లో కార్యక్రమానికి వెళ్లి, తిరిగి బుధవారం రాత్రి బైక్‌పై వస్తుండగా, కొండపాక మధిర గ్రామం దమక్కపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి సిద్దిపేటకు తరలించారు. చికిత్స పొందుతూ చందు మృతి చెందగా, బాబును సికింద్రాబాద్‌లోని గాంధీ కన్నుమూశాడు.

ఏసీబీకి చిక్కిన పీఆర్ డీఈఈ



నిందితుడు చంద్రప్రకాశ్

చేర్యాల, నమస్తే తెలంగాణ: సబ్ కాంట్రాక్టర్ రహమాన్ నుంచి రోడ్డు నిర్మాణ పనుల బిల్లు మంజూరు కోసం రూ.85 వేలు లంచం తీసుకుంటూ సిద్దిపేట జిల్లా చేర్యాల సబ్ డివిజన్ పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ కూరపాటి చంద్రప్రకాశ్ గురువారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. సదరు మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు డీఈఈని అదుపులోకి ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ ప్రతాప్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి అతడిని హైదరాబాద్ ఏసీబీ కోర్టుకు తరలించారు.

డబ్బులు దొంగిలించారని..

- విద్యార్థులతో పసుపుబియ్యం పట్టించిన ఉపాధ్యాయురాలు



రజిత

గొల్లపల్లి : తన పర్సు నుంచి రూ.200 దొంగిలించారని ఓ ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పసుపు బియ్యం తినిపించింది. విషయం తెలిసి తల్లిదండ్రులు, గురువారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయురాలిని నిలదీశారు. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాపల్లి ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు రజిత పర్సులోంచి ఈ నెల 5న రూ.200పోయాయి. మరుసటి రోజు మధ్యాహ్న భోజన ఆయా సాయంతో 6 నుంచి 9వ తరగతులకు చెందిన 12మంది విద్యార్థులు పసుపు బియ్యం తినిపించింది. అవి తినకపోతే తన డబ్బు తిన్నట్లేననీ, డబ్బు తీసిన వారు ఇవ్వకుంటే నెత్తురు కక్కి చనిపోతారని బెదిరించింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాలకు వచ్చి, ఉపాధ్యాయురాలు రజితను నిలదీశారు.

సంత్ సేవాలాల్ బాటలో నడువాలి

- మహరాజ్ జయంతి వేడుకల్లో వక్తల పిలుపు
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు



వికారాబాద్ జిల్లా తాండూరులో సేవాలాల్ జయంతి వేడుకలో పాల్గొన్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కలెక్టర్ ఓమర్ జలీల్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: లంబాడాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం ఊరూరా ఘనంగా నిర్వహించారు. శ్రీ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మ న్లు, కలెక్టర్లు, అధికారులు, అనధికారులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు పాల్గొని మహరాజ్ సేవలను కొనియాడారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్, నవాబుపేట మండలాల్లో సేవాలాల్ జయంతి వేడుకల్లో వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహనీయుడని, ఆయన చూపిన మార్గంలో నడువాలని మంత్రి సూచించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఓమర్ జలీల్‌తో కలిసి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తండాలను పంచాయతీలుగా మారుస్తున్నట్టు ప్రకటించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని కేవలం తెలంగాణలోనే అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. మనల్ని చూసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఈ ఏడాది నుంచి అధికారికంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, వరంగల్ రూరల్ నర్సంపేటలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, వనపర్తిలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టిస్ట్ శ్రీనివాస్‌కు సేవాలాల్ పురస్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆర్టిస్ట్, ఫొటోగ్రాఫర్ రామావత్ శ్రీనివాస్‌కు సంత్‌సేవాలాల్ పురస్కారం లభించింది. గురువారం రవీంద్రభారతిలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకొన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన శ్రీనివాస్ గిరిజన జీవనశైలిని ఇతివృత్తంగా తీసుకొని చిత్రాలు గీస్తున్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మంత్రి నాయిని. చిత్రంలో ఎమ్మెల్సీ రాములు నాయక్

200 కిలోల గంజాయి పట్టివేత

మనూరు : సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి చౌరస్తా వద్ద 200కిలోల ఎండు గంజాయిని నారాయణఖేడ్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా వెనక్కి వెళ్తున్న కారు(ఏపీ 28సీసీ 8212)ను ఆపారు. దానిని తనిఖీ చేయగా, రెండు కిలోల చొప్పున 100ప్యాకెట్లు అందులో పట్టుబడ్డాయి. కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దాని విలువ సుమారు రూ.10లక్షల దాకా ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ఎర్రజొన్న రైతుల సంబురాలు

నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ : రాష్ట్ర సర్కారు క్వింటాల్ ఎర్రజొన్నలకు రూ.2300 ధర ప్రకటించడంపై నిజామాబాద్ జిల్లాలో రైతులు సంబురాలు చేసుకున్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో ఎర్రజొన్న రైతులు, టీఆర్‌ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి, స్వీట్లుపంచారు. 'సీఎం కేసీఆర్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జిందాబాద్' అంటూ నినదించారు.



నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో సంబురాలు జరుపుకొంటున్న టీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

ఆజాద్ ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణకు ఆదేశం

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ : ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో 29మంది పోలీసులు న్యాయవిచారణకు ఆదేశిస్తూ ఆదిలాబాద్ కోర్టు తీర్పు చెప్పింది. గురువారం కోర్టులో వాదనలు సాగగా, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై న్యాయ విచారణ జరిపించాలని న్యాయవాది కోరారు. సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తి భరత లక్ష్మి, 29మంది పోలీసులపై న్యాయ విచారణకు మున్సిఫ్ కోర్టును ఆదేశించారు.



విజయం సాధించిన మెదక్ మావెరిక్స్ జట్టు

మల్లిక్ సెంచరీ ధమాకా

■ మెదక్ మావెరిక్స్ విజయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: మెదక్ మావెరిక్స్ ఆటగాడు మల్లిక్ సెంచరీతో కదం తొక్కడంతో కాకతీయ కింగ్స్‌పై మెదక్ 43 పరుగుల తేడాతో విజయం సాధించింది. తమ జట్టు గెలుపుపై ఫ్రాంచైజీ యజమాని జగన్మోహన్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. జీ.వెంకటస్వామి మెమోరియల్ టీ20 లీగ్‌లో భాగంగా ఇక్కడి ఎంఎల్ఆర్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన మెదక్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. మల్లిక్ 52 బంతుల్లో 8 ఫోర్లు, 9 సిక్సర్లతో 110 పరుగులు చేసి..టీటీఎల్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. ఇతనికి తోడు జైశ్వాల్ 39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో 81 పరుగులు చేసి అదురగొట్టాడు. 234 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించలేక కాకతీయ కింగ్స్ 20 ఓవర్లలో 191/8 పరుగులు చేసింది. వరంగల్ బ్యాట్స్‌మెన్‌లో యశ్వంత్‌రెడ్డి (49), యతిన్‌రెడ్డి 46 రాణించగా..మెదక్ బౌలర్ చైతన్య 3 వికెట్లు పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన మల్లిక్ లీగ్‌లో మొత్తం 180 పరుగులతో టాపర్‌గా ఉన్నాడు.



సెంచరీ సాధించిన మల్లిక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న మెదక్ మావెరిక్స్ యజమాని జగన్మోహన్‌రావు తదితరులు

ఆఖరి పంచ్ మనదైతే..

రికార్డు స్థాయిలో వన్డే సిరీస్ వశం
● ప్రయోగాలకే కోహ్లీ మొగ్గు

సెంచూరియన్: వన్డే సిరీస్‌ను 4-1తో ఇప్పటికే గెలుచుకున్న టీమ్‌ఇండియా ఆఖరిదైన ఆరోవన్డేలో ప్రయోగాలు చేయాలని భావిస్తున్నది. ఐదో వన్డే గెలుపు అనంతరం కెప్టెన్ విరాట్ కోహ్లీ చెప్పిన మాటల ప్రకారం తుది జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశం కనిపిస్తున్నది. ప్రయోగాలు చేసినప్పటికీ 5-1తో సిరీస్‌ను ముగించడమే తమ లక్ష్యమని కోహ్లీ తెలిపాడు. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్‌లోనూగెలిస్తే మరో అరుదైన రికార్డును సొంతం చేసుకోనున్నది. 2001-02లో ఆస్ట్రేలియా 5-1తో దక్షిణాఫ్రికాను ఓడించి వన్డే సిరీస్‌ను దక్కించుకున్నది. సఫారీలకు తమ సొంతగడ్డపై ఇప్పటి వరకు ఇదే అత్యంత ఘోర ఓటమి. ఇప్పుడు టీమ్‌ఇండియా కూడా 5-1తో గెలిస్తే ఆస్ట్రేలియా రికార్డును సమం చేయనుంది. ఇక ఆరో వన్డేకు ముందు టీమ్‌ఇండియా ప్రాక్టీస్‌లో పాల్గొనకుండా సేద తీరింది.

ప్రయోగాలకు వేళాయె!

రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించాలని కోహ్లీ వ్యాఖ్యానించడంతో ఇప్పటి వరకు తుది జట్టులో చోటు దక్కని ఆటగాళ్లలో ఆశలు చిగురించాయి. వీరిలో మనీశ్‌పాండే, దినేశ్ కార్తీక్, అక్షర్ పటేల్, శర్దుల్ ఠాకూర్, మహ్మద్ షమీ ఉన్నారు. కేదార్ జాదవ్, శ్రెయాస్ అయ్యర్‌కు రెండు సార్లు అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. ముఖ్యంగా అయ్యర్ రెండు మ్యాచ్‌ల్లో క్యాచ్‌లు వదిలేసి నిరాశపరిచాడు. దీంతో పాండే, దినేశ్ కార్తీక్‌కు మార్గం సుగమమైంది. మణికట్టు స్పిన్నర్లు చహాల్, కుల్దీప్‌లలో ఒకరికి విశ్రాంతి ఇచ్చి అక్షర్ పటేల్‌కు అవకాశం ఇవ్వడం ఖాయమనిపిస్తున్నది. ఒకవేళ కోహ్లీ, ధవన్ రెస్ట్ తీసుకుని మనీశ్, రహానేల్లో ఒకరిని రోహిత్‌కు జతగా ఓపెనర్‌గా ప్రమోట్ చేసే అవకాశాలూ లేకపోలేదు. మొత్తానికి భారత బ్యాటింగ్ కూర్పు ఎలా ఉంటుందనేది విశ్లేషకులు సైతం అంచనా వేయలేకపోతున్నారు.



మోర్కెల్, రబాడలో ఒకరికి విశ్రాంతి..?

దక్షిణాఫ్రికా జట్టు పెద్దగా మార్పులు చేర్పులు చేసేలా కనిపించడం లేదు. ఓపెనర్ ఆమ్లా గత మ్యాచ్‌లో ఫాంలోకి రావడం ఆ జట్టుకు ఊరట కలిగించే అంశం. డివిలీయర్స్ నుంచి భారీ ఇన్నింగ్స్ ఆశిస్తున్నది. డుమినీ, మిల్లర్, క్లాసెన్ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. సీనియర్ పేస్ బౌలర్ మోర్నీ మోర్కెల్‌కు విశ్రాంతి ఇచ్చి, మోరిస్‌ను తీసుకునే అవకాశం ఉన్నది. ఎంగ్డీ, పెలుక్వాయో, రబాడ జట్టులో కొనసాగనున్నారు. బ్యాటింగ్‌లో బెహార్డిన్, జోండోలలో ఒకరిని తుది జట్టులో చేర్చొచ్చు.

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్),ధవన్/మనీశ్, రోహిత్, రహానే, పాండ్య, ధోనీ, జాదవ్/శ్రెయాస్, అక్షర్‌పటేల్, చహాల్/కుల్దీప్, శార్దుల్, షమీ

దక్షిణాఫ్రికా: మర్క్రమ్ (కెప్టెన్), ఆమ్లా, డివిలీయర్స్, డుమినీ, క్లాసెన్, మిల్లర్, పెలుక్వాయో, రబాడ/మోరిస్, ఎంగ్డీ, మోర్కెల్, షమ్సి

పిచ్, వాతావరణం

స్లో వికెట్, భారత్‌కు కలిసొచ్చే అంశం. పేస్ బౌలర్లు చమటోడ్చాల్సిందే. ఇదే వేదికపై రెండో వన్డేలో దక్షిణాఫ్రికా 118 పరుగులకు ఆలౌటైంది. ఆకాశం మేఘావృతమై మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నది.

హాకీ జట్టుకు స్పాన్సర్‌గా ఒడిశా ప్రభుత్వం

న్యూఢిల్లీ: భారత హాకీకి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఒడిశా ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా భారత పురుషుల, మహిళల హాకీ జట్లకు తొలిసారి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నది. హాకీని ప్రమోట్ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు. గురువారం 'లోగో', రెండు జట్లకు సంబంధించిన జెర్సీలను ఆయన ఆవిష్కరించారు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్), ఐవోఏ అధ్యక్షుడు నరీందర్ బాత్రా, ఐవోఏ సెక్రటరీ జనరల్ రాజీవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారత బాక్సర్లకు 5 స్వర్ణాలు

జకర్తా: ఆసియా గేమ్స్ బాక్సింగ్ టెస్టు ఈవెంట్‌లో భారత బాక్సర్ల పంచ్ అదిరింది. గురువారం జరిగిన పోటీల్లో ఐదు స్వర్ణాలు, ఓ రజతం, నాలుగు కాంస్యాలు గెలిచారు. పవిత్ర, కే శ్యామ్ కుమార్ , షేక్ సల్మాన్ అన్వర్, మనీష్ కౌశిక్ (60 కేజీ), ఆశిష్ (64 కేజీ)లకు స్వర్ణాలు లభించాయి. సెమీస్ బౌట్‌లో శశి చోప్రా (57 కేజీ) 0-5తో రచ్చడా పోర్న్ సవాటో (థాయ్‌లాండ్) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.



జోరు కొనసాగేనా.!

ఈస్ట్ లండన్: ధనాధన్ క్రికెట్‌లో భారత మహిళల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. శుక్రవారం జరిగే రెండో టీ20లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో కౌర్ బృందం 1-0 ఆధిక్యంలో ఉంది. హైదరాబాద్ అమ్మాయి మిథాలీ, స్మృతి మందన మరోసారి శుభారంభాన్నిస్తే భారీ స్కోరు ఖాయం. తొలి మ్యాచ్‌లో విఫలమైన హర్మన్‌ప్రీత్ కౌర్ గాడిలో పడాల్సిన అవసరం చాలా ఉంది. ఇక మిడిలార్డర్‌లో 17 ఏండ్ల జెమీమా రొడ్రిగ్వేజ్, వేదా కృష్ణమూర్తి మరోసారి కీలకంకానున్నారు. ఆల్‌రౌండర్ రాధా పాటిల్, వికెట్ కీపర్ నుజ్హత్ పర్వీన్ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఒక్కరు చెలరేగినా ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. బౌలింగ్‌లో వెటరన్ జులన్ గోస్వామి లేకపోవడం భారత్‌కు అతిపెద్ద లోటు. కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడిన పూజా వస్త్రేకర్ సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైంది. అనుభవజ్ఞురాలు శిఖా పాండే విఫలమవుతుండటం భారత్‌కు ప్రతికూలాంశం. మరోవైపు సొంతగడ్డపై వన్డే సిరీస్‌తో పాటు తొలి మ్యాచ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా పరువు కోసం పాకులాడుతున్నది. వరుస పరాజయాలతో జట్టులో ఆత్మవిశ్వాసం బాగా దెబ్బతిన్నది. చోలే ట్రయోన్ మినహా మిగతా బ్యాట్స్‌వుమన్ వైఫల్యం జట్టు ఓటమిపై తీవ్ర ప్రభావం చూపింది. లాజెల్లీ లీ, నికెర్క్, క్లెర్క్, నొజోకి కచ్చితంగా బ్యాట్లకు పని చెప్పాల్సిందే.



సూపర్ జెమీమా

(నమస్తే తెలంగాణ స్పోర్ట్స్‌డెస్క్)

ప్రస్తుతం భారత మహిళల క్రికెట్‌లో సూపర్ సంచలనం జెమీమా రొడ్రిగ్వేజ్. దేశవాళీ మ్యాచ్‌ల్లో మెరుపులు మెరిపించిన ఈ ముంబై అమ్మాయి రాకెట్ వేగంతో జాతీయ జట్టులో చోటు సంపాదించింది. దక్షిణాఫ్రికాతోనే వన్డే, టీ20ల్లో అరంగేట్రం చేసిన రొడ్రిగ్వేజ్.. దశాబ్ద కాలంగా మహిళల జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన మిథాలీని తలపిస్తున్నది. జెమీమా క్రికెట్ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. దక్షిణాఫ్రికాకు చెందిన స్కూల్ క్రికెటర్ షానియా లీ స్వార్ట్ కెరీర్ గుర్తుకొస్తుంది. ఓ టీ20 మ్యాచ్‌లో మిగతా అమ్మాయిలందరూ కలిపి 9 పరుగులు చేస్తే లీ స్వార్ట్ 86 బంతుల్లో 160 పరుగులు బాదేసింది. ఆ తర్వాత అండర్-19 వన్డే టోర్నీలో 289 పరుగులతో హోరెత్తించింది. సరిగ్గా లీ స్వార్ట్‌కు అపుడేటేడ్ వర్షన్‌గా జెమీమా భారత్‌లో లభించింది. ఇంటర్ స్టేట్ వన్డే టోర్నీలో గుజరాత్ ఆడిన తొలి రోజే జెమీమా 178 పరుగులు చేసింది. అయితే అందరూ ఇది గాలివాటం అనుకున్నారు కానీ.. వారం తిరిగే సరికి సౌరాష్ట్రపై 163 బంతుల్లోనే 202 పరుగులు చేసి సంచలనాలకు తెరలేపింది. 2013లో స్మృతి మందన 224 (150 బంతుల్లో) పరుగులు చేసినా పెద్దగా గుర్తింపు దక్కలేదు. కానీ జెమీమా డబుల్‌తో ఒక్కసారిగా అన్నీ వెలుగులోకి వచ్చాయి. జులన్, హర్మన్‌ప్రీత్, వేద, దీప్తి, దేవికా ఇలా ఒక్కో బ్యాట్స్‌వుమెన్ పేర్లు ప్రాచుర్యంలోకి వచ్చారు.

తెలంగాణ స్పోర్ట్స్‌స్కూల్స్ విద్యార్థులకు 13 పతకాలు



శామీర్‌పేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జనవరి 9 నుంచి 13వతేది వరకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో నల్గొండలో, ఫిబ్రవరి 3 నుంచి 5వ తేది వరకు అండర్ 19 విభాగంలో మహారాష్ట్రలోని షోలాపూర్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో 19 మంది (4 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య) 13 పతకాలు సాధించినట్లు స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ డాక్టర్ నర్సయ్య గురువారం తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోడి.భవాని ప్రసాద్, ఆర్‌కె.బోస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నాం

■ రవాణామంత్రి మహేందర్ రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: హైదరాబాద్ నగరం, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో గురువారం మొట్ట మొదటి 'కేసీఆర్ తైక్వాండో కప్ 'పోటీలను రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్)చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. 3 రోజుల పాటు కొనసాగే ఈ చాంపియన్‌షిప్‌లో 29 జిల్లాల నుంచి 1360 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

మెట్రో



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ మహేశ్ భగవత్

వీడిన నరబలి మిస్టరీ

ఇంటి యజమానులే ప్రధాన నిందితులు
పాప ఉసురుతీసిన మూఢనమ్మకాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన చిలుకానగర్ నరబలి కేసు మిస్టరీ వీడింది. శిశువు తల దొరికిన ఇంటి యజమానులే మూఢ నమ్మకాలతో చంద్రగ్రహణం రోజు పాప గొంతుకోసి హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. క్యాబ్‌డ్రైవర్ రాజశేఖర్, ఆయన భార్య శ్రీలతను గురువారం అరెస్ట్ చేశారు. మొండెంతో పాటు శిశువు తల్లిదండ్రుల కోసం గాలిస్తున్నారు. ఎల్బీనగర్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ క్యాంపు కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ వివరాలు వెల్లడించారు. క్లూస్‌టీం ఈ నెల 9న రాజశేఖర్ ఇంట్లో, బంగ్లాపై సేకరించిన రక్తపు నమూనాలు ఒకటేనని ఫోరెన్సిక్ నివేదిక వచ్చిందని, దీంతో రాజశేఖర్ దంపతులను నిందితులుగా గుర్తించామన్నారు. హత్యకు గురైన పాప 3-6 నెలల వయసు ఉండొచ్చన్నారు.

కోయదొర సలహాతో..

హైదరాబాద్ ఉప్పల్‌లోని చిలుకానగర్‌కు చెందిన కేరుకొండ రాజశేఖర్ భార్య శ్రీలత నాలుగేండ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నది. రెండేండ్ల కిందట మేడారం జాతరకు వెళ్లినప్పుడు ఓ కోయదొర పరిచయమై నరబలి చేస్తే దుష్టశక్తి వదులడంతోపాటు భార్యాపిల్లల ఆరోగ్యం బాగుంటుందని వారికి చెప్పాడు. ఈ మేరకు సంపూర్ణ చంద్రగ్రహణమైన ఫిబ్రవరి 1న ఆడ శిశువును బలిచ్చేందుకు నిర్ణయించారు. రాజశేఖర్ సికింద్రాబాద్ బోయిగూడలో ఫుట్‌పాత్‌పై భిక్షాటన చేసేవారి గుంపులో ఓ ఆడశిశువు ఉన్నట్టు గుర్తించాడు. ఫిబ్రవరి 1న తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో తన ఇంటి నుంచి కొబ్బరి బోండాలు నరికే కత్తి, పాల బాటిల్, ప్లాస్టిక్ కవర్‌ను వెంట పెట్టుకొని కారులో బయలుదేరాడు. బోయిగూడలో శిశువును కిడ్నాప్ చేసి నగర శివారులోని ప్రతాపసింగారం వద్ద ఉన్న మూసీ ఒడ్డుకు చేరుకున్నాడు. అక్కడ శిశువు గొంతు కోసి రక్తం మొత్తం కారిపోయే వరకు అక్కడే ఉన్నాడు తర్వాత తలను ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకొని మొండాన్ని, కత్తిని మూసీలో పడేశాడు.

ఇంట్లో క్షుద్ర పూజలు

ఇంటికి వచ్చిన తర్వాత రాజశేఖర్, శ్రీలత కలిసి తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో క్షుద్ర పూజలు చేశారు. శిశువు తలపై సూర్యోదయ కిరణాలు పడాలని చెప్పడంతో బంగ్లాపైకి వెళ్లి వాయువ్యంలో తలను పెట్టాడు. తెల్లారిన తర్వాత మాదాపూర్‌కు వెళ్తూ శిశువు తలను తీసుకొచ్చిన ప్లాస్టిక్ కవర్‌ను నాచారంలోని జీహెచ్ఎంసీ చెత్త డబ్బాలో పడేశాడు. పూజల సమయంలో రాజశేఖర్ తన ఇద్దరు కుమారులను అత్తగారింటికి పంపాడు. రాజశేఖర్ మేనత్త బాలలక్ష్మి అదేరోజు ఉదయం 11 గంటల ప్రాంతంలో అతడి ఇంటిపై బట్టలు ఆరేస్తుండగా శిశువు తలను గుర్తించి కేకలు వేసింది. దీంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో భాగంగా రాచకొండ పోలీసులు రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సహకరించలేదు. పైగా ఇంటి పక్కన ఉండే నరహరి, కనకరాజుపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసుల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నించాడు. పోలీసులు 122 మంది ఫోన్ల కాల్ డేటా, 54 సెల్ టవర్ డంప్‌లు, 40 మంది సాక్షులు, 45 మంది అనుమానితులు, 100 సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రాజశేఖర్, శ్రీలత నరబలి గురించి మాట్లాడుకున్నట్టు కాల్ రికార్డింగుల్లో గుర్తించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక సాయంతో వారే నిందితులని తేల్చారు. మొండెం కోసం గజ ఈతగాళ్లతో మూసీలో గాలిస్తున్నారు. కేసు ఛేదనలో కీలక ఆధారాలు అందించిన హైదరాబాద్ క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ వెంకన్నను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వర శర్మ, ఎస్‌వోటీ అదనపు డీసీపీ రఫీక్, మల్కాజిగిరి ఏసీపీ సందీప్ పాల్గొన్నారు.

మురువనున్న మూసీ

● నది అభివృద్ధి, సుందరీకరణకు మాస్టర్‌ప్లాన్
● ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే, ఇరువైపులా రోడ్లు
● శాటిలైట్ మ్యాపులు, డ్రోన్‌తో సర్వే
● ప్రణాళికలు రూపొందించాలని మంత్రి కేటీఆర్ ఆదేశం
● వర్షాకాలంలోపు 50 చెరువులను అభివృద్ధి చేస్తామని వెల్లడి



మూసీ, నగరంలోని చెరువుల అభివృద్ధిపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మూసీ మురువనున్నది.. మురికికూపంగా మారిన ఈ నదిని సుందరీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా వడివడిగా అడుగులు వేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన మూసీని స్వరాష్ట్రంలో ప్రభుత్వం పరిరక్షించడంతోపాటు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే బృహత్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. ఇందులో భాగంగానే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నది అభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించింది. మూసీకి పూర్వ వైభవాన్ని తేవడానికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని పురపాలకశాఖ మంత్రి కే తారక రామారావు అధికారులను ఆదేశించారు. మూసీ అభివృద్ధి, సుందరీకరణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలని, ఇందుకు నది మొత్తాన్ని సర్వే చేయాలన్నారు. గురువారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యక్రమాలు, మూసీ నది, నగరంలోని చెరువుల అభివృద్ధిపై అధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. గతంలో ఉన్న శాటిలైట్ మ్యాపులతో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సుమారు 40 కిలోమీటర్లను డ్రోన్ వంటి అత్యాధునిక టెక్నాలజీతో సర్వే చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుకూలంగా నదికి ఇరువైపులా రోడ్లు, నదిపై నుంచి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే, ఈ రెండింటి కలయికతో కూడిన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. వీటికి అయ్యే ఖర్చు, సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని చెప్పారు. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న రోడ్లకు అనుబంధంగా రూపకల్పన చేస్తున్న బ్రిడ్జీల డిజైన్లు, నిర్మాణం సైతం చారిత్రక, సంస్కృతికి అద్దం పట్టేలా ఉండాలన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రణాళిక

నగర పరిధిలోని చెరువుల అభివృద్ధి ప్రణాళికపై సమీక్షించిన మంత్రి కేటీఆర్ ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న చెరువులను దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకొని దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఏడాది వర్షాకాలంనాటికి కనీసం 50 చెరువులను అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే 20 చెరువుల అభివృద్ధి, సుందరీకరణ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు మంత్రికి వివరించారు. వీటితోపాటు దుర్గం చెరువు సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వర్షాకాలంనాటికి ఆయా చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలిగించడంతోపాటు బండ్ అభివృద్ధి చేయడం లాంటి పనులు ప్రారంభించాలని మంత్రి తెలిపారు. చెరువులను అభివృద్ధి చేసే లోపల అవి కబ్జా కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడాలన్నారు. సమావేశంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ జనార్దన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ సురేశ్‌కుమార్, అర్బన్‌ఫారెస్ట్రీ డైరెక్టర్ శ్రీనివాస్, హెచ్ఎండీఏ ప్లానింగ్ ఇంచార్జి డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్ఈలు మాజీద్ షరీఫ్, కృష్ణారావు, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మెట్రోస్టేషన్లలో మీ సేవ కేంద్రాలు

మోడల్ స్టేషన్‌గా మియాపూర్.. ప్రత్యేక డిజైన్లతో స్టాల్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మెట్రోరైలు స్టేషన్లు ప్రయాణసౌకర్యాన్ని అందించడంతోపాటు వ్యాపారకేంద్రాలుగా మారనున్నాయి. ఇప్పటికే ప్రతి స్టేషన్‌లో దుకాణాల ఏర్పాటుకు స్థలాలను ఏర్పాటు చేయగా, తాజాగా మెట్రోస్టేషన్లలో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో మెట్రో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా వీటిని అందుబాటులోకి తెస్తున్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఆన్‌లైన్ సేవలు విస్తరిస్తున్నాయి. ప్రతి పౌరుడికి మీ సేవ కేంద్రాల సేవలు నిత్యావసరంగా మారాయి. మెట్రోరైలు మూడు కారిడార్లు అందుబాటులోకి వస్తే అత్యధిక మంది వ్యక్తిగత వాహనాలను వదిలిపెట్టడంతోపాటు, రోడ్డు రవాణాను వదిలి మెట్రోను ఆశ్రయించే అవకాశమున్నది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న మెట్రో అధికారులు మీ సేవ కేంద్రాలతోపాటు ఇతర అవసరాలను కూడా తీర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్రో ప్రయాణికుడికి నిత్యావసరాలతోపాటు ఎంటర్‌టైన్‌మెంట్, షాపింగ్ అవసరాలు తీర్చేలా మెట్రోప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే మాల్స్‌ను నిర్మించిన అధికారులు ప్రస్తుతం స్టేషన్లలో ఏర్పాటు చేసే స్టాల్స్‌పై దృష్టిసారించారు. ఫుడ్‌కోర్టులు, జిరాక్స్ సెంటర్లు, దవాఖానలు, ప్రాథమిక వైద్య సేవలు అందించే సేవలు, కూరగాయలు, బుక్‌సెంటర్లు ఇలా ప్రతి అవసరాన్ని స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రయాణికుడు రైలు ఎక్కే ముందు లేదా దిగే ముందు తమ అవసరాలు తీర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటన్నింటినీ మెట్రోస్టేషన్ మొదటి అంతస్తులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మోడల్ స్టేషన్‌గా మియాపూర్

ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి వస్తువు దొరికేలా మెట్రోరైలు ప్రాజెక్టులోని మియాపూర్ స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే మియాపూర్ స్టేషన్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన అధికారులు, స్టోర్స్ విషయంలో కూడా దీనికే ప్రాధాన్యం ఇచ్చారు. పండ్లు, కూరగాయలు, మీ సేవ కేంద్రం, ఫ్యాషన్ స్టోర్స్, జిరాక్స్ సెంటర్లు, క్యాబ్, రెంట్ ఏ బైక్, మొబైక్ వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటగా ఇక్కడ అన్ని స్టోర్స్‌ను అభివృద్ధి పరిచి రోల్‌మోడల్‌గా తయారుచేసి దీని మాదిరిగా ఇతర స్టేషన్లను తీర్చిదిద్దుతారు. ఇందుకు స్టోర్స్ ఏర్పాటు చేసే గదులను ప్రత్యేక డిజైన్‌తో రూపొందిస్తున్నారు. డిజైన్‌పై ఎల్ అండ్‌టీ ప్రత్యేక దృష్టిపెట్టింది. అంతర్జాతీయ స్థాయి హంగులతో విమానాశ్రయాల్లో ఉండే స్టాల్స్‌ను పోలి ఉండేలా డిజైన్ చేస్తున్నారు.



కుతుబ్ షాహీ టూంబ్స్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

నగరంలో ఇరాన్ అధ్యక్షుడి పర్యటన

నేడు మక్కామసీదులో ప్రత్యేక ప్రార్థనలు
కుతుబ్‌షాహీ టూంబ్స్ సందర్శన

హైదరాబాద్ సిటీబ్యూరో/చార్మినార్/మెహదీపట్నం, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహాని శుక్రవారం మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా, సీపీ శ్రీనివాస్‌రావు, మైనారిటీల అభివృద్ధిశాఖ సెక్రటరీ దానకిశోర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రత, పారిశుద్ధ్యం పరంగా లోటు రావొద్దని కలెక్టర్ అధికారులకు సూచించారు.

పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

ఇరాన్ అధ్యక్షుడి పర్యటన సందర్భంగా శుక్రవారం ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్టు సీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. హోటల్ తాజ్ కృష్ణా నుంచి ఎన్ఎండీసీ, సరోజినీదవాఖాన, మెహిదీపట్నం మీదుగా కుతుబ్‌షాహీ టూంబ్స్ వరకు ఉదయం 8:30-9:15 గంటల మధ్య, తిరిగి ఇదే మార్గంలో 10:45-11:30 గంటల మధ్య ఇరాన్ అధ్యక్షుడు ప్రయాణిస్తారు. మధ్యాహ్నం 12:10-ఒంటిగంట మధ్య తాజ్ కృష్ణా నుంచి మక్కా మసీదు మధ్య ఖైరతాబాద్ ఫ్లైఓవర్, ఎన్టీఆర్ ఘాట్(గార్డెన్), లిబర్టీ జంక్షన్, బషీర్‌బాగ్ ఫ్లైఓవర్, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, నయాపూల్, సిటీ కాలేజీ ఎక్స్ రోడ్, ముర్గీచౌక్ మీదుగా మక్కా మసీదు వెనుక గేటుకు చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో హిమ్మత్‌పురా, మోతిగల్లీ, హైకోర్టు వెనుక మార్గం, ఎంజే మార్కెట్, అబిడ్స్, నాంపల్లి, పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ, లక్డికాపూల్, మసాబ్ ట్యాంక్ మీదుగా తాజ్‌కృష్ణకు చేరుకుంటారు. సాయంత్రం 5-5:45 గంటల వరకు తాజ్ కృష్ణ నుంచి బేగంపేట విమానాశ్రయం మార్గంలో నాగార్జున సర్కిల్, పంజాగుట్ట ఫ్లైఓవర్, సీఎం క్యాంప్ ఆఫీస్ మీదుగా బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆయా సమయాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ తెలిపారు.

పింకీ హత్యకేసులో మరో ఇద్దరి అరెస్ట్

పోలీసుల అదుపులో వికాస్, అమర్‌కాంత్ ఝా



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ విశ్వప్రసాద్

శేరిలింగంపల్లి: క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించిన గర్భిణి పింకీ కశ్యప్ హత్యకేసులో మిగితా ఇద్దరు నిందితులు వికాస్, అమర్‌కాంత్ ఝాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే మమతా ఝా, అనిల్ ఝాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. గురువారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ వివరాలు వెల్లడించారు. హత్య అనంతరం బీహార్‌కు పారిపోయిన అమర్‌కాంత్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేయగా, కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాత తమ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు. పింకీ భర్త వికాస్ బుధవారం తన పానీపూరీ బండిని తీసుకురాగా మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారన్నారు. పింకీని పథకం ప్రకారమే హత్య చేశారని చెప్పారు. ఎనిమిది రోజుల ముందే స్టోన్ కట్టర్‌ను, నల్లటి కవర్లను కొన్నారని, మృతదేహాన్ని ఎక్కడ పారేయాలో ముందే రెక్కీ నిర్వహించారన్నారు. జనవరి 27న రాత్రి పింకీపై మొదట మమత దాడిచేయగా, తర్వాత అమర్ కాంత్, వికాస్ కొట్టి, గొంతు నులిమి చంపినట్టు చెప్పారు. ఆమె పెనుగులాడకుండా కాళ్లను అనిల్ ఝా గట్టిగా పట్టుకున్నాడన్నారు. సమావేశంలో మాదాపూర్ ఏసీపీ శ్యాంప్రసాద్, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ గంగధర్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'తో ఆరోగ్యరంగంలో విప్లవం

■ అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోదీ



ఇటానగర్ బహిరంగసభలో గిరిజన సంప్రదాయ దుస్తుల్లో మోదీ

ఇటానగర్, ఫిబ్రవరి 15: 'ఆయుష్మాన్ భారత్ యోజన' పథకం అమలుతో ఆరోగ్య రంగం రూపురేఖలే మారిపోనున్నాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దీని వల్ల 50 కోట్ల మంది పౌరులకు కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున చౌకగా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో 'టొమో రిబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్' ఏర్పాటుకు గురువారం ఆయన శంకుస్థాపన చేసిన తర్వాత ఇందిరాపార్క్ వద్ద జరిగిన సభనుద్దేశించి మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ యోజన పథకం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రభుత్వ ఆరోగ్య పరిరక్షణ పథకం అని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు నూతన ఆరోగ్య విధానాన్ని రూపొందించాలని పెమాఖండూ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అరుణాచల్ గిరిజనుల సంప్రదాయ దుస్తులు ధరించిన ప్రధాని మోదీ.. ఈ రాష్ట్రం భారత్‌లో ప్రధాన భూభాగమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతిని అంతమొందించేందుకు ఆధార్ ద్వారా వివిధ పథకాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)ని అమలు చేయడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.54 వేల కోట్లు ఆదా అయ్యిందన్నారు. అనంతరం రాష్ట్ర సచివాలయాన్ని, డోర్జీ ఖండూ రాష్ట్ర కన్వెన్షన్ సెంటర్‌ను మోదీ ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాలను గత యూపీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు.

మోదీ అరుణాచల్ పర్యటనపై చైనా నిరసన

అది తమ భూభాగమని పునరుద్ఘాటన

బీజింగ్, ఫిబ్రవరి 15: అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్ ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చైనా ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్ తమ దక్షిణ టిబెట్‌లో భాగమని పేర్కొన్న చైనా.. సరిహద్దు సమస్యలను క్లిష్టతరం చేసే చర్యలకు పూనుకోవద్దని భారత్‌ను కోరింది. చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ అరుణాచల్ పర్యటనపై భారత్‌కు దౌత్యపరంగా తీవ్ర నిరసన తెలియజేస్తామన్నారు. చైనా – భారత్ సరిహద్దుపై తమ వైఖరి స్పష్టంగా ఉన్నదని గెంగ్ పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా గుర్తించలేదని, వివాదాస్పద ప్రాంతంలో భారత ప్రధాని పర్యటనను గట్టిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రెండు దేశాల మధ్య సరిహద్దు రేఖగా మెక్‌మోహన్ లైన్ నిర్ధారణ చట్టవిరుద్ధమని గెంగ్ అన్నారు. తమ భూభాగాలను భారత్‌లో కలిపేందుకు 1914లో బ్రిటన్ మెక్‌మోహన్ రేఖ నిర్ధారణకు ప్రయత్నించిందన్నారు.

విజయ్ మాల్యకు జీవన భృతి మూడు రెట్లు పెంపు

లండన్: మద్యం వ్యాపారి విజయ్‌మాల్యకు జీవన భృతిగా వారానికి 18,325.31 (రూ.16,46,235.90) పౌండ్లు ఇవ్వాలని లండన్‌లోని బ్రిటన్ హైకోర్టు ఆదేశించింది. సాధారణ జీవన భృతితో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. ఆయనకు చెందిన 150 కోట్ల డాలర్ల ఆస్తులను జప్తు చేయడంతో చిక్కుల్లో పడ్డ మాల్య జీవన భృతి కోసం వారానికి 18,325.31 పౌండ్లు అలవెన్స్ ఇవ్వాలని గత నెల 30న జస్టిస్ రాబిన్ నోలెస్ ఆదేశించారు. ఇంతకుముందు లండన్ హైకోర్టు ఆయనకు వారానికి 5,000 పౌండ్ల డాలర్ల అలవెన్స్ ఇవ్వాలని ఆదేశించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌తో లీజుకు సంబంధించిన కేసులో బ్రిటన్ హైకోర్టు ప్రతికూల తీర్పు చెప్పడంతో మాల్య చిక్కుల్లో పడ్డారు. దీంతో ఆయన తరఫు న్యాయవాదులు తమ కక్షిదారు జీవన అలవెన్స్ పెంచాలని పిటిషన్ దాఖలు చేశారు. హవాలా, మోసం కేసుల్లో మాల్యను అప్పగించాలని కోరుతూ భారత్ ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసింది.

ట్రంప్ ఇమ్మిగ్రేషన్ బిల్లుకు సవరణ ప్రతిపాదన

వాషింగ్టన్, ఫిబ్రవరి 15: విదేశీయులకు గ్రీన్‌కార్డుల జారీలో దేశాలకు కోటా విధించాలన్న ట్రంప్ ప్రతిపాదనకు సెనేట్‌లో చుక్కెదురైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన నూతన ఇమ్మిగ్రేషన్ బిల్లుకు ఎగువసభలో సవరణలను ప్రతిపాదించారు. విదేశీయులు అమెరికాలో ఉద్యోగం చేయాలంటే అత్యంత అనుభవం ఉన్న నిపుణులను, మెరిట్ ఆధారంగా మాత్రమే అనుమతించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీన్‌కార్డుల జారీలోనూ దేశాలకు కోటా విధించాలని ప్రతిపాదిస్తూ నూతన ఇమ్మిగ్రేషన్ బిల్లుకు రూపకల్పన చేసింది. ఈ బిల్లు బుధవారం అమెరికా ఎగువ సభ ముందుకు వచ్చింది. చర్చలో భాగంగా సెనేటర్ ఒర్రిన్‌హాచ్ గ్రీన్‌కార్డుల జారీలో దేశాల వారీగా కోటా విధించాలన్న నిబంధనను ఎత్తివేయాలని ప్రతిపాదించారు. మెరిట్ ప్రాతిపదికన విదేశీ నిపుణులకు ఉద్యోగఅవకాశాలు కల్పించాలన్న ప్రతిపాదనకు సమ్మతించారు. ఈ సవరణకు ఆమోదం లభిస్తే అమెరికాలో భారీ ఎత్తున స్థిరపడిన ప్రవాస భారతీయులు, చైనీయులకు ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు చెప్తున్నారు.

III.

నమస్తే తెలంగాణ

విహారం

[హైదరాబాద్]

శుక్రవారం 16 ఫిబ్రవరి 2018



హైదరాబాద్‌గా 'భాగ్య'నగరం

భాగ్యనగరం. ఈ పేరు కలిగిన నగరం ఎక్కడా ఉండకపోవచ్చు. ఉన్నా కూడా.. దీన్ని చూసే ఆ పేరు పెట్టి ఉండొచ్చు తప్ప, అంతకు ముందే పెట్టిందైతే కాకపోవచ్చన్నది చరిత్రకారుల అభిప్రాయం. అలాంటి భాగ్యనగరానికి ఆ పేరెలా వచ్చింది, ఆ పేరు హైదరాబాద్‌గా ఎలా మారింది..?

కుతుబ్‌షాహీ వంశస్థుల్లో నాలుగో చక్రవర్తి మహ్మద్ కులీకుతుబ్‌షా.. తన ప్రేయసి భాగమతి పేరిట భాగ్యనగరాన్ని నిర్మించాడని అందరికీ తెలుసు. సంప్రదాయాలను ఎదురించి ఆమెను ప్రేమ వివాహం చేసుకొన్న కులీకుతుబ్‌షా.. ధైర్యంగా కోటలోకి తీసుకొచ్చాడు. అనంతరం తన ఇల్లాలిగా భాగమతికి గొప్పస్థానాన్నే ఇచ్చాడు. ఆమె పేరిట తాను నిర్మింప తలపెట్టిన నగరానికి భాగ్యనగర్ అని నామకరణం చేసినట్టు చరిత్రకారులు చెబుతారు. అయితే ఆయన మంత్రివర్గంలో చాలా మందికి అది నచ్చలేదట. ముస్లింలకు ప్రతినిధిగా ఉండాల్సిన రాజు.. నగరానికి ఆ పేరును పెట్టడం సహించలేకపోయారట. ఆ పరిస్థితుల ప్రభావానికి తలొగ్గిన కులీ కుతుబ్‌షాకు పేరు మార్పునకు మించి మరోమార్గం లేకపోయింది. అయితే అందులోనూ భార్యమీద ప్రేమను చూపించాడు ఈ అసఫ్‌జాహీ ప్రభువు. భాగమతిని హైదర్ మహల్ బిరుదుతో సత్కరించి.. అదే బిరుదుతోనే భాగ్యనగరాన్ని హైదరాబాద్‌గా మార్చేశాడని చరిత్రకారులు చెబుతుంటారు. అయితే కులీ కుతుబ్‌షా మాత్రం హైదరాబాద్‌ను భాగ్యనగరంగా వ్యవహరించేవాడట. కాలక్రమేణా భాగ్యనగరం హైదరాబాద్‌గా మారిపోయింది.



మనసు మెచ్చే వనాలు

అందమైన వనాలంటే అందరికీ ఇష్టమే. పచ్చని దుప్పటి పరుచుకొన్నట్టు ఉండే.. గార్డెన్‌లో నడుస్తుంటే ఆ ఆహ్లాదమే వేరు. మరిన్ని ప్రత్యేకతలతో కూడిన తోటలైతే చూపు తిప్పుకోనివ్వవు. శ్వాసలో శ్వాసగా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి. జీవితాంతం గుర్తుండిపోతాయి. ప్రపంచంలోనే అద్భుతమైన వనాలుగా గుర్తింపు పొందిన కొన్ని అంతర్జాతీయ వనాల (ఇంటర్నేషనల్ గార్డెన్స్) విశేషాలివి. కచ్చితంగా మీ మనసును దోచేస్తాయివి.

మోన్ట్రియల్ బొటానికల్ గార్డెన్

అద్భుతమైన కళాకృతులతో, ప్రకృతి మనోహరంగా అలంకరించబడి ఉండే ఈ గార్డెన్.. కెనడాలోని క్యూబెక్‌లో ఉన్నది. 1931లో స్థాపించబడిన ఈ సుందరమైన వనం.. కొన్నేళ్లలో చుట్టూ ఉన్న ప్రదేశాలకూ విస్తరించింది. ఇక్కడ కనిపించే విశేషాలు, యాత్రికుల మనసు దోచేస్తాయనడంలో సందేహం లేదు.

మాజోరెలె

మొరాకోలోని మరాకెచ్‌లో వెలిసిన పన్నెండెకరాల వృక్షసంపద ఇది. 1920లో ప్రముఖ చిత్రకారుడు జాక్యస్ మాజోరెలె దీన్ని స్థాపించాడు. అందుకే ఈ వనానికి ఆయన పేరు పెట్టారు. ఇక్కడ మరాకెచ్ ఇస్లామిక్ ఆర్ట్ మ్యూజియం కూడా ఉన్నది. ఇక్కడ కనిపించే కోబాల్ట్ నీలం స్వరాలు గార్డెన్‌ను మరింత అందంగా కనిపించేలా చేస్తాయి.



బుచార్ట్ గార్డెన్స్

కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలోని గ్రాండ్ గార్డెన్ ఇది. ముందు చిన్నగానే ఉండేది. కానీ పరిసరాలన్నింటినీ కలిపేసుకుంటూ అద్భుతమైన వనక్షేత్రంగా రూపుదిద్దుకున్నది. విక్టోరియా, బ్రిటీష్ కొలంబియాలో టాప్ టూరిస్టు ప్లేస్‌లలో ఒకటిగా నిలిచింది.



కెన్రోయు ఎన్ గార్డెన్

జపాన్‌లోని మూడు గొప్ప గార్డెన్స్‌లో ఇదీ ఒకటి. శాంతికి, ప్రశాంతతకి నిలయంగా పేరుగాంచింది. జపాన్‌లోని అత్యంత సుందరమైన వనాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. వసంతకాలంలో ఈ వనసౌందర్యం చూడదగినది. వికసించే చెర్రీలు పర్యాటకులను కట్టిపడేస్తాయి.



క్యూ గార్డెన్స్

లండన్‌లో ఉన్న అత్యద్భుతమైన గార్డెన్స్‌లో ఇది ప్రత్యేకమైనది. సుమారు 330 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ వనం.. యాభై వేలకు పైగా విభిన్న జాతుల మొక్కలను, చెట్లను కలిగి ఉన్నది. దీనిలో అందమైన శిలానైపుణ్యాన్ని కలిగిన భవనాలు, ఫామ్‌హౌస్‌లు భాగమై ఉన్నాయి. అందమైన సరస్సులు, ట్రీటాప్ వాక్‌వేలు మరింత ఆహ్లాదాన్ని పంచుతాయి.



రాయల్ బొటానిక్ గార్డెన్స్

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో దర్శనమిచ్చే ఈ గార్డెన్ వంద ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నది. ఇందులో ఉండే చిన్నారుల గార్డెన్ ప్రత్యేకమైనది. ఇదొక ఆదిమ వారసత్వ నడక. సహజ మూలికల ఆవిష్కరణ కేంద్రం. ఇంకోలా చెప్పాలంటే ఒక వేదశాల. విక్టోరియాలో చూడదగిన ముఖ్యమైన ప్రదేశమిది. ఏటా 1.5 మిలియన్ సంఖ్యకు పైగా విజిటర్స్ దీని సందర్శనకు వస్తారంటేనే దీని గొప్పదనాన్ని అర్థం చేసుకోవచ్చు.



విల్లా డి ఎస్ట్

చారిత్రక నేపథ్యం కలిగిన ఈ గార్డెన్ ఇటలీలోని టివోలీలో వెలిసింది. రోమన్ కల్చర్‌కు తగినట్టుగా శిల్పాలతో కళాత్మకంగా నిర్మితమైంది. సరస్సులు, కెనాల్స్, ఆకట్టుకొనే ఫౌంటేన్లు ఇక్కడ అదనపు ఆకర్షణ. ఈ గార్డెన్ బ్యూటీని వర్ణించడానికి మాటలు సరిపోవంటే అతిశయోక్తి కాదంటారు చూసిన వాళ్లు. అంతలా సందర్శకులను మైమరిపిస్తుందట విల్లా డి ఎస్ట్.



హిడ్‌కోట్ మనోర్

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉన్న అద్భుతమైన మానవ నిర్మిత వనమిది. మూడు తరాల మహిళల కళాతృష్ణకు, ప్రకృతి ప్రేమకూ ప్రతీక ఈ గార్డెన్. రొమాంటిక్ గార్డెన్‌గా పేరున్న వనం సహజమైన సౌందర్యంతో సందర్శకులను ఆకట్టుకుంటున్నది. వెళ్లినవారు వీలైనంత ఎక్కువ సమయం గడుపకుండా ఉండలేరు.



ట్రావెలాగ్-7

రోడ్డు కడిగే స్వీపర్ యంత్రం!

'విదేశాలకి ఫోన్ చేయాలంటే నా దగ్గర సిమ్ కార్డ్ 60 యువాన్స్‌కి దొరుకుతుంది. నిమిషానికి డెబ్బై సెంట్లు ఖర్చవుతుంది (సుమారు 43 రూపాయలు). ఇది అత్యంత చవకైన ధర. అవసరమైనవాళ్లు నా దగ్గర కొనచ్చు' అని చెప్పారు హేరిస్. కొందరు కొన్నారు. బహుశా చైనాలో టెర్రరిజం లేనందువల్ల ఇలా టూరిస్ట్‌లకి కాలింగ్ కార్డులు అమ్ముతూండవచ్చు. ఇదే మన దేశంలో ఐతే ఎన్నో పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

చైనాలో ఆఫీస్ టైమింగ్స్ ఉదయం ఎనిమిది నించి సాయంత్రం ఐదు దాకా. దుకాణాలు రాత్రి తొమ్మిదిన్నరకి మూసేస్తారు. 1976లో మావ్ తన ఎనభై మూడో ఏట మరణించాక ఆర్థికపరంగా చైనాలో అనేక రాజకీయ మార్పులు సంభవించాయి. పూర్వం ప్రజలకి అన్నీ ఉచితంగా లభించేవి. 1976కి మునుపు వైద్యం ఉచితం. ఇప్పుడు అమెరికాలోలాగా హెల్త్ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ఇప్పుడు గాలికి తప్ప మేము అన్నిటికీ డబ్బు చెల్లించాల్సి వస్తోంది. చైనా పెట్టుబడిదారీ వ్యవస్థ వైపు మళ్లింది. ఇక్కడ ఎన్నికలుండవు. చైనీస్ ప్రీమియర్‌ని కమ్యూనిస్ట్ పార్టీ ఎన్నుకుంటుందని హేరిస్ చెప్పాడు.

విశాలమైన రోడ్లని దాటడానికి రోడ్డు మీద కట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు చాలా కనపడ్డాయి. అవి హైదరాబాద్‌లో లాగా మూసేసి లేవు. కప్పు లేకుండా ఓపెన్‌గా వెడల్పుగా ఉన్నాయి. చాలామంది వాటిని వాడుతున్నారు. బీజింగ్ నార్త్ రైల్వే స్టేషన్ భవంతి కార్పొరేట్ బిల్డింగ్ అని భ్రమపడేలా ఉంది. మన దేశంలోని అన్ని ఫ్లై ఓవర్ల కన్నా ఒక్క బీజింగ్ నగరంలోనే అవి ఎక్కువగా ఉన్నాయనిపించింది. అటు ఇటు ముప్పై, అంతకంటే ఎక్కువ అంతస్థులున్న అనేక స్కై స్క్రేపర్స్ కనిపించాయి. చైనా ప్రజలకి వాక్ స్వాతంత్ర్యం లేదని ఓ సందర్భంలో తెలిసింది.

గంట ప్రయాణం తర్వాత మా బస్సు సాయంత్రం ఆరున్నరకి 'రూయీ బిజినెస్ హోటల్ ఆవరణలోకి చేరుకుంది. అది బీవా రోడ్, క్సిసేన్ హువాన్ వెస్ట్ ఆఫ్ గార్డెన్ బ్రిడ్జ్ దగ్గర ఉంది. బస్సు కింద లగేజ్ రేక్‌లోంచి డ్రైవర్ సామాను దింపాడు. వాటిని తీసుకుని అంతా లాబీలోకి వెళ్లాం. చెకౌట్ పన్నెండు. రాత్రి పదకొండు తర్వాత గదుల్లోకి సందర్శకు



లని అనుమతించరు. కీ కార్డ్ పోతే ముప్పై ఆర్‌యంబీలని చెల్లించాలి. నాలుగో అంతస్థులోని మా రూంకి వెళ్లాం.

స్నానం చేసి ఏడు ఇరవైకి లాబీలోకి వచ్చాం. హోటల్ రెస్టారెంట్ బయట చైనా సాంస్కృతిక డ్రెస్‌లో ఉన్న ఉద్యోగినితో పద్మజ ఫొటో తీయించుకుంది. బాంబే నుంచి వచ్చినవారిలో కొందరు పది నిమిషాలు ఆలస్యంగా రావడంతో బస్‌లోని వారంతా చప్పట్లు కొట్టారు. ఆ తర్వాత టూర్‌లో ఎవరూ ఆలస్యం చేయకుండా టైమ్‌ని పాటించారు. హేరిస్ బస్‌లో మళ్లీ టెలిఫోన్ కాలింగ్ (సిమ్) కార్డ్స్ గురించి చెప్పాడు.

'మీరు హోటల్ నించి ఫోన్ చేస్తే పదింతలు ఛార్జ్ చేస్తారు. బయట నించి ఫోన్ చేసినా ఎక్కువే చెల్లించాలి. కాబట్టి చవకలో నా నించి కాలింగ్ కార్డ్‌లని తీసుకోండి. బీజింగ్‌లో సబ్ వే, సిటీ బస్, టేక్సీలు రవాణా సాధనాలు. పసుపు పచ్చ టేక్సీ మినిమం ఫేర్ పది యువాన్స్. ప్రతీ కిలోమీటర్‌కి రెండు యువాన్స్. ఎంత దూరానికైనా సబ్ వే టిక్కెట్ 3 ఆర్‌యంబీ. బస్ టిక్కెట్ 1.2 ఆర్‌యంబీ. స్వంతంగా షాపింగ్‌కి వెళ్లాలనుకునేవారు హోటల్ విజిటింగ్ కార్డ్‌ని తీసుకువెళ్లడం మర్చిపోకండి' అని హెచ్చరించాడు.

ట్రాఫిక్‌లో క్రమశిక్షణ

రెండో రింగ్ రోడ్‌లో సిటీ సెంటర్ దగ్గర ఉన్న ఉడిపి ఇండియన్ రెస్టారెంట్‌కి చేరుకున్నాం. భోజనం రుచిగా ఉంది. దాని యజమాని పేరు డిసౌజా. కర్నాటక నించి వచ్చాడు. చైనీస్ భాష చక్కగా మాట్లాడగలడు. చైనీస్ కష్టపడి పనిచేసే స్వభావం కలవారని, చైనాలో జీవితం చాలా ప్రశాంతంగా ఉందని, మన దేశంలో లాగా అధికారుల వేధింపులు, లంచాలు పెద్దగా ఉండవని చెప్పాడు. పవర్‌కట్ సాధారణంగా ఉండదు. ఎప్పుడైనా ఉంటే ఫలారోజు ఫలానా సమయంలో పవర్ సప్లయి ఉండదనీ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోమని రెండు వారాల ముందే సమాచారం ఇస్తారట. తిరిగి ఇండియా వచ్చేస్తారా అని అడిగితే 'ఇండియాని మిస్ అవుతున్నా రాను. ఎందుకంటే ఇండియాలో లేని చాలా సౌకర్యాలని ఇక్కడ అనుభవిస్తున్నాను' అని చెప్పాడు.

రాత్రి తొమ్మిదీ ఐదుకి రెస్టారెంట్ నించి బయలుదేరాం. దారిలో ఓ వాటర్ ట్రక్ లోంచి సన్నటి జల్లులా నీరు బయటికి రోడ్ మీద స్ప్రే చేయబడుతూ కనిపించింది. దానికి ఉన్న యాంత్రిక చీపుర్లు రోడ్డుని కడుగుతున్నాయి. చైనీస్ క్రమశిక్షణ పాటిస్తారని వారి ట్రాఫిక్ చూస్తేనే అర్థమైంది. అది గమనించిన క్రమశిక్షణని ఇష్టపడని మా పర్యాటకుల్లోని ఒకరు గట్టిగా చెప్పారు. 'డబ్బుంటే జీవించడానికి ఇండియానే మంచి ప్రదేశం' అని.

నిజమే. ఇండియాలో మనిషిని చంపి కూడా డబ్బు వెదజల్లితే శిక్ష పడకుండా తప్పించుకోవచ్చు. సింగపూర్‌లో దేశ ప్రధాని రోడ్డు మీద ఉమ్మినా శిక్ష నించి తప్పించుకోలేడు. ఇతర దేశాలతో పోలిస్తే ప్రపంచంలో నాలుగింతలు మరణశిక్షని విధించేది చైనానే. ఐతే చైనాలోని ధనవంతులకి శిక్ష పడితే, వారు కొంత రుసుము చెల్లించి తమ బదులు మరొకరు జైలు శిక్షని అనుభవించేలా చేయవచ్చని ఎక్కడో చదివాను!

(ఇంకా ఉంది)

... మల్లాది వెంకట కృష్ణమూర్తి

సుడోకు

డైలీ సుడోకు 128 సమాధానం

2	6	5	1	9	3	4	7	8
1	4	3	5	8	7	6	9	2
9	8	7	2	4	6	3	5	1
6	5	2	3	1	4	9	8	7
4	7	8	9	5	2	1	6	3
3	9	1	6	7	8	2	4	5
5	3	4	7	6	1	8	2	9
7	2	6	8	3	9	5	1	4
8	1	9	4	2	5	7	3	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -129


3				6	7	4	5	1
			1				8	7
					8			
		5		2		1	9	
	3						2	
	6	2		3		8		
			9					
4	5				1			
6	9	7	5	4				8

ట్వీట్



వర్కవుట్ చేసిన తర్వాత తీసిన ఫొటో ఇది. జిమ్‌లో బుల్ వర్క్ చేసి మరీ ఇంతలా కష్టపడ్డాను. చాలా సంవత్సరాల నుంచి ఇంతగా కష్టపడినది తక్కువే. కచ్చితంగా జిమ్ ఆర్చివ్స్‌లో ఈ ఫొటో ఉండాల్సిందే!

షారూఖ్‌ఖాన్
@iamsrk



షారూఖ్‌ఖాన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

33, 324, 747

కామన్‌మ్యాన్ వాయిస్

ఏ వస్తువుకు అయినా.. అనుభూతికైనా మనం విలువ ఇస్తేనే ఆనందం కలుగుతుంది. వాటికి విలువ ఇవ్వకపోతే ఆనందం ఎక్కడిది? దేనికైనా 'స్పందన' ముఖ్యం!
– Madhusudan Perumandla

నువ్వు చేస్తున్న సాయానికి ప్రతిఫలం ఆశిస్తుంటే.. అది వ్యాపారమే కానీ, నీ దయాగుణం కాబోదు.
– Indravelli Ramesh

మాటల్లో సౌమ్యత చూపించడం గొప్ప సంగతి. సమయం వచ్చినప్పుడు గట్టిగా చెప్పాల్సి వచ్చినప్పుడు.. వారి మాటకు ఉండే విలువ అపారం.
– Sarojini Devi Bulusu

వైరల్ వీడియో



అల్లు అర్జున్ నటించిన 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' సినిమాలోని రెండవ పాట విడుదలైంది. 'అట్టా సూడకే..' అంటూ సాగే ఈ పాట ఇప్పుడు ట్రెండింగ్ లిస్ట్‌లో చేరింది.

Lover Also Fighter Also Lyrical | Naa Peru Surya Naa Illu India Songs | Allu Arjun, Anu Emannuel

Total views : 1,596,457+

Published on Feb 13, 2018